RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 13-02-2026 శుక్రవారం | సంపుటి : 12 | సంచిక : 349 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Follow us on

## కార్మిక చట్టాల సవరణలను నిలిపివేయాలి

- కార్మికులకు 8 గంటల పని దినాన్ని కొనసాగించాలి
- కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం రెగ్యూలర్ చేయండి
- ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకాన్ని ఆపాలి
- రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించండి

5



## నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- ఆశాలను పర్మినెంట్ చేయాలి
- దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్
- కడప ర్యాలీ

5






## జగన్ 'ఫిష్ ఆంధ్ర'.. అవినాష్ 'నాటుకోడి'..

### తెదేపా నేత బీటెక్ రవి

**పులివెందుల:**

ప్రతిపక్ష నేత హోదా లేదని మాజీ సీఎం జగన్ చెప్పడం ప్రజలను అవమాన పరచడమేనని పులివెందుల తెదేపా ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి అన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన బాధ్యత ఆయనపై ఉందని చెప్పారు. పులివెందులలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీటెక్ రవి మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్‌తో పాటు ఎంపీ అవినాష్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ''పులివెందుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరగా పరిష్కారం కావాలంటే అసెంబ్లీలో మాట్లాడటం చాలా అవసరం. ఇక్కడి సమస్యలను గాలికి వదిలి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. అరటి రైతులకు గిట్టుబాటు ధర లేదని చంద్రబాబు ప్రభుత్వంపై వైకాపా నేతలు బురదచల్లే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ధరలు బాగా పెరిగాయి. టన్ను అరటికాయలకు రూ.26వేల ధర ఉంది. ఎంపీ అవినాష్‌రెడ్డిని మూడుసార్లు గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజలకు ఉపయోగపడే అంశాలపై మాట్లాడటం లేదు. నాటుకోడి ధరల అంశాన్ని అక్కడ ప్రస్తావించడంపై ప్రజలు నవ్వుకుంటున్నారు. పులివెందుల ప్రాంత అభివృద్ధికి పరిశ్రమలు, ప్రాజెక్టులు తీసుకురావడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారు. గతంలో జగన్ ఫిష్ ఆంధ్ర అంటే.. ఇప్పుడు అవినాష్ నాటుకోడి అంటున్నారు. అభివృద్ధి అంటే ఇదేనా?'' అని బీటెక్ రవి నిలదీశారు.



## 3వ తరగతి నుంచే విద్యార్థులకు ఏఐ యాక్సెస్: ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ:**

ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో లానే విద్యారంగంలోను కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తుంది. ఈ కొత్త ఏఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి నుంచి అధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఈ కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం దిల్లీలో జరిగిన ఏఐ కాంక్లేవ్-2026 సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్‌లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు పూర్తిగా నిమగ్నమయ్యాయన్నారు. ప్రస్తుతం ఏఐ యాంత్రిక మేధస్సుతో పాటు మనుషుల భావోద్వేగాలను కూడా అర్థం చేసుకుంటున్న విషయాన్ని ప్రస్తావించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గొప్ప విజయమని అభివర్ణించారు. ఈ సమావేశానికి ముందు దిల్లీలో ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన ఎడ్‌టెక్ ఏఐ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 10 వినూత్న భారతీయ ఎడ్‌టెక్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో ఆయన సమావేశమయ్యారు.

# అంబటికి మళ్లీ రిమాండ్..

- సెంట్రల్ జైలుకు తరలింపు
- గుంటూరు స్పెషల్ ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ



**గుంటూరు:**

వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు కోర్టు మరోసారి 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ మేరకు గుంటూరు స్పెషల్ ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. సంక్రాంతి పండగ వేళ.. సత్తెనపల్లిలో లక్కీ డ్రా పేరుతో బలవంతంగా టికెట్లు కొనుగోలు చేసేలా వ్యవహరించిన కేసులో అంబటి రాంబాబుకు న్యాయమూర్తి ఈ రిమాండ్ విధించారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు అంబటి రాంబాబును భారీ బందోబస్తు నడుమ తరలించారు.

సంక్రాంతి పండగ వేళ సత్తెనపల్లిలో లక్కీ డ్రా పేరుతో టికెట్లు విక్రయించారు. వీటిని ప్రజలకు వైసీపీ నేత అంబటి రాంబాబు బలవంతంగా విక్రయించేలా చర్యలు చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆయనపై జనసేన పార్టీకి చెందిన నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో అంబటిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దాంతో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అంబటిపై పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ మేరకు అంబటిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. తాజాగా లక్కీ డ్రా కేసులో ఈ రోజు గుంటూరు కోర్టులో అంబటిని సత్తెనపల్లి పోలీసులు హాజరుపరిచారు. ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ.. స్పెషల్ ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దాంతో గుంటూరు నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు ఆయన్ని తరలించారు.



## తెదేపా ఎమ్మెల్యే కొలికపూడికి పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు

**అమరావతి:**

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌తో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశమయ్యారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో ఆయన మాట్లాడారు. కొలికపూడి వ్యవహార శైలిపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలుగా ఆయనకు పల్లా తీవ్ర హెచ్చరికలు చేశారు. పార్టీ లేకపోతే వ్యక్తిగతంగా జీరో అనే విషయాన్ని గుర్తించి ప్రవర్తించాలని హితవు పలికారు. పార్టీ క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునేందుకు సీఎం సిద్ధంగా లేరన్నారు. ఎన్నిసార్లు మందలించినా పద్ధతి మార్చుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తే పార్టీ.. ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు. వాట్సప్‌లో పిచ్చి స్టేటస్‌లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారని పల్లా నిలదీశారు. అనుభవరాహిత్యంతో పొరపాట్లు జరుగుతున్నాయని కొలికపూడి ఆయనకు వివరణ ఇచ్చారు. సీనియర్లు తనకు మార్గనిర్దేశం చేయాలని కోరారు.

## రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

### భాజపా ఎంపీ నిశికాంత్ దూబే డిమాండ్

**న్యూఢిల్లీ:**



కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని భాజపా ఎంపీ నిషికాంత్ దూబే ) డిమాండ్ చేశారు. ఈమేరకు అతని సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ నోటీసు ఇచ్చారు. ఇంకా ప్రచురితం కాని భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె పుస్తకం సహా పలు వివాదాస్పద అంశాలపైనా రాహుల్ గాంధీ, భాజపా ఎంపీల మధ్య తీవ్ర వాగ్వాదం నడిచిన సంగతి తెలిసిందే. ''రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నారు..? ఆయన చేతికి ప్రచురితం కాని పుస్తకం ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయన సంబంధాల గురించి ఆ నోటీసులో ప్రస్తావించాను. లోక్‌సభలో రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి'' అని దూబే అన్నారు. అయితే ఆయనపై సభా హక్కుల తీర్మానం తీసుకురావడం లేదని చెప్పారు. బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావన తీసుకువచ్చారు. అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పురీ పేర్లను పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికారపక్షం నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పదాలను తొలగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# విద్యాసంస్థల్లో వసతులకు ప్రతిపాదనలు..

### త్వరలో పనులు పూర్తి: మంత్రి లోకేశ్

**అమరావతి:**

రాష్ట్రంలోని పలు విద్యాసంస్థల్లో వసతుల కోసం ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపామని.. త్వరలోనే పనులు పూర్తిచేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, పలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అక్కడి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. దీనికి మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ప్రతిపాదన లేదని.. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తిరుపతిలో భక్తుల రాక పెరిగినందున తాగునీరు మరింత అవసరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీరు అందించే విషయాన్ని పరిశీలించాలని ఆయన కోరారు. దీనికి మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లు నీటిసరఫరాను పెంచుతామని చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గంలో లోచర్ల శివదావలస ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్యే బేబినాయన ప్రశ్నించగా.. వైకాపా హయాంలో టెండర్లు రద్దు చేసి పనులు నిలిపివేశారని మంత్రి రామానాయుడు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగుల బదిలీపై పోలవరం ఎమ్మెల్యే బాలరాజు ప్రశ్నించారు. దీనికి మంత్రి సంధ్యారాణి సమాధానం చెప్పారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కోర్టు కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోనందువల్ల సమస్యలు వచ్చాయన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



**ఐదు కంపెనీలకు మాత్రమే 99 పైసలకు భూములు**

ప్రైవేట్ కంపెనీలకు ఏపీ ప్రభుత్వం భూముల కేటాయింపుపై శాసనమండలిలో గురువారం చర్చ జరిగింది. ప్రైవేట్ కంపెనీలకు భూముల కేటాయింపుపై శాసనమండలిలో వాడివేడిగా చర్చించారు. ఈ చర్చలో భాగంగా ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. ఐదు కంపెనీలకు మాత్రమే 99 పైసలకు భూములు ఇచ్చామని స్పష్టం చేశారు. ఆయా కంపెనీలకు భూములు ఇవ్వొద్దంటే ఎలా? అని ప్రశ్నించారు. క్రెడిబులిటీ కంపెనీలకే భూములు కేటాయింపు జరుగుతోందని తేల్చిచెప్పారు. ఎంవోయూలు కుదుర్చుకున్నాకే కంపెనీలకు భూములు ఇచ్చామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.



## డిప్యూటీ సీఎం పవన్‌తో ఎమ్మెల్యే బాలకృష్ణ భేటీ

**అమరావతి:**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ భేటీ అయ్యారు. అసెంబ్లీలోని పవన్ ఛాంబర్‌లో ఆయన్ను కలిశారు. హిందూపురం నియోజకవర్గ సమస్యలపై ఆయనతో చర్చించారు. పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్సీ నాగబాబు కూడా కలిశారు. గిద్దలూరు నియోజకవర్గ సమస్యలపై పవన్‌కు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు.

## ఏపీ మద్యం కుంభకోణం.. రాజ్ కెసిరెడ్డే ఆర్కిటెక్ట్ : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:**



ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఏపీ మద్యం కుంభకోణం చాలా పెద్దదని.. అధికారులు కుమ్మక్కు కాకపోతే ఇలాంటివి జరగవని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. వారిని అరెస్ట్ చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వానికి రాజ్ కెసిరెడ్డి సలహాదారు మాత్రమేనని ఆయన తరఫు న్యాయవాది తెలపగా.. ఆ వాదనను సీజేఐ ధర్మాసనం తోసిపుచ్చింది. కెసిరెడ్డి సలహాదారు మాత్రమే కాదని.. మొత్తం స్కామ్‌కు ఆయనే ఆర్కిటెక్ట్ అని వ్యాఖ్యానించింది. పదవిలో ఉన్నవారి అండ లేకుంటే అధికారులు ఇలా చేయలేరంది. కెసిరెడ్డి జైలులో ఉండి ఇప్పటికే 10 నెలలు గడిచిపోయానని.. సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్లు కూడా దాఖలు చేశారని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. ఏం కాదని.. మరికొంతకాలం జైలులో ఉండనీయండని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. కెసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం ససేమిరా అంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేసేందుకు సిద్ధమైంది. అయితే పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కెసిరెడ్డి తరఫు న్యాయవాది పేర్కొనడంతో అనుమతించింది.




# జిల్లా అభివృద్ధి- పార్టీ విస్తరణే లక్ష్యం

### జిల్లా కార్యాలయాన్ని సందర్శించిన ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ

**విజయవాడ ఫిబ్రవరి 12 వుదయం న్యూస్ బ్యూరో:-**

ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన గద్దె అనురాధ, బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆటోనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలను సమగ్రంగా పరిశీలించి, పార్టీ కార్యకలాపాల నిర్వహణపై సవివరంగా సమాచారం తెలుసుకున్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు చేపడుతున్న ఎన్టీఆర్ జిల్లా నూతన పార్టీ కార్యాలయ నిర్మాణ పనుల పురోగతిపై ఆమె ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. త్వరలో జరగనున్న భూమిపూజ దృష్ట్యా గ్రౌండ్ క్లియరెన్స్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రణాళికలు, భవన రూపకల్పన, ప్రాథమిక వసతుల ఏర్పాటు తదితర అంశాలపై పార్టీ నాయకులు, సంబంధిత అధికారులతో చర్చించారు. నిర్మాణ పనులు వేగవంతం కావడానికి కాంట్రాక్ట్ సంస్థకు స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులపై దృష్టి సారించి, అవసరమైన సహకారం అందించాల్సిందిగా స్పష్టమైన సూచనలు చేశారు. భవిష్యత్‌లో జిల్లా పార్టీ కార్యాలయం శక్తివంతమైన కార్యకలాపాల కేంద్రంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని వ్యక్తిగతంగా పరిచయం చేసుకుని, రోజూ కార్యాలయానికి వచ్చే నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేస్తే జిల్లాలో పార్టీ మరింత బలపడుతుందని ఆమె పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి – పార్టీ విస్తరణే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంట్ (ఎన్టీఆర్ జిల్లా) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార



కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, శ్రేణులు, అభిమానులందరికీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ సైనిక దళిత కుటుంబ ఇళ్లు కూల్చివేత ఘటనపై ఇన్‌చార్జి కలెక్టర్‌కు అఖిలపక్షం వినతి

- నిష్పక్షపాత విచారణకు సిట్ ఏర్పాటు
- బాధిత కుటుంబానికి సత్వర న్యాయంకు డిమాండ్



**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** గణతంత్ర దినోత్సవం నాడు అర్ధరాత్రి కడప నగరంలోని కంది పాలెం ప్రాంతంలో జరిగిన దళిత కుటుంబ ఇంటి అర్ధరాత్రి జెసిబిలతో కూల్చివేత ఘటన జరిగి 18 రోజులైనప్పటికీ, ప్రభుత్వ స్పందన కరువైందనీ, వెంటనే తగు చర్యలు చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రిటైర్డ్ ఆఫీసర్లు, అఖిలపక్ష నాయకులు బాధిత కుటుంబ సభ్యులు కోరారు.గురువారం కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో అఖిలపక్ష నాయకులు , బాధిత కుటుంబ సభ్యులు కలిసి ఇన్చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నిధి మీనా కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గారిటైర్డ్ ఆఫీసర్లు జి గోపాల్, ఈ ఎన్ శ్రీనివాసులు,అఖిలపక్ష నాయకులు యన్.వెంకట శివ,జేవి రమణ, సంగటి మనోహర్, వనం హరికృష్ణ, అమీన్ పీరా, వడ్ల భాగ్యలక్ష్మి, తుల సిశ్వర్ రెడ్డి, సట్టి భారవి,సట్టి భాస్కర్ లు మాట్లాడుతూ రిపబ్లిక్ డే అర్ధరాత్రి కలెక్టరేట్ మెయిన్ రోడ్డు పక్కనే కందిపాలెం వద్ద మాజీ సైనిక్ కుటుంబం ఇళ్లను మద్యం, గంజాయి మత్తులో మరణాయుధాలతో అర్ధరాత్రి సమయంలో ఇంటిపై దాడి చేసి, మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు నిద్రిస్తున్న సమయంలో జెసిబిలతో ఇంటిని కూల్చివేయడం అత్యంత అమానుషమని పేర్కొన్నారు. ఇది కేవలం ఆస్తి ధ్వంసం మాత్రమే కాకుండా, దళితులపై దాడిగా మరియు రాజ్యాంగ విలువలపై దాడిగా భావిస్తున్నామన్నారు.

జాయింట్ కలెక్టర్ కి సమర్పించిన వినతి పత్రంలో ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణకు తక్షణమే స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలనీ, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులో నాన్ బెయిలబుల్ సెక్షన్ లు చేర్చాలని,క్రిమినల్ కాన్స్పిరసీ, హత్యాయత్నం, అక్రమ గుంపుగా చేరడం, ఆస్తి ధ్వంసం, మహిళలపై దాడి, రాత్రి అక్రమ ప్రవేశంవంటి సెక్షన్లు చేర్చాలన్నారు. గంజాయి, మద్యం మాదక ద్రవ్యాల యన్ డి పి ఎస్ సెక్షన్ లు చేర్చాలన్నారు. రిపబ్లిక్ డే నాటి అమానుష ఘటన పై వేగవంతమైన విచారణ చేపట్టాలన్నారు. సూత్రధారులు పాత్రధారులు అందరినీ రిమాండ్ పెట్టేందుకు వెంటనే అరెస్టు చేయాలని, వారు ఉపయోగించిన రెండు జెసిబిలు, కార్లు బైకులను తక్షణమే సీజ్ చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ 15ఎ ప్రకారం బాధితుల హక్కులు పూర్తిగా అమలు చేయాలనీ,ప్రభుత్వం నుండి తక్షణ ఆర్థిక సహాయం/పూర్తి పరిహారం మరియు ఇంటి పునర్నిర్మాణం చేపట్టాలన్నారు. ఘటనలో పోలీసు అధికారుల నిర్లక్ష్యం ఉందని వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలన్నారు.ఇల్లు కూల్చివేత ప్రాంగణంలోనే ఆరు రోజులుగా జరుగుతున్న నిరసన దీక్షల నేపథ్యంలో జిల్లా పరిపాలన స్పందన నామ మాత్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు రాజ్యాంగబద్ధమైన మరియు శాంతియుత ప్రజా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రాన్ని స్వీకరించి విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే నిందితులందరినీ త్వరితగతిన అరెస్టులు, సిట్ ప్రకటన, భద్రతా చర్యలు, న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందన్నారు.

## దూరవిద్య సమాచారం కోసం ప్రత్యేక డొమైన్

- యోగి వేమన విశ్వవిద్యాలయం
- ప్రారంభించిన వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్



**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** యోగి వేమన విశ్వవిద్యాలయం దూరవిద్య సంబంధిత సమగ్ర సమాచారం అందుబాటులోకి తెస్తూ వైవియూ వెబ్‌లో ప్రత్యేక డొమైన్ ను ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, దూరవిద్య సంచాలకులు ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఐటీ సెల్ డైరెక్టర్ ఆచార్య తుమ్మలకుంట శివ తో కలిసి డొమైన్ ను ప్రారంభించారు. సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ ( సి.డి.ఒ.ఇ) విశ్వవిద్యాలయ, అనుబంధ దూరవిద్య కేంద్రాలకు అవసరమైన సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. కోర్సులు, అడ్మిషన్ నోటిఫికేషన్లు, సిలబస్, ఫీజులు, విద్యార్థుల కాంటాక్ట్ క్లాసులు, ఎగ్జామ్స్ సంబంధించిన మోడల్ పేపర్లు, ఎగ్జామ్స్ షెడ్యూల్స్, లర్నింగ్ మెటీరియల్ ఇలా అన్ని అంశాలకు సంబంధించిన సమాచారం లభిస్తుందన్నారు. దూర విద్య సంచాలకులు ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ code.yvu.edu.in అనే వెబ్సైట్ సందర్శించి దూరవిద్య సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఇంకా ఈ సమావేశంలో దూరవిద్య సహా సంచాలకులు డాక్టర్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### బాధితురాలు నసీబ్ జాన్



**కడప, ఫిబ్రవరి 12 (వుదయం జిల్లా బ్యూరో)** పేద వర్గానికి చెందిన తమ స్థలాన్ని కబ్జా చేసిన జిలాని పై చర్యలు తీసుకుని తమకు తగిన న్యాయం చేయాలని కడప నగరం గుర్రాలగడ్డకు చెందిన నసీబ్‌జాన్ అధికారులను కోరారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. గత కొన్నిరోజులుగా తమకు ఎవరూ లేరని తమ స్థలం ఆక్రమణకు గురవుతోందన్నారు. తమ స్థలం ప్రక్కన గల జిలాన్ అనే వ్యక్తి దౌర్జన్య పూరితంగా వ్యవహరిస్తూ స్థల ఆక్రమణతో ముందుకు సాగుతున్నాడన్నారు. అతని వలన మాకు ప్రాణహాని ఉందని తెలిపారు. ఈ విషయంపై పలువురు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తమకంటూ ఎవరూ లేనందున తమ పట్ల దౌర్జన్యకరంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని తమ స్థలాన్ని తమకు అప్పగించడంతోపాటు తమకు తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నజీబ్‌జాన్, కమల్ బి, సాబీర్ ఉనీషా, సహచరులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రైతుల ప్రగతి సాధించే లక్ష్యంతో శిక్షణ శిబిరం

### నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ సందర్శన తో ముగిసిన శిబిరం

**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి12, (వుదయం జిల్లా బ్యూరో)** పశు సంవర్ధక ఉత్పత్తి మరియు నిర్వహణ విభాగం, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం మూడవ రోజు శిక్షణార్థులు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ను జమ్మలమడుగులో సందర్శించారు..ఈ సందర్భంగా జమ్మలమడుగు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్ రెడ్డి గొర్రెల పెంపకందారులకు క్రిమినాశనం టీకాలు, సమతుల్య ఆహార నిర్వహణ, ఆరోగ్య పరిరక్షణ, గృహ నిర్వహణ వంటి ముఖ్యమైన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా ఉత్పాదకత పెరిగి రైతులకు అధిక నికర ఆదాయం లభిస్తుందని వివరించారు.ఈ కార్యక్రమానికి శిక్షణ సమన్వయకర్త డాక్టర్ డి. ఇందిర నాయకత్వం వహించారు. డాక్టర్ విజయ్, డాక్టర్ జాన్ సుధాకర్, డాక్టర్ గాయత్రి, డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు. శిక్షణార్థులు ఫారంలో అమలవుతున్న ఆధునిక నిర్వహణ పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. దీంతో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ శిక్షణ ద్వారా గ్రామీణ గొర్రెల పెంపకందారులకు శాస్త్రీయ అవగాహన పెంపొందించి, గొర్రెల పెంపక రంగంలో నికర ఆదాయం ద్వారా రైతుల ప్రగతి సాధించడమే ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.



## కార్మిక చట్టాల సవరణలను నిలిపివేయాలి




- కార్మికులకు 8 గంటల పని దినాన్ని కొనసాగించాలి
- కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం రెగ్యూలర్ చేయండి
- ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకాన్ని ఆపాలి
- రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించండి

**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** సార్వత్రిక సమ్మెలో భాగంగా కడప నగరంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.యు.సి.సి నాయకులు జయ వర్ధన్, యుటియుసి నాయకులు సుబ్బరాయుడు, వెనుకబడిన ప్రాంతల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు నారాయణ, బహుజన సమాజ్వాది పార్టీ జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప, పి ఆర్ఎస్ వై ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ శంకర్, ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు ఆర్. యన్ రాజా లు మాట్లాడుతు....కార్మికుల హక్కులను కాపాడే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయం నేపథ్యంలో రూ. 15,000 కనీస వేతనం అమలు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. దేశంలో నరేంద్ర మోడీ సర్కార్ ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కాషాయకరణ పేరుతో ప్రభుత్వ పాలన కొనసాగిస్తుందని వారు వాపోయారు. దేశాభివృద్ధి అంటే కేవలం నాలుగు శాతం అభివృద్ధిని చూపించి, 96% పేదరికం ను చూపించకుండా నరేంద్ర మోడీ గొప్పలు చెప్పుకుంటూ ముందుకు సాగుతున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగు లేబర్స్ కోడులు అమలు జరిగితే కార్మిక లోకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని వారు దుయ్యబట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో నరేంద్ర మోడీ సర్కార్ ఉందని, దీనివల్ల గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ పథకంపై ఆధారపడి బతికే పేద బడుగు బలహీన వర్గాల జీవనం ఇబ్బందికరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. కాంట్రాక్టు విధానంతో ఉద్యోగ భద్రత కోల్పోతున్న కార్మికులకు న్యాయం చేయాలని, వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల సామాన్య ప్రజలకు నష్టం జరుగుతుందని, వాటాల అమ్మకాన్ని వెంటనే నిలిపివేయాలని తెలిపారు. 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, సగిలి రాజేంద్ర ప్రసాద్, గోపి, నాగేంద్ర, సుబ్బారావు, వెంకట సుబ్బయ్య, కనకరాజు, అఖిల్,గురవయ్య, దాదాపిర్, నరసింహ, అనిల్, చింటూ, తదితరులు పాల్గొన్నారు.




## ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదలపై లోకేష్‌కి కృతజ్ఞతలు

### ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్

**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయి 1200 కోట్లు విడుదల అయిన సందర్భంగా రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ( ఆర్ ఎస్ యు)రాష్ట్ర వ్యాప్తంగా థాంక్యూ లోకేష్ సార్ అంటూ అభినందన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అందులో భాగంగానే కడప నగరంలోని స్థానిక వై జంక్షన్ కూడలి లో గురువారం నాడు అభినందన కార్యక్రమంలో లోకేష్ బాబు ఫోటోలు పట్టుకొని కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కోసం ఆర్ ఎస్ యు జిల్లా ల వారి గా పోరాటాలు చేసిందని అందులో భాగంగానే విజయవాడ కేంద్రంగా ఫీజు రీఎంబర్స్మెంట్ విడుదల కోసం అన్ని జిల్లాల నాయకులతో కలుపుకొని భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించిన క్రమంలో నిన్నటి రోజున ఫీజు రియంబర్స్మెంట్ రియంబర్స్మెంట్ 1200 కోట్లు విడుదలైన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ పెండింగ్లో ఉన్న మిగిలిన ఫీజు రీయింబర్స్మెంట్ తొందర్లో విడుదల చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ యు రాష్ట్ర కమిటీ సభ్యుడు గురు మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య, కడప నగర కార్యదర్శి జశ్వంత్, కడప నగర సహాయ కార్యదర్శి వంశి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎంఆర్ లైనాక్ రేడియేషన్ చికిత్సలో కొత్త యుగానికి నాంది

### ప్రముఖ డాక్టర్ ఎం సునీత



**కడప, ఫిబ్రవరి 12,(వుదయం జిల్లా బ్యూరో)** యశోదా హాస్పిటల్స్ – హైటెక్ సిటీలో సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్టు క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సునీత మాట్లాడుతూ ఎంఆర్ లైనాక్ రేడియేషన్ చికిత్సలో కొత్త యుగానికి నాంది" అని వివరించారు. సాధారణంగా రేడియేషన్ థెరపీ తీసుకునే రోగులకు చాలా టెన్షన్ ఉంటుంది.'రేడియేషన్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయా?', 'భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు వస్తాయా?' అనే ప్రశ్నలు చాలా సాధారణంగా ఉంటాయి.అలాంటి భయాలను తగ్గించి, మరింత కచ్చితమైన, సురక్షితమైన రేడియేషన్ చికిత్స అందించడానికి మేము ఎంఆర్ లైనాక్ అనే అత్యాధునిక టెక్నాలజీని యశోదా హాస్పిటల్స్– హైటెక్ సిటీలో ప్రవేశపెట్టామని వివరించారు.ఇది ప్రపంచంలోని అత్యాధునిక రేడియేషన్ యంత్రాలలో ఒకటి.ఇందులో రెండు సాంకేతిక పరిజ్ఞానాలు ఎంఆర్ఐ స్కాన్ లీనియర్ యాక్సిలేటర్ (లైనాక్)లు ఒకే యంత్రంలో పనిచేస్తాయని, దీని ప్రత్యేకత ఏమిటంటే, ప్రతి రోజూ ట్రీట్మెంట్ ప్రారంభం కాకముందే రోగికి ఆటోమేటిక్‌గా ఎంఆర్ఐ స్కాన్ జరుగుతుందని, దాంతో ఆ రోజు ట్యూమర్ యొక్క ఆకారం, సైజు, స్థానం వంటి వివరాలు స్పష్టంగా తెలుస్తాయని, దీని ఆధారంగా రేడియేషన్ కేవలం ట్యూమర్ ఉన్న ప్రాంతానికే ఇవ్వబడుతుందని,పక్కన ఉన్న ఆరోగ్యకరమైన అవయవాలపై ఎటువంటి ప్రభావం ఉండదని ఆమె వివరించారు. సాధారణ రేడియేషన్ థెరపీలో పేషెంట్లకు తలనొప్పి, స్కిన్ ఇరిటేషన్, బలహీనత, వాంతులు, మూత్రంలో లేదా మోషన్‌లో రక్తం వంటి సైడ్ ఎఫెక్ట్స్ రావచ్చునని, కాని ఎంఆర్ లైనాక్ టెక్నాలజీతో ఇవన్నీ చాలా వరకు నివారించవచ్చునని, ఇది ప్రతి రోజూ శరీరంలోని మార్పులను గుర్తించి చికిత్సను ఆ మేరకు సర్దుబాటు చేసే సామర్థ్యం కలిగిన యంత్రమని క్షుణ్ణంగా మీడియాకు వివరించారు. వివిధ క్యాన్సర్లకు విస్తృతంగా ఉపయోగపడుతుంది. ప్రోస్టేట్ క్యాన్సర్, రెక్టల్ క్యాన్సర్, యుటరస్, సర్విక్స్, బ్లాడర్, లంగ్, ప్యాంక్రియాస్, బ్రెయిన్ ట్యూమర్లు వంటి కష్టమైన క్యాన్సర్లలో ఈ టెక్నాలజీ అద్భుతమైన ఫలితాలు ఇస్తోంది.

ముఖ్యంగా బ్రెయిన్ ట్యూమర్లలో ఎంఆర్ఐ గైడెన్స్ వల్ల ట్యూమర్ స్పష్టంగా కనిపించడంతో, రేడియేషన్‌ను మిల్లీమీటర్ స్థాయిలో ఇవ్వగలుగుతున్నామని అన్నారు. తక్కువ కాలంలో ఫలితం ఎంఆర్ లైనాక్ ట్రీట్మెంట్ సమయం చాలా తక్కువ కొన్ని సందర్భాల్లో కేవలం ఐదు రోజుల్లోనే పూర్తి చికిత్స పూర్తవుతుందని,ఇది రోగులకు మానసికంగా, శారీరకంగా కూడా పెద్ద ఉపశమనం ఇస్తుందని తెలిపారు. యశోదా హాస్పిటల్స్‌లో దేశంలోనే తొలిసారిగా ప్రపంచవ్యాప్తంగా చాలా అరుదుగా లభించే ఈ టెక్నాలజీని యశోదా హాస్పిటల్స్–హైటెక్ సిటీలో రెండు సంవత్సరాల క్రితం దేశంలో తొలిసారిగా ప్రవేశపెట్టింది.అప్పటి నుండి దేశీయ మరియు విదేశీ రోగులకు ఈ పద్ధతిలో అద్భుతమైన ఫలితాలు సాధించారని డాక్టర్ సునీత తెలిపారు.ఎంఆర్ లైనాక్ అనేది రేడియేషన్ చికిత్సలో నిజమైన విప్లవాత్మక మార్పు.ఇది రోగులకు అత్యధిక భద్రత, అత్యల్ప సైడ్ ఎఫెక్ట్స్ మరియు గరిష్ట కచ్చితత్వం అందించే సాంకేతిక అద్భుతమని, ఇది రేడియేషన్ థెరపీలో కొత్త యుగానికి నాందని వివరించారు.ఈ మీడియా సమావేశంలో డాక్టర్ సునీత తోపాటు యశోద హాస్పిటల్ – హైటెక్ సిటీ టీమ్ లీడర్ హరి కిరణ్ పాల్గొన్నారు.



## కార్మికులకు వేతనం రూ.26,000 ఇవ్వాలి

### వీఎన్పల్లిలో అంగన్వాడీ కార్మికుల సార్వత్రిక సమ్మె

**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా వీరపునాయుని పల్లెలో అంగన్వాడీ కార్మికులు సార్వత్రిక సమ్మెను చేపట్టి విధులను బహిష్కరించారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం లో రెవిన్యూ ఇన్స్పెక్టర్ సురేంద్రబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సంఘ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగమల్లేశ్వరి మాట్లాడుత కార్మికులు కు కనీస వేతనం 26000 ఇవ్వాలని డిమాండ్ చేసినారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడితే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవనీ హెచ్చరించారు. కేంద్రం కార్మికుల ను చిన్న చూపు చూస్తుంది అన్నారు.అంగన్వాడీ లను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించాలని అన్నారు.ఆశ వర్కర్స్, వీ ఆర్ ఏ, ఆటో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ వర్కర్ యూనియన్ నాయకురాళ్లు భవాని, సులోచన,లీలావతి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



## యునాని మెడికల్ కళాశాల రూ.70 కోట్ల మంజూరు

**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి యునాని మెడికల్ కళాశాల 70 కోట్ల రూపాయలతో మంజూరు అయినది.ఈ విషయాన్ని శాసనసభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. యునాని మెడికల్ కళాశాల మంజూరు చేసినందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ కి,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి Y. సత్య కుమార్ కి కృతజ్ఞతలు తెలిపిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి.ఈ కళాశాల నిర్మాణం కొరకు త్వరలో భూసేకరణ జరిపి కళాశాల నిర్మాణం మొదలు పెట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



## ఆరో రోజు రిలే నిరాహార దీక్ష

**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** కడప నగరం కంది పాలెం వద్ద న్యాయం కోసం కొనసాగుతున్న రిలే దీక్షలు గురువారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఆరవ రోజు దీక్ష కార్యక్రమాన్ని రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ జి గోపాల్ భారత రాజ్యాంగ పీఠిక పఠనంతో ఘనంగా ప్రారంభించారు. దీక్షలో కూర్చున్న వారు,పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అందరూ నిలబడి రాజ్యాంగ పీఠికను సమిష్టిగా చదివి రాజ్యాంగ విలువల పట్ల తమ అంకితభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా "రాజ్యాంగ హక్కుల పరిరక్షణ – న్యాయ పోరాట దీక్ష శిబిరం" అనే ప్లకార్డును ప్రదర్శిస్తూ, తమ ఉద్యమం పూర్తిగా రాజ్యాంగబద్ధమని స్పష్టం చేశారు. మేము ప్రభుత్వం వద్ద ఎలాంటి అనుచిత ప్రయోజనాలు కోరడం లేదని, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను అమలు చేయాలని మాత్రమే డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.

సిపిఐ నగర కార్యదర్శి యన్ వెంకట శివ అధ్యక్షతన జరిగిన దీక్ష వేదికపై మాట్లాడిన నాయకులు రిటైర్డ్ ఆఫీసర్ లు గోపాల్(పరిశ్రమల శాఖ, డి ఆర్ డి ఏ, ఎస్సీ కార్పొరేషన్) , న్యాయవాది ఈఎన్ శ్రీనివాసులు(రిటైర్డ్ డిఎఫ్ఓ), గుర్రప్ప (ఏపీ ట్రాన్స్కో), ప్రముఖ న్యాయవాది, బారసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ , మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మస్తాన్ వలి, మహాజన రాజ్యం సంగటి మనోహర్, ఎస్సీ ఎస్టీ రాయలసీమ హక్కుల నేత జేవి రమణ, ఆమ్ ఆద్మీ పార్టీ నేత డాక్టర్ శ్రీనివాసులు, ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు ఆర్ యన్ రాజ, లోక్ సత్తా శ్రీకృష్ణ, ఏయస్సీ హరికృష్ణ, సిఆర్పిఎఫ్ ఇల్లూరి సురేష్ , ఏపీ మహిళా సమాఖ్య భాగ్యలక్ష్మి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సుబ్బారావు లు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం ప్రజలకు గౌరవం ఇచ్చిందని, రాజ్యాంగం హక్కులు ఇచ్చిందని, ఆ హక్కులు అమలులోకి రావడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. బలహీన వర్గాల హక్కులు రక్షించబడే వరకు, నిజమైన న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్య మార్గంలో శాంతియుతంగా రాజ్యాంగ విలువలను ఆధారంగా చేసుకుని ఈ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. రిపబ్లిక్ డే నాడు కడప కంది పాలెం లో జరిగిన దారుణ ఘటనపై ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఆరవ రోజు దీక్షలో బాధిత కుటుంబ సభ్యులు సట్టి వనజ, సట్టి మాధవి,సట్టి నితీష్ కుమార్ సంఘీభావంగా వరప్రసాద్, భరత్ రెడ్డి లు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అమీన్ రామాంజనేయులు, రవికాంత్, ప్రసాద్, లక్ష్మి, మల్లికార్జున, యేసు రత్నం, శివ నాగేంద్ర, సుమతి, అయ్యవారప్ప, సునీల్, జేబికే ప్రసాద్, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.




## నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- ఆశాలను పర్మినెంట్ చేయాలి
- దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్

**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** బ్రిటిష్ కాలంలో పోరాడి ప్రాణాలు అర్పించి సాధించుకున్న కార్మిక హక్కులను నాలుగు లేబర్ కోడ్స్ గా దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆలోచన విధానాన్ని ఉపసంహరించుకోవాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, రాత్రివేళ లో స్కీమ్ వర్కర్లు, మహిళలా కార్మికులు పనిచేయాలని ఆలోచన ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే కల్పన, జిల్లా శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ ఎన్ విజయలక్ష్మి, నగర కార్యదర్శి బి శాంతమ్మ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కడప నగరంలో జరిగిన ర్యాలీలో పెద్ద ఎత్తున ఆశాలు పాల్గొని నాలుగు లేబర్ కోట్లు రద్దు చేయాలని, ఆశాలను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, జాతీయ సెలవులు పండగ సెలవులు సాధారణ సెలవులు ఇవ్వాలని కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఏ.ఎల్. నరసమ్మ, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కామనూరు శ్రీదేవి, కొండమ్మ, సటి శారదా, సురభి శ్రీదేవి, జయమ్మ, నారాయణమ్మ, దొరతి రాణి, మంజుల వాణి, నిర్మల, ప్రియదర్శిని, ఆశాలు పాల్గొన్నారు.

## కల్తీ నెయ్యి సరఫరా జరిగినట్లు స్పష్టమైన ఆధారాలు

### కావలి కూటమి నాయకులు



**కావలి, ఫిబ్రవరి 12, వుదయం న్యూస్:** ప్రతి ఒక్కరం దేవాలయాల ప్రతిష్టతను కాపాడటం మన బాధ్యతని, లడ్డు ప్రసాదంలో కల్తీ చేపట్టిన వారిని కఠినంగా శిక్షించాలని, భక్తుల విశ్వాసాన్ని కాపాడాలని కావలి పట్టణ కూటమి నాయకులు డిమాండ్ చేశారు. లడ్డులో కల్తీ జరగనే లేదని, వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారం పై వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా కావలి పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు నేతలు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో పాలన కల్తీ, అవినీతి, అక్రమాలతో నడిచిందన్నారు. తిరుమల లడ్డు వ్యవహారం, కల్తీ నెయ్యి సరఫరా, మద్యం వ్యాపారాల్లో అవకతవకలు, హవాలా లావాదేవీలు వంటి అంశాలపై విమర్శలు గుప్పించారు. తిరుమలలో తయారయ్యే లడ్డుల్లో ఉపయోగించిన నెయ్యి విషయంలో అనుమానాలు ఉన్నాయని, ఈ అంశంపై సిట్ దర్యాప్తు నివేదిక ప్రభుత్వానికి సమర్పించబడిందని తెలిపారు. కల్తీ జరిగిందా లేదా అన్నది రాజకీయంగా కాకుండా నిజాల ఆధారంగా పరిశీలించాలని వారు అన్నారు. అదేవిధంగా, అప్పటి పాలనలో హవాలా మార్గాల్లో నిధుల మళ్లింపు జరిగిందన్న ఆరోపణలు కూడా చేశారు. కొంతమంది వ్యక్తుల పేర్లపై కంపెనీలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా నిధులు చలామణి చేసినట్లు అనుమానాలు ఉన్నాయని, ఈ వ్యవహారాలను ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు పరిశీలిస్తున్నాయని తెలిపారు. వందల కోట్ల రూపాయల అవినీతి వెలుగులోకి వస్తుందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తప్పు చేసిన వారు ప్రజలకు క్షమాపణ చెప్పాలని, దేవాలయాల పవిత్రతను కాపాడటంలో రాజకీయాలకు అతీతంగా అందరూ బాధ్యత వహించాలని కోరారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, సిట్ నివేదికలు మరియు దర్యాప్తు సంస్థల ఆధారంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జనసేన కావలి పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయి విఠల్, టీడీపీ నాయకులు ఏగూరి చంద్రశేఖర్, కండ్లగుంట మధుబాబు నాయుడు, ఉప్పుటూరి బాలగురు స్వామి, తటవర్తి వాసు, తిరివీధి ప్రసాద్, దేవరకొండ శ్రీను, దావులూరి దేవకుమార్, హుస్సేన్, చవల రామకృష్ణ వల్లేరి వెంకట కిరణ్, కోట రమేష్, ఆత్మకూరు నాగలక్ష్మి, తల్లపనేని ప్రభాకర్, పులి రమేష్, పసుపులేటి బాబు రావు, పల్లపు మోహన్, శాంతి కుమార్, రసూల్, జెదిద్యా, తదితరులు పాల్గొన్నారు.

## రహదారి ప్రమాదాలపై అప్రమత్తత అవసరం




**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** యోగి వేమన యూనివర్సిటీ సూచన మేరకు కమలాపురం లోని సి ఎస్ ఎస్ ఆర్ అండ్ ఎస్ ఆర్ ఆర్ ఎమ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల చైర్మన్ సి.వి.రాజగోపాల్ రెడ్డి మరియు ప్రిన్సిపాల్ డా.పల్లాకృష్ణ అనుమతి మేరకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపును యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ప్రదీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆఖరి రోజు సమాజాభివృద్ధికి పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం అని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తబుట్టల్లో వేయాలని , ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అలాగే కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ వై. నాగ శిల్పదేవి గారి ఆధ్వర్యంలో ఆరవ రోజు "రోడ్డు భద్రత జీవన రక్షణ అనే అంశంపై ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ విభాగానికి చెందిన జే.శ్రీరాములు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జే.శ్రీరాములు మాట్లాడుతూ రహదారి ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని ,రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం మరియు ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్ల జరుగుతాయని తెలిపారు. ప్రమాదాల సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణనష్టం తగ్గించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.పల్లా కృష్ణ మాట్లాడుతూ వారం రోజులుగా విద్యార్థులు వీధులను శుభ్రపరచడం, రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించడం చేశారని విద్యార్థుల శ్రమను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఈ విషయంలో చాలా మార్గదర్శకంగా నిలిచారని అభినందించారు. కళాశాల చైర్మన్ సి.వి. రాజగోపాల రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజ పురోగతికి అభివృద్ధిలో భాగస్వామ్యం అయినప్పుడే సమాజం ప్రగతి పథంలో నడుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి



**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** స్థానిక శ్రీరాముల పేట వీధిలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో స్వామి దయానంద సరస్వతి జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ దయానంద సరస్వతి భారత దేశంలోనే గొప్ప సంఘ సంస్కర్త, ఆధ్యాత్మిక నాయకుడు మరియు ఆర్య సమాజ స్థాపకుడుగా పేరు గాంచారని , భారత స్వాతంత్ర ఉద్యమానికి ప్రేరణ కలిగించిన వారిలో ఒకరనిచెప్పారు. అలాగే ఈ సందర్భంగా ఎన్ టి ఆర్ వైద్య విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ టి డి వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆయన 1875 లో ఆర్య సమాజం స్థాపించి "బ్యాక్ టు వేదాస్" అనే నినాదంతో విగ్రహారాధన, జాతి వివక్ష , బాల్య వివాహాల వంటి ఆచారాలను వ్యతిరేకించి హిందూ సమాజంలో సంస్కరణల కోసం కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పంజగల మధుసూదన్ బాబు, సంస్కృత అధ్యాపకుడు రమణ , షేక్షావల్లి , శ్రీనివాసులు స్వామి విక్రమ్ పాల్గొన్నారు.



# జాతీయం - అంతర్జాతీయం



## వందేమాతరం ఉత్తర్వులను వ్యతిరేకించిన ముస్లిం లా బోర్డు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఉదయం) :** పాఠశాలలు, అధికారిక కార్యక్రమాలలో వందేమాతరం గేయాన్ని పూర్తిగా పాడటాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ రాజ్యాంగ విరుద్ధం, మత స్వేచ్ఛ, లౌకిక విలువలకు విరుద్ధమని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి) పేర్కొంది. ఈ ఆదేశం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉందని, మతపరమైన మైనారిటీల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తుందని ఎఐఎంపిఎల్‌బి ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ పాటలో దుర్గ, ఇతర దేవతల ఆరాధన, పూజకు సంబంధించిన ప్రస్తావనలు ఉన్నాయని, ఇవి ఇస్లామిక్ విశ్వాసాలకు విరుద్ధంగా ఉన్నాయని బోర్డు వాదించింది.ముస్లింలు ఏ భాగస్వామి లేకుండా ఒకే భగవంతుడైన అల్లాను మాత్రమే పూజిస్తారని, ఇస్లాం భగవంతునితో ఏ విధమైన భాగస్వాములను అనుబంధించడానికి అనుమతించదని ఎఐఎంపిఎల్‌బి పేర్కొంది. అందువల్ల అన్ని గేయం పూర్తిగా పాడటం ముస్లింలకు ఆమోదయోగ్యం కాదని వాదించింది. పాటలోని అనేక పాదాలు లౌకిక విలువలకు విరుద్ధంగా ఉన్నాయని భారత కోర్టులు గతంలో తీర్పు ఇచ్చాయని, వాటి గానాన్ని పరిమితం చేశాయని బోర్డు పట్టి చూపింది. నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, కేంద్ర ప్రభుత్వం ఆదేశాన్ని రద్దు చేయకపోతే కోర్టులను ఆశ్రయిస్తామని ఎఐఎంపిఎల్‌బి హెచ్చరించింది. ఇలా ఉండగా, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతానికి ముందు వందేమాతరంలోని ఆరు చరణాలను తప్పనిసరిగా పాడాలని హోం మంత్రిత్వ శాఖ చర్యపై సాజిద్ రషీది స్పందిస్తూ, ఈ పాట 1937 నుండి వివాదాస్పదంగానే ఉందని అన్నారు. వందేమాతరంలోని కొన్ని పంక్తులు ముస్లిం విశ్వాసాలకు విరుద్ధంగా ఉన్నాయని, ఆ కాలంలోని ప్రముఖ నాయకులు అబుల్ కలాం ఆజాద్,హుస్సేన్ అహ్మద్ మదనీతో సహా కాంగ్రెస్‌కు లేఖ రాశారని రషీది అన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఆ పంక్తులను తొలగిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించిందని ఆయన అన్నారు. రాజ్యాంగ హక్కులను ప్రస్తావిస్తూ, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ ఎవరిపైనా బలవంతంగా రుద్దరాదని హామీ ఇస్తుందని రషీది అన్నారు. వందేమాతరం గానం సమయంలో నిలబడని వ్యక్తిని దేశద్రోహిగా పరిగణించలేమని పేర్కొన్న 2016 సుప్రీంకోర్టు తీర్పును కూడా ఆయన ఉదహరించారు. ముస్లింలు తమ ప్రాణాలను అర్పించవచ్చు కానీ వారి భక్తితో రాజీ పడకూడదు. మన తలలు తెగిపోయినా, జాతీయ గీతంలోని ఆ ప్రత్యేక పంక్తులను మనం పాడం అని ఆయన అన్నారు.

## విజయ్‌మాల్యా తిరిగి రావలసిందే బాంబే హైకోర్టు



**ముంబై, ఫిబ్రవరి 12 (ఉదయం):** పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా భారతదేశానికి తిరిగి వచ్చే వరకు ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోమని బాంబే హైకోర్టు గురువారం స్పష్టం చేసింది. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల (ఎఫ్ఇఒ) చట్టంలోని నిబంధనలను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను పై బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మాల్యాను పరారీలో ఉన్న ఆర్థికనేరస్థుడిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ ఆయన తరపు న్యాయవాదులు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి చంద్ర శేఖర్, జస్టిస్ గౌతమ్ అఖండ్‌లతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్‌కు తిరిగి రావడంపై స్పష్టతనిచ్చేందుకు మాల్యాకు ఇదే చివరి అవకాశమని కూడా ధర్మాసనం పేర్కొంది. మాల్యా భారత్‌కు రానంటే ఈ పిటిషన్‌ను స్వీకరించలేమని తేల్చి చెప్పింది. మనీ లాండరింగ్, లోన్‌లు చెల్లించకపోవడం తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్ మాల్యా 2016 నుంచి బ్రిటన్‌లో ఉంటున్న విషయం తెలిసిందే. ఆయనపై ఇప్పటికే పీఎమ్ఎల్ఏ చట్టం కింద కేసు నమోదైంది. ఈ విషయమై విచారణ చేపట్టిన ప్రత్యేక న్యాయస్థానం 2019లో మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది. ఇక మాల్యాను భారత్‌కు రప్పించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేపట్టిన చర్యలు కీలక దశకు చేరుకున్నాయి.యమరోవైపు, విజయ్ మాల్యా కూడా కోర్టును ఆశ్రయించారు. తనను పరారీలో ఉన్న నేరస్థుడిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం2018 రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ మరో పిటిషన్‌ను దాఖలు చేశారు.

# రఫేల్ జెట్ల సేకరణకు రంగం సిద్ధం




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఉదయం):** భారత వైమానిక దళం కోసం 114 రఫేల్ యుద్ధ విమానాలు, భారత నావికాదళం కోసం ఆరు పి8I సముద్ర గస్తీ విమానాలు,యుద్ధ క్షిపణుల కొనుగోలుకు రక్షణ సముపార్జన మండలి (డిఎసి) గురువారం ఆమోదం తెలిపింది. కౌన్సిల్ సమావేశం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. భారత వైమానిక దళ స్క్వాడ్రన్ బలం 29కి పడిపోయిన సమయంలో ఈ ఆమోదం లభించింది.ఇది అధికారికంగా ఉండవలసిన 42 కంటే చాలా తక్కువ. ఇది దశాబ్దాలలో అత్యల్ప స్థాయి అని చెప్పాలి.

ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ రాబోయే పర్యటనకు ముందు రూ.3.25 లక్షల కోట్ల విలువైన ప్రతిపాదనకు డిఎసి ఆమోదం తెలిపింది. గత నెలలో రక్షణ సేకరణ బోర్డు ఆమోదం పొందిన తర్వాత, కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగడానికి ముందు, ఈ ప్రతిపాదనకు ఇప్పుడు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఎస్) నుండి తుది ఆమోదం అవసరం. ఈ ఒప్పందం పూర్తయిన తర్వాత, భారత వైమానిక దళం దాదాపు 150 రాఫెల్ జెట్‌ల సముదాయాన్ని నిర్వహిస్తుంది, భారత నావికాదళం 26 క్యారియర్‌అనుకూల రాఫెల్ విమానాలను చేర్చుకుంటుంది.ఎయిర్‌షిప్ బేస్డ్ హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ (ఎఎస్‌హెచ్ఎపిఎస్), యాంటీట్యాంక్ మైన్స్ (విభవ్) కొనుగోలు, ఆర్మర్డ్ రికవరీ వెహికల్స్ (ఎఆర్‌విలు), టి 72 ట్యాంకులు, ఇన్‌ఫాంట్రీ కంబాట్ వెహికల్స్ (బిఎంపి2) వాహన వేదికల మరమ్మత్తు కూడా ఈ ప్రతిపాదనలో ఉన్నాయి. భారత నావికాదళం కోసం, 4 ఎండబ్ల్యు మెరైన్ గ్యాస్ టర్బైన్ ఆధారిత ఎలక్ట్రిక్ పవర్ జనరేటర్, పి8I లాంగ్ రేంజ్ మారిటైమ్ రికనసెన్స్ ఎయిర్‌క్రాఫ్ట్ కోసం ఆవశ్యకత అంగీకారం (ఎఒఎన్) ఆమోదితమైంది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) కోసం, డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్ కోసం ఎలక్ట్రోఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్ వ్యవస్థ సేకరణ కోసం ఎఒఎన్ అనుమతి లభించింది.

**రఫేల్ జెట్‌లు**

మొదటి ఐదు రఫేల్ యుద్ధ విమానాలను 2020లో భారత వైమానిక దళంలోకి చేర్చారు. అప్పటి నుంచి, ఫ్రెంచ్ నిర్మిత విమానాలు భారతదేశ వైమానిక రక్షణ,సరిహద్దు రక్షణ సామర్థ్యాలలో కీలకమైన భాగంగా మారాయి. గత సంవత్సరం ఆపరేషన్ సిందూర్ సమయంలో, రఫేల్ జెట్‌లు నిర్ణయాత్మక పాత్ర పోషించాయి. వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ మార్షల్ నాగేష్ కపూర్, ఆపరేషన్ సిందూర్ సమయంలో రాఫెల్ ఖచ్చితంగా హీరో అని పేర్కొంటూ, వాటి పనితీరును పట్టి చూపారు.

**రక్షణ బడ్జెట్**

2026-27 కేంద్ర బడ్జెట్‌లో, రక్షణ మంత్రిత్వ శాఖకు రూ.7.8 లక్షల కోట్లు కేటాయించారు ఇది ఇప్పటివరకు అత్యధిక కేటాయింపు. ఇది మొత్తం కేంద్ర బడ్జెట్‌లో 14.67%, అన్ని మంత్రిత్వ శాఖలలో అతిపెద్ద వాటా. మొత్తం రక్షణ కేటాయింపులో, 27.95% మూలధన వ్యయం కోసం, 20.17% జీవనోపాధి, కార్యాచరణ సంసిద్ధత కోసం, ఆదాయ వ్యయం కోసం, 26.40% జీతభత్యాల కోసం, 21.84% రక్షణ పెన్షన్ల కోసం, 3.64% పౌర సంస్థలకు కేటాయించడం జరిగింది.

ఆధునీకరణ కోసం కేటాయించిన రూ.2.19 లక్షల కోట్లలో, రూ.1.85 లక్షల కోట్లు ప్రత్యేకంగా మూలధన సముపార్జన కోసం కేటాయించారు, ఇది 2025-26 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దాదాపు 24% పెరుగుదలను సూచిస్తోంది. రఫేల్ ఫైటర్ జెట్ ప్రోగ్రామ్‌తో పాటు, అధునాతన ఆయుధ వ్యవస్థలు, నౌకలు, జలాంతర్గాములు, మానవరహిత వైమానిక వాహనాలు (యుఎవిలు), డ్రోన్‌ల కోసం ఒప్పందాలతో సహా అనేక ప్రధాన సేకరణ ప్రాజెక్టులను రక్షణ మంత్రిత్వ శాఖ దృష్టిలో ఉన్నాయి.

### బోయింగ్ పి-8I పోసిడాన్




సుదూర సముద్ర నిఘా, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ విమానం అయిన బోయింగ్ పి8I పోసిడాన్, హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటా భారతదేశ వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడటంలో కీలకంగా మారింది. భారత నావికాదళం ప్రస్తుతం 12 పి8I విమానాల సముదాయాన్ని నిర్వహిస్తోంది, ఇవి సమిష్టిగా 40,000 కంటే ఎక్కువ ప్రమాద రహిత విమాన గంటలను నమోదు చేశాయి. ఈ విమానాలు నేవీ వైమానిక నిఘా నెట్‌వర్క్‌కు వెన్నెముకగా నిలుస్తాయి. దాని శక్తివంతమైన ఆకాశం నుంచి నిఘా సామర్థ్యాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

## రాజ్యాంగ విరుద్ధంగా జరిగిన ఎన్నికలను రద్దు చేయాలి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఉదయం):** ఈ ఓటర్లు లేని, చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికలను రద్దు చేయాలని బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా గురువారం డిమాండ్ చేశారు. అదే సమయంలో అవామీ లీగ్ లేనందుకు ఈ ఎన్నికలను బహిష్కరించి తిరస్కరించినందుకు ఓటర్లను ప్రశంసించారు. బంగ్లాదేశ్ ఎన్నికల కమిషన్ సీనియర్ కార్యదర్శి అక్తర్ అహ్మద్ ప్రకారం, మధ్యాహ్నం 2 గంటల నాటికి ఓటర్ల పోలింగ్ శాతం 50% కంటే తక్కువగా నమోదైంది. పోలింగ్ ముగిసిన తర్వాత, హసీనా ఒక ప్రకటన విడుదల చేస్తూ, ముఖ్యంగా ఢాకాలో ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య అసాధారణంగా పెరిగిందని, ఇది చాలా సందేహాస్పదంగా, నమ్మశక్యం కానిదిగా ఉందని అన్నారు. చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన మార్గాల ద్వారా అధికారాన్ని చేపట్టిన యూనస్ నిర్వహించిన నేటి ఎన్నిక తప్పనిసరిగా ప్రణాళికాబద్ధంగా సాగించిన ప్రహసనమే. ప్రజల ఓటింగ్ హక్కులు, ప్రజాస్వామ్య విలువలు. రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరించి, అవామీ లీగ్ లేకుండా, ఓటర్లు లేకుండా మోసపూరిత ఎన్నికను నిర్వహించారు అని ఆమె ఆరోపించారు. బుధవారం జరిగిన ఎన్నికల ఏర్పాట్లలో హింస చెలరేగిందని ఆమె అన్నారు. ఫిబ్రవరి 11 సాయంత్రం నుండి, పోలింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకోవడం, కాల్పులు జరపడం, ఓట్లు కొనడానికి డబ్బును విస్తృతంగా ఉపయోగించడం, బ్యాలెట్ పత్రాలను ముద్రించడం, ఫలితాల షీట్లపై ఏజెంట్ల సంతకాలను తీసుకోవడం ద్వారా ఈ ప్రహసనం ప్రారంభమైంది. ఫిబ్రవరి 12 ఉదయం నుండి, దేశవ్యాప్తంగా చాలా పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. రాజధాని, దేశంలోని ఇతర ప్రాంతాలలోని అనేక పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేకుండా పూర్తిగా ఖాళీగా ఉన్నాయి అని ఆమె చెప్పారు.2024లో విద్యార్థుల నేతృత్వంలోని జెన్ జీ ఉద్యమం షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేసినతర్వాత గురువారం జరిగిన ఎన్నికలు మొదటివి. సామూహిక నిరసనలు, దేశవ్యాప్తంగా అశాంతి చెలరేగిన తరువాత, నోబెల్ గ్రహీత ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అవామీ లీగ్ కార్యకలాపాలన్నింటినీ నిషేధించింది. తదనంతరం బంగ్లాదేశ్ ఎన్నికల కమిషన్ ఆ పార్టీ రిజిస్ట్రేషన్‌ను సస్పెండ్ చేసింది, ఆ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించింది. గతంలో బహిష్కరణల కారణంగా అవామీ లీగ్ ఎన్నికలలో పోటీ చేయలేదు, కానీ రాజకీయ ఎంపిక కంటే చట్టపరమైన, ప్రభుత్వ చర్య ద్వారా ఆ పార్టీ ఎన్నికలలో లేకపోవడం ఇదే తొలిసారి.

## ప్రతిపక్ష ఎంపీలకు వ్యతిరేకంగా మరో వీడియో విడుదల



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఉదయం):** పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం ఆగడం లేదు. ప్రతిపక్షం లోక్‌సభ స్పీకర్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చిన దరిమిలా, ప్రతిపక్ష ప్రవర్తనపై అధికార పక్షం వీడియోల మీద వీడియోలు విడుదల చేస్తోంది. పార్లమెంటులో ఇటీవల విపక్షాల నిరసనల దృష్ట్యా ప్రధాని నరేంద్ర మోదీని సభకు రావొద్దని సూచించినట్లు స్పీకర్ ఓంబిర్లా వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి దూసుకెళ్లి ఆయనను నిందించారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియో క్లిప్‌ను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన తాజాగా షేర్ చేశారు.

ఇది కాంగ్రెస్ ఎంపీ ఒకరు చట్టవిరుద్ధంగా తీసిన వీడియో. 20 నుంచి 25 మంది కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి ప్రవేశించి ఆయనను దుర్భాషలాడారు. ప్రధాని మంత్రి నరేంద్ర మోడీపై కూడా బెదిరింపు వ్యాఖ్యలు చేశారు. మా పార్టీ చర్చలను మాత్రమే ప్రోత్సహిస్తుంది. ఎంపీలు ఇలా బెదరింపులకు పాల్పడటాన్ని ఎన్నడూ ప్రోత్సహించదు అని రిజిజు ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

వీడియోలో పలువురు కాంగ్రెస్ ఎంపీలు, ప్రధానంగా మహిళా ఎంపీలు కనిపిస్తున్నారు. స్పీకర్ తన సీటులో కూర్చుని ఉండగా, ఈ ఎంపీలు లోపలకు వెళ్లినట్టు వీడియో ద్వారా తెలుస్తోంది. కాగా, గత వారంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై రిజిజు వెంటనే మీడియాతో మాట్లాడుతూ, జరిగిన ఘటనతో స్పీకర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారని చెప్పారు. సభలో స్పీకర్ రూలింగ్ ఇచ్చినప్పుడు వాళ్లు పాటించలేదు. తాను మాట్లాడేందుకు ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని రాహుల్ అంటున్నారు. అయితే స్పీకర్ అనుమతి లేకుండా సభలో ఎవరూ మాట్లాడకూడదు అని అన్నారు. ఛాంబర్‌లో నిరసన తెలుపుతున్న ఎంపీలను ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రోత్సహించారని కూడా రిజిజు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను ప్రియాంక గాంధీ తోసిపుచ్చారు. ఎంపీలు కేవలం తమ సమస్యలను చెప్పుకున్నారని, శాంతియుతంగానే ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు.

## రాహుల్‌పై హక్కుల ఉల్లంఘనా తీర్మానం లేనట్టే



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఉదయం):** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్గాం ధీపై ప్రభుత్వం హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం లేదని అధికారిక వర్గాలు చెప్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, రాహుల్గాం ధీ సభలో వాడిన చేసిన కొన్ని పదాలు, భాగాలను తొలగించే అవకాశం ఉంది, ఆయన చేసిన ఆరోపణలు ఆధారం లేనివి కావడం వల్లనే వాటిని రికార్డుల్లో నమోదు చేయడం లేదు. పార్లమెంటులో గాంధీ వ్యాఖ్యల తర్వాత రాజకీయ ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రభుత్వం అధికారిక హక్కుల తీర్మాన ప్రక్రియను ప్రారంభించకపోవచ్చు. అయితే ఆయన ప్రసంగంలోని కొన్ని భాగాలను తొలగించాలనే నిర్ణయం, సభలో చేసిన ప్రకటనలపై పరిశీలనను సూచిస్తోంది. హక్కుల ఉల్లంఘన తీర్మానం గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ, రాహుల్ జర్నలిస్టులపై విరుచుకుపడ్డారు, వారికి నిష్పాక్షికత లేదని ఆరోపించారు. మీడియా తమకు చెప్పిన దానిపై ఆధారపడి కథనాలను నడపకుండా ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు, అలా చేయడంలో విఫలమవడం దేశానికి "అపచారం" చేయడమేనని అన్నారు. ఇదిలా ఉండగా, భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపి నిషికాంత్ దూబే గురువారం కాంగ్రెస్ నాయకుడిపై సబ్‌స్టాంటివ్ మోషన్ ప్రక్రియను ప్రారంభించడానికి నోటీసు సమర్పించినట్లు తెలిపారు. పార్లమెంట్ భవన సముదాయంలో మాట్లాడుతూ, గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని దూబే డిమాండ్ చేశారు.




## మ్యాగీ స్మారక తపాలా స్టాంపు విడుదల



**వైజాగ్, ఫిబ్రవరి:** మ్యాగీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఒక ప్రత్యేక స్మారక తపాలా స్టాంపును విడుదల చేయడం పట్ల నెస్లే ఇండియా ఎంతో సంతోషిస్తోంది. ఈ స్టాంపును నెస్లే ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ తివారీ, భారత ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ స్టాంపు మ్యాగీ యొక్క పరిణామానికి, ఎప్పటికప్పుడు కొత్త పోకడలను అందిపుచ్చుకుంటూ, ఎంతో ఆదరణ పొందిన ఒక ఉత్పత్తి వర్గానికి పర్యాయపదంగా మారిన దానికి నివాళి. ఇన్ని తరాలుగా, ప్రతి ఒక్క పంచుకునే క్షణం ద్వారా ప్రజలను ఏకం చేస్తూ వస్తున్న మ్యాగీకి ఇది ఒక గౌరవం. గత ఐదు దశాబ్దాలుగా, మ్యాగీ భారతీయ ఇళ్లలోకి అనేక రుచికరమైన రూపాల్లో ప్రవేశించింది నూడుల్స్ మసాలాల నుండి సాస్‌లు, సూప్‌లు రెడీటుకుక్ ఇష్టమైనవి. త్వరిత సోలో ఫిక్స్‌ల నుండి కుటుంబాన్ని ఒకచోట చేర్చే భోజనాల వరకు హాస్టల్ కిచెన్‌ల నుండి పెద్ద సమావేశాల వరకు, మ్యాగీ దేశవ్యాప్తంగా లెక్కలేనన్ని ఆహార క్షణాలలో భాగంగా ఉంది. "50 సంవత్సరాల కలిసికట్టుగా" స్టాంప్ ఈ భాగస్వామ్య అనుభవాలకు నివాళి, మ్యాగీ భారతదేశం అంతటా టేబుల్‌లకు తీసుకువస్తున్న వెచ్చదనం, సౌకర్యం సంబంధాలను సంగ్రహిస్తుంది. భారత ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ, "భారతదేశంలో శుద్ధి చేసిన ఆహార రంగం దశాబ్దాలుగా గృహాల విశ్వాసాన్ని చూరగొనడంలో చాలా దూరం ప్రయాణించింది. మార్గదర్శక బ్రాండ్‌లు కొత్త విభాగాలను సృష్టించి, మన ఆహార పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేశాయి. ఈ అద్భుతమైన ప్రయాణంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు నేను మ్యాగీకి అభినందనలు తెలియజేస్తున్నాను." ఈ స్టాంపును విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తూ, నెస్లే ఇండియా చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్మనీష్ తివారీ ఇలా అన్నారు, "భారతదేశంలో మ్యాగీకి ఇది నిజంగా ఒక ప్రత్యేకమైన మైలురాయి. మన దేశంలాంటి ఉత్సాహభరితమైన విభిన్నమైన దేశంలో ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకోవడం, లక్షలాది మంది ఈ బ్రాండ్‌పై చూపిన నమ్మకం, ఆప్యాయత నిత్య ప్రేమకు నిదర్శనం. ఇది పంచుకున్న మధుర క్షణాలు, మారుతున్న అభిరుచులు ఏటా, తరతరాలుగా మరింత బలపడిన బంధంతో రూపుదిద్దుకున్న ఒక ప్రయాణానికి వేడుక." ఈ అనుబంధాన్ని బలోపేతం చేయడానికి మరియు దేశవ్యాప్తంగా ప్రజల జీవితాల్లో వెచ్చదనం, సౌకర్యం, ఐక్యతను తీసుకువచ్చే రోజువారీ క్షణాలకు తోడ్పడటానికి నెస్లే ఇండియా కట్టుబడి ఉంది.

## శాంతి మండలిలో చేరడానికి ట్రంప్ ఆహ్వానాన్ని భారత్ పరిశీలిస్తోంది: విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఉదయం):** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదిత శాంతి మండలిలో చేరవలసిందిగా అమెరికా నుండి భారత్‌కి ఆహ్వానం అందిందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గురువారం ధృవీకరించారు. శాంతి మండలిలో చేరాలని అమెరికా వైపు నుండి మాకు ఆహ్వానం అందింది, ప్రస్తుతం ఆ ప్రతిపాదనను పరిశీలిస్తున్నాం అని మీడియా సమావేశంలో ప్రసంగిస్తూ జైస్వాల్ చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, చర్చలను ప్రోత్సహించే లక్ష్యంతో జరుగుతున్న ప్రయత్నాలకు భారతదేశం నిరంతరం మద్దతు ఇస్తోంది. గాజాతో సహా ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక, స్థిరమైన శాంతికి మార్గాన్ని అందించే చొరవలను మన ప్రధాన మంత్రి స్వాగతించారు అని ఆయన అన్నారు.

**ట్రంప్ శాంతి మండలి ఏమిటి?**

గత సెప్టెంబర్‌లో గాజా వివాదాన్ని అంతం చేయడానికి తన ప్రణాళికను ప్రస్తావిస్తూ డొనాల్డ్ ట్రంప్ మొదట శాంతి మండలిని ప్రతిపాదించారు. తరువాత ప్రపంచ సంఘర్షణలను పరిష్కరించడానికి ఈ సంస్థ గాజా పరిధిని దాటి కూడా పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

వార్తా సంస్థ రాయిటర్స్ సమీక్షించిన ముసాయిదా చార్టర్ ప్రకారం, అమెరికా అధ్యక్షుడు ప్రారంభ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, బోర్డు శాంతి ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లడం, అంతర్జాతీయ వివాదాలను పరిష్కరించడంలో సహాయపడటం వంటి బాధ్యతలను కలిగి ఉంటుందని సూచిస్తుంది. సభ్య దేశాలు సాధారణంగా మూడు సంవత్సరాల పదవీకాలంతో పనిచేస్తాయి, అయితే బోర్డు పనికి మద్దతుగా ఒక బిలియన్ డాలర్లు విరాళం ఇచ్చే దేశాలు శాశ్వత సభ్యత్వాన్ని పొందవచ్చు. ఈ చొరవ వ్యవస్థాపక కార్యనిర్వాహక బోర్డులో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, యుకె మాజీ ప్రధాన మంత్రి టోనీ బ్లెయిర్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లను వైట్ హౌస్ నియమించింది.

వుదయం





"రాహుల్ గాంధీకి డబ్బు ఎవరు సమకూరుస్తున్నారు. వారి ఉద్దేశం దేశాన్ని నాశనం చేయడమేనా? ప్రచురణ కానీ పుస్తకాన్ని రాహుల్ ఎలా సంపాదించగలిగారు. ఆయన సభ్యత్వాన్ని లోక్ సభ రద్దు చేయాలి. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసే ఉద్దేశంతో రాహుల్ వివాదాన్ని రేపడం. ఇది మొదటి సారి కాదు. రక్షణ, ఆర్థిక, వాణిజ్య విదేశీ వ్యవహారాలు వంటి ఏ అంశం అయినా ప్రజల మనోభావాలను రెచ్చగొట్టే విచిత్ర నైపుణ్యం రాహుల్ గాంధీకి ఉంది. అలాగే ఆధారాలులేని అనైతిక అంశాలను పార్లమెంట్ లోపల బయట లేవనెత్తి ప్రజలను ప్రభావితం చేసే లక్షణం కూడా ఆయనకు ఉన్నది... దేశాన్ని లోపలనుంచి అస్థిరపరిచే ఉద్దేశంతోనే ప్రతిపక్షనాయకుడి ముసుగులో రాహుల్ గాంధీ ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారు."

**- నిసికాంత్ దూబె, బిజెపి ఎంపి**

## వే'మన'పద్యం

**విద్యలేనివాడు విద్యాధికుల చెంత**
**నుండినంత పండితుండుకాడు**
**కొలని హంసలకడ గొక్కెర యున్నట్టు!**
**విశ్వదాభిరామ వినురవేమ.**



## సంపాదకీయం

# రెండు న్యాయాలు

దేశ జనాభాలో 70 శాతం మంది సామాన్యులు. వీరంతా అతి కష్టంగా సంతకం చేసే అసంపూర్ణ అక్షరాస్యులు. పూర్తిగా చదవడం, రాయడం రాదు,వీరిలో ఎక్కువమంది గ్రామీణులు, కాయకష్టకారులు, వృత్తి పనివారు, వీరి శ్రమ స్థానంలో ఆధునిక సాంకేతిక నైపుణ్యం చోటుచేసుకునే కొద్దీ వ్యవసాయాది శ్రమ రంగాలనుంచి వీరిని ఇతర రంగాలకు తరలించాలనే ప్రయత్నం ఎప్పటికీ సఫలం కావడం లేదంటే దేశంలో సామాన్య జన సాంద్రత ఎంతటిదో చెప్పనవసరం లేదు. దేశాధికార పీఠం మీద ఎవరిని కూర్చోబెట్టాలనే కీలక నిర్ణయమూ ఈ వర్గం చేతుల్లోనే ఉంటుంది. వీరే అసలైన ప్రజా ప్రభువులు.అందుచేత ఏ రంగమైనా ఈ వర్గం శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొనే నిర్ణయం తీసుకోవాలి.ప్రజాస్వామ్యంలో రాజ్యాంగానికి, న్యాయవ్యవస్థ కు కూడా అదే శిరోధార్యమవుతుంది.తాజాగా ఉన్నత న్యాయస్థానాలు ఇచ్చిన రెండు తీర్పులు గమనించదగినవి. ప్రజలకు, సామాన్య పౌరులకు పాలక వ్యవస్థ నుంచి కలుగుతున్న అసౌకర్యాలను న్యాయస్థానాలు తొలగించాలేగాని ఆ సాలె గూటిలో మరింతగా చిక్కుకుపోయేలా చేయగూడదు.కరీంనగర్ కు చెందిన ఒక కోర్టు ఉద్యోగి(అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అటెండర్) రాజయ్య ను ఫోర్జరీ కేసులో దోషిగా నిర్ధారించి ఉద్యోగం నుంచి తొలగించిన కేసులో పూర్తి జీతాభత్యాలు బకాయిలు సహా చెల్లించి తక్షణమే తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని సుప్రీం కోర్టు బుధవారం నాడు ఇచ్చిన తీర్పు ప్రతి ఒక్కరు ప్రశంసించిందగినది. ఒక సామాన్యుని మూగ వేదనను అర్థం చేసుకుని అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు ఘనమైనది, గణనీయమైనది.నాలుగు రోజులు మంచాన పడి విధులకు వచ్చిన రాజయ్యను అధికారులు ప్రశ్నించగా ఆయన ప్రైవేట్ వైద్యుని సర్టిఫికేట్ సమర్పించాడు.ఆ డాక్టర్ కు కోర్టు నోటీసు ఇచ్చే సరికి ఆ లెటర్ హెడ్ తనదే కాని అందులోని సర్టిఫికేట్ తాను ఇచ్చింది కాదని ఆయన చెప్పాడు. దానితో ఫోర్జరీ కి పాల్పడ్డాడు అని నిర్ధారించి రాజయ్య కు ఉద్యోగం నుంచి ఉద్వాసన చెప్పారు. హై కోర్టులో ఊరట దొరకకపోవడంతో రాజయ్య సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టు రికార్డులను పరిశీలించి మెడికల్ సర్టిఫికెట్ మీదున్న డాక్టర్ రబ్బరు స్టాంపు, ఆయన కోర్టు నోటీసు తీసుకున్నప్పుడు వేసిన రబ్బరు స్టాంపు ఒకటే కావడాన్ని గమనించింది. దానితో రాజయ్యను నిర్దోషిగా ప్రకటించి ఆయన పునర్నియామకానికి ఆదేశించింది.ఒక ఉద్యోగిని ఉద్యోగం నుంచి తొలగించి ఒక జీవితాన్నే నాశనం చేసే తీర్పు ఇచ్చే ముందు సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఉండవలసిందని భారత ప్రధాన న్యాయ మూర్తి చేసిన వ్యాఖ్య న్యాయ దీపానికి రక్షణ వంటిది.ఇంకొక కేసులో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు స్వభాషా వాదులనే కాదు సామాన్య జనాన్ని కూడా ఇబ్బందికి గురి చేసేవిగా ఉన్నాయి. ఒక నిర్మాణ కంపెనీపై దాఖలు చేసిన పిటిషన్ దారు తెలుగులో వాదనలు వినిపించారు. న్యాయమూర్తులు అందుకు అభ్యంతరం చెప్పారు. రాజ్యాంగ ధర్మాసనాలైన సుప్రీం కోర్టు, హై కోర్టు లలో ఇంగ్లీష్ లోనే వాదనలు వినిపించాలని ఇందుకోసం నాలుగు వారాల్లో లాయర్ ను నియమించుకోవాలని ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు బాధాకరం. సుప్రీం కోర్టు సారథ్యంలో న్యాయ సంస్కరణలు అనేకం అమల్లోకి వస్తున్నవేళ ఈ ఆదేశాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని పించడం సహజం.ఇటువంటప్పుడు ప్రభుత్వం చేత అనువదించి చెప్పే వారిని నియమింపజేయవచ్చు, కాని మాతృభాషలో వాదనలు వినిపించడాన్ని నిరుత్సాహపరచడం తగదు.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాటలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# మ్యానిఫెస్టో : పథకాల వల

ఒక వ్యక్తిగాని, సంస్థ గాని రాబోయే కాలంలో పాటించే, అనుసరించే, చేస్తానని హామీ ఇచ్చే అంశాల పట్టికను మ్యానిఫెస్టో అంటారు. మమ్ములను గెలిపిస్తే ఇవి చేసి పెడతామని రాజకీయపార్టీలు ఓట్లకు ముందు ఎన్నికల మేనిఫెస్టోలను ప్రకటిస్తుంటాయి. సామాన్య ఓటరును ఆకర్షించేందుకు ఇవి చాల ఉపయోగపడడంతో క్రమంగా వాటి ప్రచారం, ప్రాధాన్యత పెరిగిపోయింది. చివరకు అదో వేలం పాటలాగా ఒకరు ముందు ప్రకటిస్తే వాటిని మించి తాము ప్రకటించాలని పార్టీ నేతలు కాచుకొని చూసే పరిస్థితి ఏర్పడింది.




ఎన్టీ రామారావు రెండు రూపాయలకు కిలో బియ్యం, మద్యనిషేధం అనో, వైఎస్ రాజశేఖరరెడ్డి కరెంటు బిల్లులు మాఫీ అనో సామాన్యులను ఆకర్షించే ఒకటి, రెండు మెగా హామీలను విసిరి ఓట్లను రాబట్టుకున్నారు. మెల్ల మెల్లగా ఆ హామీల లెక్క పెరిగి అవే గెలుపు రథాలుగా మారిపోయాయి. పెద్ద దుకాణాలు పండగ ఆఫర్లతో అమ్మకాలు పెంచుకున్నట్లు రాజకీయ పార్టీలు కూడా మెదడులో పుట్టిన ఆలోచనలను గంప కింద కమ్మి ఎలక్షన్ల ముందు బయటపెడుతున్నాయి. ఇలా ఎన్నికల మ్యానిఫెస్టో అనేది పాలనా ప్రణాళికలా కాకుండా కేవలం ఓట్లను ఆకర్షించే పథకాల వలలా మారిపోయింది. సంక్షేమ పథకాల సొమ్మును పెంచి అదే గొప్ప పాలనగా జనాలను భ్రమింపజేసే స్థాయికి పార్టీలు చేరిపోయాయి. గత పాలన తీరు, అందులో విజయాలు, వైఫల్యాలు వదిలేసి పథకాల్లో మార్పు, సొమ్ము పెంపు ముచ్చటే ప్రధాన ప్రచారాస్త్రంగా మారిపోయింది. ఉన్న సంక్షేమ పథకాలకు ఇచ్చే డబ్బును కొంత పెంచి, ఒకటి రెండు కొత్తవి జోడించి దానినే ఎన్నిక మ్యానిఫెస్టో అనడం మాత్రం పాలన సంకుచితాన్ని తెలియజేస్తోంది.

ఎవరు పాలించినా ఈ పథకాల్లో పంచే డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది, ఇలా ఎంతకాలం పెంచుతూ, పంచుతూ పోతారు అనేది తేలాల్సిన ప్రశ్న. హైదరాబాద్ చుట్టూ ఉన్న భూములను అమ్మేయడం ప్రభుత్వ రాబడికి తేలిక మార్గమైంది. హైదరాబాద్ లోని సెంట్రల్యూనివర్సిటీని అనుకోని ఉన్న 400 ఎకరాల భూమిని చదును చేసి ప్రైవేట్ పరం చేసే ఆలోచన విద్యార్థుల నిరసనలతో ఆగిపోయింది. ఇటీవల ఎకరానికి రూ.177 కోట్ల చొప్పున 18 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్కారు అమ్మేసింది. ఇలా ప్రభుత్వ భూముల్ని అమ్ముతూ, అందినకాడ అప్పు తెస్తూ వాటితో ప్రజలను పథకాల కాపు కాస్తూ చివరకు భవిష్యత్తరాలకు ఏమి మిగిలిస్తున్నారనేది ప్రధానాంశం. ఓట్ల కోసం రాష్ట్రం కొంప ముంచుతే పోతే ఆ భారమంతా ఎవరు మోయాలి. మద్యం అమ్మకాలు, భూ రిజిస్ట్రేషన్ సుంకాలు, ప్రభుత్వ భూముల వేలాలు ఎంతకాలం రాష్ట్రాన్ని కాపాడుతాయి. ఉచితాలు అనర్థదాయకాలు అని ఆర్థిక నిపుణులు మొత్తుకున్నా ఎవరి చెవికి ఎక్కడం లేదు. ఉన్నదమ్మి పంచిపెట్టడానికి ఇంత మేధోమధనం ఎందుకు, మళ్ళీ గెలిపిస్తే మరిన్ని అమ్మి మరింత పైకం చేతిలో పెడతాము అని హామీలకు అర్థమేమిటి అనేది ఆలోచించవలసిన విషయం.

ఆసరా పింఛన్లు, రైతు బంధు, దళిత బంధు, బతుకమ్మ చీరలు, సన్న బియ్యం, పేదలకు రూ.400 కే గ్యాస్ బండ తదితర ఆర్థిక సహాయాలపై ప్రజలు ప్రభుత్వాలపై ఎందుకు ఆధారపడతారు. వారికి సరిపడా ఆదాయం లభించక, కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడుతున్నందువల్ల ఈ అవసరాలు ఏర్పడుతున్నాయి. వాటిని శాశ్వతంగా తీర్చడానికి ప్రభుత్వాలు ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగయ్యే మార్గాలను అన్వేషించాలి. నిజానికి తెలంగాణ ప్రభుత్వం గత పదేళ్లుగా గొప్పగా పాలించి ఉంటే ఈ పథకాల అవసరాలుండే కుటుంబాల సంఖ్య తగ్గిపోవాలి. వ్యవసాయ రాబడి పెరిగిందనో, పిల్లలకు సర్కారు కొలువులొచ్చాయనో కొన్ని కుటుంబాలైన ఈ రాయితీలను వద్దనే స్థాయిలో ఉండాలి. ఉచితాలకు కేటాయించే సొమ్ము తగ్గిపోవాలి. ప్రజల తలసరి ఆదాయం పెరిగి, వారు ఎవరి ఆసరా లేకుండా సొంతగా బతికి ప్రభుత్వ ఆదాయాన్నిపెంచగలగాలి. చిన్న గూడు కోసం, నెల గాసం కోసం, దవాఖాన ఖర్చుల కోసం, సాగు పెట్టుబడి కోసం బిచ్చగాళ్లలా ప్రజలు సర్కారు ఆఫీసుల చుట్టూ తిరుగుతుంటే ఈ పాలనను దేశంలోనే అత్యుత్తమ పాలనగా ఎలా గుర్తించగలం. ఇన్ని సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలోనూ లేవనిది గర్వించదగ్గ అంశమెలా అవుతుంది. ఇలా ప్రతి పథకం వెనుక రాష్ట్ర భవితను పణంగా పెట్టే ఓట్ల గాలమే ఉంటుంది.

మ్యానిఫెస్టోలో ఉండవలసింది చిప్పలో ఎంతేస్తామనే లెక్కలు కాదు. విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో ప్రజలకు హామీ. ఏడాదికేడాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, బతికినంతకాలం సర్కారు కృపకై దేబరించని రీతిలో కుటుంబ ఆదాయం పెరిగే మార్గాలు. వీటన్నిటి కన్నా ముఖ్యమైనది బహుజనులకు సంఖ్యాపరంగా పాలనలో పాలు. ఇవేవి లేకుండా జనాభాలో 10 % ఉన్న మేము మీ కోసం,మీ సంక్షేమం కోసం మహత్తర ఎన్నిక మ్యానిఫెస్టో తయారు చేశాం. ఓట్లేసి తరించండి అనేదే పెద్ద బోగస్ మాట. మ్యానిఫెస్టోలో ఏమున్నది, ఏముండాలి అనే ఆలోచన సామాన్యుడికి వచ్చినప్పుడే మార్పు మొదలవుతుంది.

> *ఎవరు పాలించినా ఈ పథకాల్లో పంచే డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది, ఇలా ఎంతకాలం పెంచుతూ, పంచుతూ పోతారు అనేది తేలాల్సిన ప్రశ్న. హైదరాబాద్ చుట్టూ ఉన్న భూములను అమ్మేయడం ప్రభుత్వ రాబడికి తేలిక మార్గమైంది. హైదరాబాద్ లోని సెంట్రల్యూనివర్సిటీని అనుకోని ఉన్న 400 ఎకరాల భూమిని చదును చేసి ప్రైవేట్ పరం చేసే ఆలోచన విద్యార్థుల నిరసనలతో ఆగిపోయింది. ఇటీవల ఎకరానికి రూ.177 కోట్ల చొప్పున 18 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్కారు అమ్మేసింది. ఇలా ప్రభుత్వ భూముల్ని అమ్ముతూ, అందినకాడ అప్పు తెస్తూ వాటితో ప్రజలను పథకాల కాపు కాస్తూ చివరకు భవిష్యత్తరాలకు ఏమి మిగిలిస్తున్నారనేది ప్రధానాంశం. ఓట్ల కోసం రాష్ట్రం కొంప ముంచుతే పోతే ఆ భారమంతా ఎవరు మోయాలి.*



బి.నర్సన్
9440128169

# పట్టణ ప్రజాస్వామ్యానికి కీలక ఘట్టం

నేడు మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు దేశవ్యాప్తంగా పట్టణ ప్రజాస్వామ్యానికి ఒక కీలక ఘట్టంగా నిలుస్తోంది. గత కొన్ని వారాలుగా జరిగిన ప్రచార హోరు, వ్యూహాత్మక రాజకీయ కసరత్తులు, అభ్యర్థుల మధ్య పోటీ, ఓటర్ల తీర్పు – ఇవన్నీ ఇప్పుడు ఒకే కేంద్ర బిందువుకు చేరుకున్నాయి: కౌంటింగ్ టేబుల్. పోలింగ్ ముగిసిన నాటి నుంచి పార్టీల శిబిరాల్లో నెలకొన్న ఉత్కంఠ, ఆశలు—ఆందోళనలు నేడు తారాస్థాయికి చేరుకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా చిన్న రాజకీయ సంఘటనలుగా భావించినప్పటికీ, వాస్తవానికి ఇవే పట్టణ పాలనకు పునాది వేస్తాయి. నీటి సరఫరా నుంచి పారిశుధ్యం వరకు, రోడ్ల నుంచి ప్రజా ఆరోగ్య సేవల వరకు, పట్టణ జీవన ప్రమాణాలను నిర్ణయించేది ఈ స్థానిక పాలనా వ్యవస్థే. అందువల్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కేవలం విజయం—పరాజయాల గణాంకం మాత్రమే కాదు; పట్టణ ప్రజల అభిలాషల ప్రతిబింబం.

ఈ ఎన్నికల ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలంటే పోలింగ్ దశను పరిశీలించాల్సిందే. లక్షలాది మంది పట్టణ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించడం ప్రజాస్వామ్యంపై పెరుగుతున్న విశ్వాసాన్ని సూచిస్తోంది. కొన్ని ప్రధాన రాష్ట్రాల్లో నమోదైన భారీ పోలింగ్ శాతం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యానికి గురి చేసింది. పట్టణ ప్రాంతాల్లో సాధారణంగా కనిపించే నిరాసక్తతకు భిన్నంగా, ఈసారి యువత, మహిళలు, మధ్యతరగతి ఉద్యోగులు కూడా చురుకుగా పాల్గొనడం గమనార్హం. ఇది స్థానిక సమస్యలపై ప్రజల్లో పెరిగిన అవగాహనకు సంకేతం. పట్టణ మౌలిక వసతులు, పన్నుల వినియోగం, పర్యావరణ పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, నియమ నిబంధనలకు లోబడి సాగేందుకు ఎన్నికల యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. కౌంటింగ్ కేంద్రాల్లో బహుళ స్థాయి భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో లెక్కింపు వంటి చర్యలు అమల్లో ఉన్నాయి. ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత ఫలితాలను అధికారికంగా నమోదు చేయడం, అభ్యంతరాలకు అవకాశం కల్పించడం వంటి విధానాలు ప్రజాస్వామ్య నమ్మకాన్ని బలపరుస్తాయి. సాంకేతిక పరిజ్ఞాన వినియోగం కూడా లెక్కింపు వేగం, ఖచ్చితత్వాన్ని పెంచింది. ఈ ప్రక్రియలో చిన్న పొరపాటు కూడా రాజకీయంగా పెద్ద చర్చకు దారితీయగలదనే అవగాహనతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

పార్టీల దృష్టిలో ఈ ఎన్నికలు కేవలం స్థానిక అధికార పోరాటం మాత్రమే కాదు; భవిష్యత్ రాజకీయ దిశను సూచించే సంకేతాలు. ప్రధాన జాతీయ, ప్రాంతీయ పార్టీలు పట్టణ ఓటర్ల మద్దతును తమ రాజకీయ బలం కొలమానంగా చూస్తున్నాయి. ప్రచార దశలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన, అవినీతి నిరోధం వంటి అంశాలు ప్రధాన అజెండాగా నిలిచాయి. ఇప్పుడు ఆ వాగ్దానాలకు ఓటర్లు ఇచ్చిన తీర్పు వెల్లడవుతోంది. కౌంటింగ్ కేంద్రాల వెలుపల పార్టీ కార్యకర్తల ఆతృత, అభ్యర్థుల ఉద్విగ్నత, నాయకత్వం నుంచి వస్తున్న ప్రకటనలు – ఇవన్నీ రాజకీయ ఉష్ణోగ్రతను పెంచుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో నమోదైన గణాంకాలు ఈ ఎన్నికల ఉత్కంఠను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో నమోదైన అధిక ఓటింగ్ శాతం ప్రజల పాల్గొనడాన్ని తెలియజేస్తోంది. వేల సంఖ్యలో అభ్యర్థులు పోటీలో నిలవడం స్థానిక రాజకీయాల్లో పెరిగిన పోటీని సూచిస్తోంది. అనేక స్థానాల్లో గెలుపు—ఓటమి తేడా స్వల్పంగా ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి కొత్త అభ్యర్థులు, యువ నాయకులు ఎక్కువగా రంగంలోకి రావడం కూడా విశేషం. ఇది పట్టణ రాజకీయాల్లో తరాల మార్పుకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు.



ఓట్ల లెక్కింపు దశలో ప్రతి రౌండ్ కీలకం. ప్రారంభ రౌండ్లలో ఆధిక్యం సాధించిన పార్టీ చివరికి విజయం సాధిస్తుందనే హామీ లేదు. పోస్టల్ బ్యాలెట్లు, సేవా ఓట్లు, చివరి రౌండ్ల లెక్కింపు అనూహ్య మలుపులకు కారణమవుతాయి. అందువల్ల పార్టీల వార్‌రూమ్‌లలో నిరంతర విశ్లేషణ కొనసాగుతోంది. ప్రతి టేబుల్ నుంచి వచ్చే సమాచారం ఆధారంగా వ్యూహాత్మక ప్రకటనలు విడుదలవుతున్నాయి. సోషల్ మీడియా, టెలివిజన్ ఛానెళ్లు, డిజిటల్ వేదికలు క్షణక్షణం నవీకరణలను అందిస్తూ ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.ఈ ఎన్నికలు పట్టణ పాలనపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశముంది. గెలిచే ప్రజా ప్రతినిధులు రాబోయే సంవత్సరాల్లో పట్టణ అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాల్సి ఉంటుంది. స్మార్ట్ మౌలిక వసతులు, పారిశుధ్య సంస్కరణలు, నీటి నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో స్పష్టమైన కార్యాచరణ అవసరం. ఓటర్లు ఈ అంశాలపైనే తీర్పు ఇచ్చారని భావించవచ్చు. అందువల్ల విజేతలపై బాధ్యత మరింత పెరుగుతుంది.

రాజకీయంగా ఈ ఫలితాలు విస్తృత సందేశాన్ని ఇస్తాయి. పట్టణ ఓటర్ల మూడ్‌ను అంచనా వేసేందుకు పార్టీలు ఈ గణాంకాలను విశ్లేషిస్తాయి. రాబోయే అసెంబ్లీ లేదా పార్లమెంటు ఎన్నికల వ్యూహాలపై కూడా ఇవి ప్రభావం చూపుతాయి. పట్టణ ప్రాంతాల్లో బలమైన పట్టు సాధించిన పార్టీలు తమ రాజకీయ వ్యూహాన్ని విస్తరించే అవకాశముంది. అదే సమయంలో ఆశించిన ఫలితాలు రాకపోతే ఆత్మపరిశీలనకు దారితీస్తాయి.

ఓట్ల లెక్కింపు కేవలం గణాంక ప్రక్రియ మాత్రమే కాదు; ప్రజాస్వామ్య విశ్వాసానికి ప్రతీక. ప్రతి ఓటు విలువైనదనే భావనను ఈ దశ మరొకసారి గుర్తుచేస్తుంది. స్వల్ప తేడాలతో నిర్ణయించబడే విజయాలు ప్రజాస్వామ్యంలో ఓటు శక్తిని ప్రతిబింబిస్తాయి. ఓటర్లు ఇచ్చిన తీర్పు రాజకీయ నాయకత్వానికి మార్గదర్శకం. ప్రజల ఆశలు, ఆవశ్యకతలు, స్థానిక సమస్యలపై స్పష్టమైన సంకేతం.నేడు కౌంటింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న ఉత్కంఠ, రాజకీయ శిబిరాల్లో ఉత్సాహం, ప్రజల్లో ఆసక్తి – ఇవన్నీ ప్రజాస్వామ్య జీవంతత్వాన్ని సూచిస్తున్నాయి. ఫలితాలు ఏవైనా కావొచ్చు; ముఖ్యమైనది ప్రజలు పాల్గొన్న ప్రక్రియ. పట్టణ ప్రజాస్వామ్యం బలపడితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యం. ఈ ఎన్నికలు అదే దిశగా ఒక కీలక అడుగు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి విజేతలు ప్రకటించబడతారు; కానీ అసలు విజయం ప్రజాస్వామ్యానిదే. ప్రజల తీర్పును గౌరవిస్తూ, పట్టణ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కొత్త పాలనా అధ్యాయం ప్రారంభమవుతుంది.



రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# బహుళ పరధ్యానంతో మానసిక అప్పు

ఈ రోజుల్లో మనిషి ఎదుర్కొంటున్న అసలు పెద్ద సమస్య డబ్బు లేకపోవడం కాదు, సమయం లేదు కూడా కాదు, శరీరం బాగో లేదు కూడా కాదు, అసలు సమస్య మన మనసు మీద మనకే నియంత్రణ లేకపోవడం. మన ఆలోచనలు మన మాట వినడం లేదు. మన నిర్ణయాలు మన చేతిలో లేవు. మన మనసు ఒకటి చెబుతుంది, మన మెదడు ఇంకొకటి చేస్తుంది.మన అలవాట్లు మాత్రం మూడో దారిలో వెళ్తాయి. ఈ అయోమయం మధ్య మనిషి ఒక రకమైన కనిపించని అప్పులో చిక్కుకుపోయాడు. దీన్ని నేను" మానసిక అప్పు " అంటాను. మనసు మీద అప్పు. భావాల మీద అప్పు. ఆలోచనల మీద అప్పు. బయట చూసే వాళ్లకి మనం సవ్యంగా కనిపిస్తాం కానీ లోపల మాత్రం ఎప్పటికప్పుడు ఏదో భారంగా ఉంటుంది. మనలో ఏదో అశాంతి. ఏదో అసంతృప్తి, ఏదో భయం, ఏదో అస్పష్టమైన ఒత్తిడి,ఇవన్నీ ఒకే మూలం నుంచి వచ్చేవి మనం మన మనసుకి ఇవ్వాల్సిన సంతృప్తి ఇవ్వకుండా, రోజూ రోజూ దాన్ని అప్పుగా పెంచుకుంటూ పోవడం.

మనిషి శరీరం అలసిపోతే నిద్ర ద్వారా కోలుకుంటుంది. కానీ మనసు అలసిపోతే నిద్ర కూడా చాలదు. ఎందుకంటే నిద్ర మన శరీరానికి విశ్రాంతి ఇస్తుంది కానీ మనసుకు విశ్రాంతి రావాలంటే ఆలోచనల విరామం జరగాలి. ఈ రోజుల్లో చాలా మంది పడుకునే సమయంలో నిద్ర కోసం మంచంపై పడుకుంటారు కానీ ఆలోచనల కోసం ఒక యుద్ధభూమిలోకి దిగుతారు. పగలంతా మనసు "నడిచింది" కాదు "తొక్కబడింది". నోటిఫికేషన్లు, రీల్స్, పని ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు, స్నేహితుల పోలికలు, సోషల్ మీడియాలో కనిపించే ఫేక్ సంతోషాలు ఇవన్నీ మన మెదడును గుక్కెడు నీరు కూడా తాగకుండా పరుగు పెట్టిస్తున్నాయి. ఆ పరుగు చివర్లో మనసు అడుగుతుంది "నాకు ఏమి కావాలి?" అని. కానీ మనం దాన్ని పట్టించుకోం. దాని బదులు మనం మరో స్క్రీన్ ఓపెన్ చేస్తాం. మరో వీడియో చూస్తాం. మరో అప్ డేట్ చదువుతాం. మరో వ్యక్తి జీవితంతో మన జీవితం పోల్చుకుంటాం. ఇలా మన మనసు అడిగే అసలు అవసరాన్ని తీరనివ్వకుండా, చిన్న చిన్న తాత్కాలిక ఆనందాలతో దాన్ని మోసం చేస్తూనే ఉంటాం. అదే మానసిక అప్పు. మానసిక ఆహారం అంటే మనసు ఖాతాలో ప్రతిరోజూ మనం చిన్న చిన్న అప్పులు చేయడం. ఉదాహరణకి మనకు నిజంగా అలసట ఉందంటే శరీరం చెబుతుంది "ఆగు" అని. కానీ మనం ఆగం. కాఫీ తాగుతాం. ఇంకొంచెం పని చేస్తాం. రాత్రి పడుకున్నాక శరీరం విశ్రాంతిని కోరుకుంటుంది. అదే విధంగా మనసు చెబుతుంది "నాకు కొంచెం ప్రశాంతత ఇవ్వు" అని. కానీ మనం ఏమి చేస్తాం? ఇంకొంచెం రీల్. ఇంకొంచెం స్క్రోల్. ఇంకొంచెం వార్త. ఇంకొంచెం లైక్. ఆ ప్రశాంతతను రేపటికి వాయిదా వేస్తాం. ఆ వాయిదానే అప్పు. రేపటికి వాయిదా వేసిన మనసు అవసరం రేపు రెండింతలు బలంగా వస్తుంది. అప్పుడు మనం మరింత ఎక్కువ స్క్రీన్, మరింత ఎక్కువ బిజీ, మరింత ఎక్కువ కోపం, మరింత ఎక్కువ తప్పించుకునే( ఎస్కేపిజం )అలవాటు ఇలా అప్పు పెరుగుతుంది.

మానసిక అప్పు పెరిగినప్పుడు మనకు కొన్ని లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఏ పని చేయాలో తెలుసు కానీ చేయలేం. చేయగలిగే శక్తి ఉన్నా, ఉత్సాహం ఉండదు. మనకు ప్రేమించే వాళ్లు ఉన్నారు కానీ వాళ్లతో మాట్లాడాలనిపించదు. మన దగ్గర అవకాశాలు ఉన్నాయి కానీ వాటిని చేజిక్కించుకునే ధైర్యం. ఇది సోమరితనం కాదు,ఇది మనసు మీద అప్పు. మనం జీవితాన్ని జీవించడం మానేసి నెట్టడం మొదలు పెట్టినప్పుడు ఏర్పడే అంతు చిక్కని దుఃఖం. మనకు ఏది ఆనందం ఇస్తుందో కూడా మరిచిపోతాం. మనం సంతోషంగా ఉన్నప్పుడు కూడా మనసులో ఏదో అలజడి ఉంటుంది. ఎందుకంటే మనసు పక్కనపడి ఉన్నది కాదు, ఎప్పుడూ పనిలోనే ఉంది. ఎప్పుడూ పోలికలోనే ఉంది. ఎప్పుడూ భయంలోనే ఉంది. ఎప్పుడూ అపూర్ణతలోనే ఉంది.

కోరికలు వల్ల. ఇది ఆశ కాదు,ఇది అంతులేని అసంతృప్తి. ఒకప్పుడు మనిషి లక్ష్యం, జీవితం బాగుండాలి. ఇప్పుడు లక్ష్యం,ఇతరుల కంటే బాగుండాలి. అదే పోలిక అనే మానసిక వ్యాధి. పోలిక వల్ల ఆనందం రావడం లేదు, అయినా పోలిక ఆగడం లేదు. ఎందుకంటే మనసు ఒకసారి స్వీయ గుర్తింపు అని నిలబడడం నేర్చుకోలేదు. బయట ప్రపంచం ఏమి చెబుతుందో, ఎవరు ఏమి కొన్నారు, ఎవరు ఎక్కడికి వెళ్లారు, ఎవరి ఫోటో ఎంత బాగుంది,ఈ లెక్కలు మన మనసులో రోజు వెట్టి చాకిరీ చేస్తున్నాయి. ఆ కూలి పనికి జీతం లేదు. జీతం బదులు ఒత్తిడి బహుమతిగా వస్తుంది. అదే మానసిక అప్పు పెంచుతుంది. మానసిక అప్పు ఉన్న వ్యక్తి బయట నవ్వుతాడు. లోపల మాత్రం చిన్న చిన్న విషయాలకు కూడా భయపడతాడు. నాకు సమయం లేదు అంటాడు. కానీ నిజానికి సమయం ఉంది. మనసులో ప్రశాంతమైన చోటు లేదు. నేను బిజీ అంటాడు. కానీ నిజానికి బిజీ కాదు. మానసికంగా బద్ధకం. ఎందుకంటే మనసులో అంతటి అలజడి ఉంది. ఆ అలజడి మధ్యలో ఏ నిర్ణయమూ స్పష్టంగా వినిపించదు. ఒకసారి మనసులో అలజడి ఎక్కువైతే మనం సరైన నిర్ణయం తీసుకోము. మనం త్వరగా తప్పించుకునే నిర్ణయం తీసుకుంటాం. ఉదాహరణకి కోపం వస్తే క్షమించకుండా తిట్టేయడం. బాధగా ఉంటే మాట్లాడకుండా మౌనంగా ఉండడం. ఒత్తిడి ఉంటే తినేయడం. ఖాళీగా అనిపిస్తే స్క్రోల్ చేయడం. ఇవన్నీ తాత్కాలిక ఉపశమనాలు. కానీ ప్రతి ఉపశమనంతో మానసిక అప్పు ఇంకా పెరుగుతుంది. అయితే ఈ అప్పు నుంచి బయటపడటానికి గొప్ప గొప్ప పద్ధతులు అవసరం లేదు. మనకు అవసరం ఒక చిన్న మానసిక ఒప్పందం. నేను రోజూ కొద్దిగా సమయాన్ని కేటాయిస్తాను అనే ఒప్పందం. శరీరానికి మనం రోజూ భోజనం పెడతాం. నీళ్లు ఇస్తాం. నిద్ర ఇస్తాం. అలాగే మనసుకు కూడా రోజూ ఒక చిన్న పోషణ ఇవ్వాలి. దానికి పేరు నిశ్శబ్దం. నిశ్శబ్దం అంటే మాట్లాడకుండా ఉండటం కాదు. అనవసరమైన మానసిక ఆందోళనలను తగ్గించుకోవడమే అసలైన నిశ్శబ్దం. రోజులో కనీసం పదిని మిషాలు ఎలాంటి స్క్రీన్ లేకుండా కూర్చోవడం. ఏం చేయకుండా ఉండటం. ఏం చూసుకోకుండా ఉండటం. ఏం పరిగెత్తకుండా ఉండటం. ఇది మొదట బోర్గా అనిపిస్తుంది. కానీ అదే ఆరోగ్యం. మనసు కూడా శరీరంలా. మొదట డైట్ పెట్టినప్పుడు ఆకలి పెరిగినట్టు, మొదట డిజిటల్ నిశ్శబ్దం పెట్టినప్పుడు మనసులో గందరగోళం పెరుగుతుంది. కానీ అదే శుభారంభం. ఎందుకంటే శబ్దం తగ్గాకే మనసులో అసలు ఉన్నది కనిపిస్తుంది. మానసిక అప్పు తగ్గడానికి మరో బలమైన మార్గం పూర్తిగా చేయడం. ఈ రోజుల్లో చాలా మంది అర్ధాంతరంగా జీవిస్తున్నారు. అర్ధాంతరంగా పని. అర్ధాంతరంగా ప్రేమ. అర్ధాంతరంగా నిద్ర. అర్ధాంతరంగా సంభాషణ. అర్ధాంతరంగా ఆనందం. ఎందుకంటే ఒక పని చేస్తూనే ఇంకొక పని మనసులో నడుస్తుంది. భోజనం చేస్తూ ఫోన్. కుటుంబంతో మాట్లాడుతూ నోటిఫికేషన్. సినిమా చూస్తూ మెసేజ్. పని చేస్తూ రీల్. ఈ మల్టీటాస్కింగ్ నిజానికి మల్టీటాస్కింగ్ కాదు ఇది బహుళ పరధ్యానం. దీని వల్ల మనసు ఎప్పుడూ అసంపూర్తిగా ఉంటుంది. ఏ పనీ పూర్తిగా జరగదు. చివరికి మనకు మన మీద మనకే అసంతృప్తి పెరుగుతుంది. నేను ఏదీ సరిగ్గా చేయలేకపోతున్నాను అనే భావన పెరుగుతుంది. అది మరో అప్పు.

> *ఒక సమయంలో ఒకటే. తినేప్పుడు తినడం. మాట్లాడేప్పుడు మాట్లాడడం. నడిచేప్పుడు నడవడం. వినేప్పుడు వినడం. ఇది సన్యాసం కాదు. ఇది శాస్త్రం. మనసు ప్రశాంతంగా ఉండాలంటే మన జీవితం నిర్ణయాలు స్పష్టంగా ఉండాలి. జీవితం సింపుల్గా ఉండాలంటే మన నిర్ణయాలు సింపుల్గా ఉండాలి. "ఇప్పుడు నేను ఏం చేస్తున్నాను?" అనే ప్రశ్నకు ఒకే సమాధానం ఉండాలి. రెండు కాదు. చివరగా ఒక మాట. మానసిక అప్పు ఉన్న మనిషితనను తాను నిందించుకుంటాడు. నేనే ఇలా అయ్యాను, నేను సోమరిని నేను ఫెయిల్ అని. కానీ నిజం అది కాదు. నువ్వు ఫెయిల్ కాదు.నువ్వు ఓడిపోయిన వాడివి కాదు. కేవలం అలసిపోయిన మనసువి. నువ్వు చెడ్డవాడివి కాదు. సమాచారంతో ఓవర్లోడ్ అయిన మెదడువి. నువ్వు బలహీనుడివి కాదు. నిరంతరం పోరాడుతున్న బలమైన వ్యక్తివి.*

అందుకే ఒక చిన్న నియమం ఒక సమయంలో ఒకటే. తినేప్పుడు తినడం. మాట్లాడేప్పుడు మాట్లాడడం. నడిచేప్పుడు నడవడం. వినేప్పుడు వినడం. ఇది సన్యాసం కాదు. ఇది శాస్త్రం. మనసు ప్రశాంతంగా ఉండాలంటే మన జీవితం నిర్ణయాలు స్పష్టంగా ఉండాలి. జీవితం సింపుల్గా ఉండాలంటే మన నిర్ణయాలు సింపుల్గా ఉండాలి. "ఇప్పుడు నేను ఏం చేస్తున్నాను?" అనే ప్రశ్నకు ఒకే సమాధానం ఉండాలి. రెండు కాదు. చివరగా ఒక మాట. మానసిక అప్పు ఉన్న మనిషితనను తాను నిందించుకుంటాడు. నేనే ఇలా అయ్యాను, నేను సోమరిని నేను ఫెయిల్ అని. కానీ నిజం అది కాదు. నువ్వు ఫెయిల్ కాదు.నువ్వు ఓడిపోయిన వాడివి కాదు. కేవలం అలసిపోయిన మనసువి. నువ్వు చెడ్డ వాడివి కాదు. సమాచారంతో ఓవర్లోడ్ అయిన మెదడువి. నువ్వు బలహీనుడివి కాదు. నిరంతరం పోరాడుతున్న బలమైన వ్యక్తివి. నువ్వు రోజూ యుద్ధం చేసి బయట నవ్వుతున్న బలమైన మనిషి. నీకు కావాల్సింది ఒకే ఒక్కటి నీ మనసుకు కొద్దిగా విశ్రాంతి ఇవ్వడం. నీ ఆలోచనలకు కొద్దిగా శాంతి ఇవ్వడం. నీ జీవితంలో కొద్దిగా నిశ్శబ్దానికి చోటు ఇవ్వడం ఎందుకంటే జీవితం మొత్తం జీవితంలో మనం నిజంగా సంపాదించుకోవాల్సింది బయట కాదు లోపల. మనిషి నిజంగా గెలిచేది ప్రపంచాన్ని కాదు తన మనసును. ఆ గెలుపు కోసం మనం డబ్బు డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు మనకు అవసరం కేవలం ఒక చిన్న నిర్ణయం ఈ రోజు నుంచే నా మనసుకు అప్పు పెంచను రోజూ కొంత సమయాన్ని కేటాయిస్తాను" అని. అదే మానసిక అప్పు కు ముగింపు. అదే నిజమైన మానసిక స్వాతంత్ర్యం.



– డా.సూర్యదేవర రామకృష్ణ, పిహెచ్‌డి

# రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

### కడప జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారికి (ఏ.ఓ) వినతిపత్రం అందజేత




**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. నారాయణ దశాబ్దాలుగా అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ అసమానతలను తొలగించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా కడప జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారికి (ఏ.ఓ) వినతిపత్రం సమర్పించి, రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో ప్రాజెక్ట్ లకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి పథకాలు, గ్రామీణ రహదారులు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, పరిశ్రమల స్థాపన వంటి రంగాలకు అత్యవసరంగా నిధులు అవసరమని వివరించారు. ప్రాంతీయ అసమానతలు పెరుగుతున్నాయని, వెనుకబడిన ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు లేక వలసలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు సాగునీటి సౌకర్యాల కోసం ఎదురుచూస్తున్నారని, విద్యార్థులు సరైన విద్యా వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**వెనుకబడిన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి**

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే అభివృద్ధి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వెనుకబడిన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజాసంఘాలు, రైతు సంఘాలు, యువజన సంఘాలతో కలిసి పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తుందని వెల్లడించారు. ప్రాంతీయ సమతుల అభివృద్ధి సాధించడం ద్వారానే రాష్ట్రం మొత్తం పురోగమిస్తుందని, అందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బి ఎస్ పి జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, వి ఏ వి నాయకులు ఆంజనేయులు, దాదా పీర్, ప్రకాష్, విద్యార్థి జయ వర్ధన్ సుబ్బారాయుడు, శంకర్, రాజంద్ర, నాగేంద్ర, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్ధిపేట, ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి)** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అన్ని మండలాల విద్యాశాఖ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే పదవ తరగతి ఫలితాల్లో జిల్లా 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్లలో విద్యార్థులకు సబ్జెక్టులపై అవగాహన కల్పించాలని, చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం సాధించే ఫలితాల ఆధారంగానే వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరుగుతాయని, ఇందుకోసం ప్రతి మండలంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూను తప్పని సరిగా పాటించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రుచికరమైన భోజనం అందించాలని స్పష్టం చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో సైతం కొలత ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ ప్రక్రియను వేగవంతం చేయాలని, విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను తక్షణమే జారీ చేయాలని తహసిల్దార్లను ఆదేశించారు. సర్టిఫికేట్ల జారీలో మీ-సేవ కేంద్రాలు అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఈ.డి.ఎం ఆనంద్‌కు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.




# రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం

### పాలిటెక్నిక్ కళాశాల కృషిని ప్రశంసించిన వీసీ రాజశేఖర్ బెల్లంకొండ

**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** సైన్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ ద్వారా స్థిరమైన అభివృద్ధి–వికసిత్ భారత్ దృక్కోణం అనే అంశంపై మానూ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండ పాల్గొని సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో శాస్త్ర, ఇంజినీరింగ్, సాంకేతిక రంగాల పాత్ర అత్యంత కీలకమని, పాలిటెక్నిక్ కళాశాల స్థాయిలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు పరిశోధన, ఆవిష్కరణలు, నూతన సాంకేతికతలపై దృష్టి సారించి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరంగౌరవ అతిథిగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా కడప కార్యదర్శి ఎం. వెంకటేశు పాల్గొని ప్రసంగిస్తూ సాంకేతిక విద్య ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం ద్వారా స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రత్యేక అతిథులుగా కెఎల్‌ఎమ్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.వి. రత్నమ్మ, ఏఐటీఎస్ రాజంపేట ప్రొఫెసర్ హేమకేశవు, కళాశాల ప్రిన్సిపాల్ కన్వీనర్ డా. అబ్దుల్ ముక్సిత్ ఖాన్ పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈ సదస్సు సమన్వయకర్తగా డా. హకీముద్దీన్ అహ్మద్ వ్యవహరించి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. దేశ వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల నుండి అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. సదస్సు ప్రారంభ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండ పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, నిర్వాహకులను అభినందిస్తూ, పాలిటెక్నిక్ స్థాయిలో జాతీయ సదస్సు నిర్వహించడం గర్వకారణమని ప్రశంసించారు.




## జిల్లా స్థాయిలో చాడ పాఠశాల విద్యార్థుల జయకేతనం

### క్విజ్ పోటీల్లో రెండో బహుమతి

**యాదాద్రి భువనగిరి / ఫిబ్రవరి 12 వుదయం జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి పీఎం శ్రీ, క్విజ్ మరియు స్పెల్ బీ పోటీలలో మోటకొండూరు మండలం చాడ పీఎం శ్రీ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు సుదగాని సంజన, పాము సన్విక, సొప్పరి తేజస్వి లు అద్భుత ప్రతిభ కనబరిచారు. జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో చాడ పాఠశాల విద్యార్థులు తమ మేధస్సుతో ద్వితీయ బహుమతిని సాధించి జిల్లా స్థాయిలో మండల కీర్తిని చాటారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యాన్ని పెంపొందించేందుకు నిర్వహించిన ఈ పోటీల్లో చాడ విద్యార్థులు అత్యంత కఠినమైన ప్రశ్నలకు మరియు స్పెల్లింగ్ లకు సరైన సమాధానాలు ఇచ్చి వారి ప్రతిభను చూపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు చాడ పీఎం శ్రీ ఎంపీపీఎస్ పాఠశాలకు బహుమతులు అందజేసి అభినందించారు. జిల్లా స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు సుదగాని సంజన, పాము సన్విక, సొప్పరి తేజస్వి లను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, ఉపాధ్యాయురాలు ప్రమోదిని, ఉపాధ్యాయులు లింగయ్య ను చాడ గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పడానికి ఈ విద్యార్థుల విజయమే నిదర్శనమని గ్రామ పెద్దలు కొనియాడారు.



## గజ్వేల్ లో "సంచార జాతులు– సమగ్ర సర్వే" పుస్తకావిష్కరణ

- బ్రిటిష్ కాలం నాటి చట్టాలే సంచార జాతుల పతనానికి కారణం
- డా. ఆకుల నరేశ్ బాబు

**గజ్వేల్, ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి)** సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన "సంచార జాతులు– సమగ్ర సర్వే" పుస్తకావిష్కరణ కార్యక్రమం గజ్వేల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. ఆకుల నరేశ్ బాబు పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు మొఘల్, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా సంచార జాతుల వారు సైనికులుగా, గూఢాచారులుగా అమోఘమైన పోరాటం చేశారని కొనియాడారు. మన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో వారి కళారీతులు అద్వితీయమైనవని పేర్కొన్నారు. 1871లో బ్రిటిష్ పాలకులు తీసుకొచ్చిన 'క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్' (నేరస్థ తెగల చట్టం) కారణంగా ఈ జాతుల జీవన స్థితిగతులు దిగజారిపోయాయని, నేటికీ వారు దుర్భర స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 మంది సామాజిక కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 33 సంచార జాతులకు చెందిన 1450 కుటుంబాలను (సుమారు 7,000 మందిని) ప్రత్యక్షంగా కలిసి ఈ నివేదికను రూపొందించినట్లు తెలిపారు. సంచార జాతుల సంప్రదాయ కళలను ప్రోత్సహించి, వారి ఆచారాలను గౌరవించాలి. ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పి నాణ్యమైన విద్యను అందించాలి. కులం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను సరళీకృతం చేయాలి.స్వయం ఉపాధి పథకాలు, భూమి లేని వారికి భూమి మరియు పక్కా ఇళ్లు మంజూరు చేయాలి. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక సభ్యులు డా. మల్లయ్య, డా. శివకుమార్, డా. సురేశ్ రెడ్డి, డా. అశ్విన్ కుమార్, డా. నాగేందర్, డా. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి ఉత్సవముల ఏర్పాట్లు



**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానము ప్రొద్దుటూరు మన అగస్త్యేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవముల సందర్భంగా ప్రొద్దుటూరు డివిజన్ ఏ.ఎస్.పి. యు.విభు కృష్ణ మరియు ప్రొద్దుటూరు మున్సిపల్ కమీషనరు చింత రవి చంద్రా రెడ్డి వారు ఆలయ కార్యనిర్వహణాధికారి మరియు చైర్మన్ పాలకమండలి సభ్యులు ఆలయ మర్యాదలతో ఆహ్వాన పలికి శివరాత్రి ఉత్సవముల ఏర్పాట్ల వివరములను తెలియచేశారు ప్రొద్దుటూరు డివిజన్ ఏ.ఎస్.పి. యు.విభు కృష్ణ ఉత్సవముల యొక్క భద్రత మరియు భక్తులకు ఎటువంటి అసౌకర్యములు లేకుండా ఉండుట గురించి మరియు మున్సిపల్ కమీషనరు చింత రవి చంద్రా రెడ్డి వారు శానిటేషన్ గురించి శుభ్రత గురించి ఎటువంటి సమస్యలకు తావు లేకుండా ప్రోటోకాల్ ప్రకారం చూసుకొను విషయములను తెలియచేశారు. అలాగే శివరాత్రి ఉత్సవముల గురించి అభివృద్ధి గురించి పాలకమండలి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవములు దేవస్థానం మరియు పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో జరుగుచున్నవి స్వామివారి సేవలో ఆలయ కార్యనిర్వహణాధి కారి కే.వి రమణ ఆలయ చైర్మన్ వంగల నారాయణ రెడ్డి మరియు పాలక మండలి సభ్యులు తెలియజేశారు.



## వనజాతర కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**(వుదయం ప్రతినిధి)పాపన్నపేట :12** మహా శివరాత్రి సందర్భంగా మెదక్ జిల్లా ఏడుపాయలలో ఫిబ్రవరి 15 నుండి 17 వరకు జరిగే వనజాతర ఏర్పాట్లను మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ గురువారం పరిశీలించారు. ఆలయం ముందు నది పాయలో శివుడిని ఏర్పాటు చేసే ప్రాంతం,లడ్డు పులిహోర ప్రసాద విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆలయ ఈఓ వీరేశం,సిబ్బంది సూర్య శ్రీనివాస్ ఉన్నారు.

# ఐటీడీఏ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

### సామాజికవేత్త మాలకొండ రెడ్డి



**కావలి, ఫిబ్రవరి 12 , వుదయం న్యూస్ :** జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో సమీకృతగిరిజనాభివృద్ధి సంస్థ (యానాదుల ) ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించాలి గిరిజనులను అన్ని విధాల అభివృద్ధి చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ఎం మాలకొండ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఉన్న ఐటీడీఏ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందుతున్నాయని ఆ ప్రాజెక్టులకు యువ ఐఏఎస్ అధికారులను నియమిస్తున్నారని తెలిపినారు. కానీ నెల్లూరు జిల్లాలో ఉన్న ఐటీడీఏ ప్రాజెక్టు యువ ఐఏఎస్ అధికారిని నియమించాలు తరతరాల నుంచి అభివృద్ధికి ముఖ్యంగా గిరిజన కాలనీలను సందర్శించి గిరిజనులను ప్రభుత్వ పథకాలు పై అవగాహన కల్పించి ఆ కాలనీలకు మౌలు సదుపాయాలు కేటాయించాలని కోరినారు గిరిజన విద్యార్థులు ఎక్కువగా మిగిలి పోతున్నారని ఆవేద వ్యక్తం చేస్తున్నారు కావున చిన్నారులను గిరిజన గురుకుల పాఠశాలలకు పోయే విధంగా వారి కుటుంబాలను చైతన్య పరచాలని ప్రాజెక్టు అధికారులను కోరినారు జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు ప్రకాశం కడప చిత్తూర్ నెల్లూరు జిల్లాలకు చెందినది కావున భారీగా నిధులు బడ్జెట్లో కేటాయించి వారు అభ్యున్నతికి యువ ఐఏఎస్ అధికారిని పిఓగా నియమించి గిరిజనులను అభివృద్ధికి కృషిచేసి కోరినారునిరుపేదలుగా జీవిస్తున్న గిరిజనులను అన్ని విధాల అభివృద్ధి చేయాలని కోరినారు.

## దళిత యువకుల హత్యపై విచారణ చేయడంలో పోలీస్ ఉన్నతాధికారుల నిర్లక్ష్యమేంటీ?

### బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప



**కడప, ఫిబ్రవరి 12, (వుదయం జిల్లా బ్యూరో)** ఈనెల 5వ తేదీన ఇద్దరి యువకులు చనిపోతే కేసును చేదించడంలో పోలీసుల నిర్లక్ష్యం ఏమిటని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కు పచ్చలారని ఇద్దరు మాదిగ కులానికి చెందిన యువకులు మృతిచెందితే పాలకవర్గం గానీ ప్రతిపక్ష పార్టీ గాని ఆ కుటుంబాన్ని సందర్శించిన పాపన పోలేదు. మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ సొంత మండలంలో ఇద్దరు దళిత యువకులు చనిపోతే ఎమ్మెల్యే కనీసం స్పందించడం లేదు ఇద్దరు దళిత యువకులు చనిపోతే ఇరు పార్టీలు పట్టించుకోకుండా పోవడంలో ఆంతర్యం ఏమిటి యువకులు చనిపోయి ఐదు రోజులవుతున్న ఇంత వరకు న్యాయ నిర్ధాపన తేల్చాల్సిన పోలీసులు ఉన్నతాధికారుల అలసత్వంలో ఆంతర్యం ఏమిటి? రెండు రోజుల్లో యువకుల మృతిపై సమగ్ర సమాచారం తెలపకపోతే బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల దళిత ప్రజాసంఘాలను కలుపుకొని ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతాం.బ్రహ్మంగారి మఠం మండలంలో అత్యధిక ఓటర్లు అత్యధిక జనాభా కలిగినా కులంపై అంత వివక్షెందుకు అని ప్రశ్నించారు.



## కార్మికుల హక్కుల పరిరక్షణ కోసమే దేశవ్యాప్త సమ్మె

**చండూరు, ఫిబ్రవరి 12( వుదయం విలేఖరి):** చండూరు మండల కేంద్రంలో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు జెర్రిపోతుల ధనంజయ మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగం, కార్మిక వర్గానికి వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వేగవంతం చేసిందని ఆయన పేర్కొన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆశా, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరారు.అసంఘటిత రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి, స్కీమ్ వర్కర్లను శాశ్వత ఉద్యోగులుగా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని విమర్శించారు. 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం కార్మికుల హక్కులను హరించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కోడ్స్ అమల్లోకి వస్తే సమ్మె హక్కు, సంఘం ఏర్పాటు హక్కు, జీతభత్యాలపై చర్చించే హక్కులు దెబ్బతింటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు చిట్టిమల్ల లింగయ్య, మొగుదాల వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి ఈరటి వెంకటయ్య, మున్సిపల్, గ్రామపంచాయతీ, హమాలి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**సూర్యాపేట, ఫిబ్రవరి 12(వుదయం):** పురపాలక సంస్థల ఓట్ల లెక్కింపును పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు.రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో టేబుల్‌వారీ లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, చెల్లుబాటు -అచెల్లుబాటు ఓట్లపై సూచనలు ఇచ్చారు. ప్రతి రౌండ్ అనంతరం ఫలితాలు నమోదు చేసి ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు.సీసీ కెమెరాల పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందని, గుర్తింపు కార్డులు ఉన్న వారికే ప్రవేశం ఉంటుందని తెలిపారు. సిబ్బంది ఉదయం 7 గంటలలోపు కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు.

# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు పటిష్ట ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక ఎంట్రెన్స్, ఎగ్జిట్**
**కౌంటింగ్ ఏర్పాట్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, వుదయం బ్యూరో ఫిబ్రవరి -12:** నిబంధనల ప్రకారం మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పై గురువారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 5 మున్సిపాలిటీల ఎన్నికల కౌంటింగ్ కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో మెష్ ఏర్పాట్లతో, కౌంటింగ్ విధుల అధికారులకు, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక ఎంట్రెన్స్, ఎగ్జిట్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పటిష్ట పోలీస్ బందోబస్తుతో, అన్ని కౌంటింగ్ కేంద్రాలలో 100 శాతం వెబ్ క్యాస్టింగ్ చేస్తున్నట్లు, ప్రతి కౌంటింగ్ కేంద్రంలో రూట్ మ్యాప్ బోర్డులు ఏర్పాట్లు చేసినట్లు అన్నారు.

కౌంటింగ్ హాల్స్ లో కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, వీరందరికి సంబంధిత పాసులు జారీ చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ తో కౌంటింగ్ ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో పూర్తి నిబంధనలు పాటించాలని అన్నారు. కౌంటింగ్ తర్వాత రిజెక్ట్ ఐనా బ్యాలెట్ పత్రాలతో సహా మొత్తం ఎన్నికల సామాగ్రి సీజ్ చేసి స్ట్రాంగ్ రూమ్ కు తరలించాలని కలెక్టర్ తెలిపారు. ఏదులా పురం లోని 31 వార్డులు, మధిరలోని 22 వార్డులకు, సత్తుపల్లి లోని 23 వార్డులకు, వైరా, కల్లూరు లోని 20 వార్డులకు రెండు రౌండ్ లలో కౌంటింగ్ పూర్తయ్యేలా టేబుల్స్ వేసి కౌంటింగ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఎన్నికల కౌంటింగ్ సంబంధించి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్స్ తరలించే ప్రక్రియ గురించి ముందుగానే రాజకీయ పార్టీలకు సమాచారం అందించి, మొత్తం ప్రక్రియ వీడియోగ్రఫీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ విధుల అధికారులు విధుల్లో ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వవద్దని, అప్రమత్తంగా ఉంటూ, తమ విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ అన్నారు. మునిసిపల్ కమిషనర్లు అప్రమత్తంగా ఉంటూ, ప్రక్రియను పర్యవేక్షణ చేయాలని, అధికారులు, కౌంటింగ్ సిబ్బందిని గైడ్ చేస్తూ, ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని తెలిపారు.ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లుదా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు



**ఫిబ్రవరి 12, 2026 – ఆదిలాబాద్:** నిన్న నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రతి ఓటరు తన ఓటు హక్కును సులభంగా వినియోగించుకునేలా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు పోలింగ్ కేంద్రాలకు సులభంగా చేరుకునేలా ఉచిత వాహన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ రోజున ఓటర్లను ఇంటి వద్ద నుంచే పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లి, తిరిగి సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు ప్రభుత్వ వాహనాలు (ఆటోలు) అందుబాటులో ఉంచారు.ఈ సౌకర్యం అవసరమైన వారికి సమయానికి అందేలా అధికారులు సమన్వయంతో పనిచేశారు. వృద్ధులు, శారీరక ఇబ్బందులు ఉన్నవారు ఎటువంటి అసౌకర్యం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదనే భావనతో జిల్లా యంత్రాంగం ఈ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ వాహన సౌకర్యం సక్రమంగా అందుతున్నదో లేదో పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది ప్రత్యక్ష సమన్వయంతో ఓటర్లకు సహకారం అందించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్ల ద్వారా కూడా ఈ సౌకర్యంపై అవగాహన కల్పించారు. "దివ్యాంగులను, వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లే ప్రభుత్వ వాహనం" అనే సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించారు.జిల్లా యంత్రాంగం తీసుకున్న ఈ చర్యలతో దివ్యాంగులు, వృద్ధులు పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేసినందుకు ఓటర్లకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఈ నెల 13న కౌంటింగ్ ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధం

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల /ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి):** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన ఉదయం 8 గంటల నుండి జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ లో, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ కొరకు అదనపు సిబ్బందితో కలిపి 66 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 132 మంది కౌంటింగ్ సహాయకులు, బెల్లంపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 19 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 37 మంది కౌంటింగ్ సహాయకులు, చెన్నూరు మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 10 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 20 మంది కౌంటింగ్ సహాయకులు,, క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 48 మంది కౌంటింగ్ సహాయకులు, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 9 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 18 మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ బెల్లంపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 34 వార్డులకు గాను 17 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, చెన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి 18 వార్డులకు గాను 9 టేబుల్స్ ఏర్పాటు చేసి, 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి సంబంధించి 15 వార్డులకు గాను 8 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, క్యాతనపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 22 వార్డులకు గాను 22 టేబుల్స్ ఏర్పాటు చేసి రౌండ్ కి 1 వేయి ఓట్ల చొప్పున 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి 60 వార్డులకు గాను 60 టేబుల్స్ ఏర్పాటు చేసి రౌండ్ కి 1 వేయి ఓట్ల చొప్పున లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



## మహిళల ఆరోగ్యమే సమాజ ప్రగతి

**ఫిబ్రవరి 12, 2026-ఆదిలాబాద్:** మహిళల ఆరోగ్యం, పరిశుభ్రత, సాధికారత లక్ష్యంగా 'ప్రగతి' కార్యక్రమాన్ని గురువారం జైనథ్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ (TGMS) జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. దేశంలోని ప్రముఖ టెలికాం మౌలిక వసతుల సంస్థ ఇండస్ టవర్స్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా, పింకిషే ఫౌండేషన్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యం, విద్యపై పెట్టే పెట్టుబడి సమాజ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందన్నారు. రుతుక్రమంపై ఉన్న అపోహలను తొలగించి కిశోర బాలికలు, మహిళల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు అవసరమని పేర్కొన్నారు. 'ప్రగతి' కార్యక్రమాన్ని జిల్లాలో నిబద్ధతతో అమలు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుపై దృష్టి సారించి ఐఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో అవకాశాలు సాధించాలని సూచించారు.ఇండస్ టవర్స్ ప్రతినిధి అరుణ్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్య పరిరక్షణకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచడం ద్వారా మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అనంతరం మోడల్ స్కూల్ కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించి, ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ అభినందిస్తూ శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, సంతోష్‌రామ్, సీసీఈఓ అరుణ్, పింకిషే ఫౌండేషన్ ప్రతినిధులు శాతిని గుప్తా, అరుణ్ గుప్తా, జైనథ్ సర్పంచ్ మమత, ప్రత్యుష, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పాత జీ.ఓ ప్రకారమే జర్నలిస్టులకు అక్రెడిటేషన్స్ ఇస్తాం

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**ఫిబ్రవరి 12, 2026 – హైదరాబాద్:** జర్నలిస్టులకు పాత జీ.ఓ ప్రకారమే అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తామని సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో మంత్రి పొంగులేటిని టీయూడబ్ల్యూజే నేతలు, కేబుల్ చానెల్స్ జర్నలిస్టుల జేఏసీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జీ.ఓ 252, జీ.ఓ 103లో కేబుల్ ఛానల్స్ కు అక్రెడిటేషన్స్ జారీ విషయంలో అన్యాయం జరిగిన విషయాన్ని మంత్రికి వివరించారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాత జీ.ఓ ప్రకారమే జర్నలిస్టుకు అక్రెడిటేషన్స్ ఇస్తామని స్పష్టం చేశారు. ఎవరూ ఆందోళన చెందివద్దని మంత్రి భరోసా ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, తెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, సిటీ కేబుల్ ఎం.డి శివరామకృష్ణ, ఎం.ఎస్ ఓ సంఘం నాయకులు వంగా శ్రీనివాస్ రెడ్డి, కేబుల్ చానెల్స్ జేఏసీ నాయకులు కడకంచి వెంకటేష్, హెచ్ వి.చలపతి, దేవేందర్, అరవింద్, బ్రహ్మం, రాజేష్ తదితరులు ఉన్నారు.



## లేబర్ కోడ్ల ను రద్దు చెయ్యాలంటూ సార్వత్రిక జాతీయ సమ్మె




- **కార్మిక మహా ప్రదర్శనలో బొట్ల చక్రపాణి డిమాండ్.**

**పరకాల ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి)):** పరకాల మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే విధంగా రూపొందించిన 4 లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని విబిజి రామ్ జీ బిల్లును రద్దు చేయాలనీ సిఐటియు జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి ఐ సి సి టి యు జిల్లా అధ్యక్షులు బొట్ల ప్రభాకర్ లు కేంద్రం ప్రభుత్వాని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పరకాల హుజురాబాద్ రోడ్డు లోని పెట్రోల్ పంపు నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా అమరధామం వరకు డప్పు చప్పులతో కార్మిక మహాప్రదర్శన నిర్వహించారుఅనంతరం జరిగిన సభకు ఏఐటియుసి నాయకులు లంకదాసరి అశోక్ అధ్యక్షత వహించగా వారు మాట్లాడుతూ... కార్మికులు దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ శక్తులకు మేలు చేకూరేలా కేంద్రం ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని వీటి ఫలితంగా కార్మికులు యజమానులకు పనిచేయాల్సి వస్తుందని ఆయన మండిపడ్డారు. వీటి ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తూ, 'హైర్ అండ్ ఫైర్' (నియమించుతొలగించు) పద్ధతిని చట్టబద్ధం చేయడం, 12 గంటల పని పెంపుదల, సమ్మె చేసే హక్కు కనీస వేతనం ఉద్యోగ భద్రత లాంటి చట్టబద్ధ హక్కులు లేకుండా పనిచేయాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని 50 సంవత్సరాల పైబడిన వారికి తొమ్మిది వేల పెన్షన్ ఇవ్వాలని తదితర డిమాండ్లుతో ఈ సమ్మెలో విద్యుత్ సవరణ చట్టం2025, విత్తన సవరణ బిల్లు, మరియు ఎల్ఐసిలో 100 శాతం విదేశీ పెట్టుబడుల అనుమతి వంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని అయన డిమాండ్ చేస్తున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాల అధికారాలను కేంద్రం హస్తగతం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఈ సమ్మెలో సుమారు 40 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న ఈ మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు లంకదాసర అశోక్ నరసింహులు బచ్చు ఆదాం సాంబయ్య రమేష్ మోహన్ పసుల సారయ్య పైడి ఉపేందర్ రాజేందర్ సారంగపాణి సుధాకర్ కుమారు కుమార్ ప్రమోద్ కోటయ్య పసుల సారయ్య వసంత కమల రాధా కుమారస్వామి తోపాటు సుమారు 300 మంది పాల్గొన్నారు.



## గ్రామీణ క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే సీఎం కప్ లక్ష్యం

- **జిల్లా కలెక్టర్ హైమావతి**




**వుదయం, సిద్దిపేట ప్రతినిధి ఫిబ్రవరి,12:** గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించి వారికి సరైన ప్రోత్సాహం అందించి అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేలా చేయడమే సీఎం కప్ ఉద్దేశమని జిల్లా కలెక్టర్, స్పోర్ట్స్ చైర్పర్సన్ హైమావతి తెలిపారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సెకండ్ ఎడిషన్ సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులను ప్రాథమిక స్థాయిలోనే క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత పీఈటీలపై ఉందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని సూచించారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని చెప్పారు.టీం స్ఫూర్తితో చివరి వరకు విజయం కోసం క్రీడాకారులు పోరాడాలని, సిద్దిపేట జిల్లా ఇప్పటికే క్రీడల్లో ముందంజలో ఉందని పేర్కొన్నారు. క్రీడ ఉపాధ్యాయుల సూచనలు తీసుకుని మరింత సాధన చేసి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 'సిద్దిపేట బ్రాండ్'ను కొనసాగించాలని క్రీడాకారులకు సూచించారు. వచ్చే సంవత్సరం నుంచి పాఠశాలల్లో వ్యాయామ విద్య పీరియడ్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకట నరసయ్య మాట్లాడుతూ సీఎం కప్ పై అవగాహన కల్పించేందుకు జనవరి 7 నుంచి జిల్లా వ్యాప్తంగా టార్చ్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 17 వేల మంది క్రీడాకారులు పోటీలకు నమోదు చేసుకున్నారని చెప్పారు. గ్రామ, క్లస్టర్, మండల, నియోజకవర్గ స్థాయిల్లో ఇప్పటికే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి ప్రతిభావంతులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు.సిద్దిపేట, గజ్వేల్, కొండపాక కేంద్రాలలో 21 క్రీడాంశాల్లో మూడు రోజులపాటు జిల్లా స్థాయి పోటీలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచే క్రీడాకారులకు స్వర్ణ పతకానికి రూ.25,000, రజత పతకానికి రూ.15,000, కాంస్య పతకానికి రూ.10,000 నగదు ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రమేష్, డీఎస్డీవో హమీద్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రవి నాయక్, పాఠశాల క్రీడా కార్యదర్శి సౌందర్య, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి హరికిషన్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, అధికారులు, క్రీడా శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పోటీల ప్రారంభ సూచకంగా శాంతి కపోతాలను ఎగురవేశారు.కాగా నేడు బాలుర విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్‌తో పాటు వ్యక్తిగత క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



## ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు

- **3 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహణ**
- **జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ**




**జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 12(వుదయం జిల్లా ప్రతినిధి):** భూపాలపల్లి మున్సిపాలిటీకి నిర్వహించబడిన ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు.ఓట్ల లెక్కింపును పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు డా బిఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలోని మిని ఫంక్షన్ హాలులో మొత్తం 10 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి టేబుల్‌కు ఒకరేసి 10 మంది రిటర్నింగ్ అధికారులు నియమించినట్లు తెలిపారు. అదనంగా కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు 12 మంది టేబుల్ సూపర్వైజర్లు, 20 మంది అసిస్టెంట్లు, అలాగే ఇతర సహాయక సిబ్బంది 40 మందిని నియమించినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపును మొత్తం 3 రౌండ్లలో పటిష్ట పర్యవేక్షణ, వీడియో గ్రఫి మధ్య నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రౌండ్ అనంతరం ఫలితాలను స్పష్టంగా ప్రకటించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారం, పారదర్శకంగా జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ స్పష్టం చేశారు.



## మునిసిపల్ కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

- **డాక్టర్ సత్య శారద**

**వర్ధన్నపేట వుదయం ప్రతినిధి:** రెండవ ఆర్డినరీ మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.కౌంటింగ్ హాల్‌స్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు, సిబ్బంది నియామకం, భద్రతా ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రత, సీసీ కెమెరాల వ్యవస్థ, అభ్యర్థుల ప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ రాంరెడ్డి, వరంగల్ ఆర్డీఓ సుమ, వర్ధన్నపేట సీఐ కె. శ్రీనివాసరావు, తహసిల్దార్ విజయ్ సాగర్, మునిసిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ ,అధికారులు తదితరులుపాల్గొన్నారు.

## మెజారిటీ స్థానాలు బీజేపీకే రాబోతున్నయ్



- **దేశమంతా కరీంనగర్ వైపు చూస్తోంది : కేంద్ర మంత్రి బండి సంజయ్**

**కరీంనగర్, ఫిబ్రవరి 12, (వుదయం ప్రతినిధి):** కరీంనగర్ కార్పోషన్ ఫలితాల్లో మెజారిటీ స్థానాలు బీజేపీ కైవసం చేసుకోబోతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. యావత్ దేశమంతా కరీంనగర్ ఫలితాలవైపు చూస్తోందన్నారు. బీజేపీకి అనుకూల ఫలితాలు రాబోతున్నాయని, కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించబోతున్నామని చెప్పారు. ఈరోజు కరీంనగర్ లోని రాజశ్రీ గార్డెన్ లో బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో బండి సంజయ్ కుమార్ సమావేశమయ్యారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, పార్టీ సీనియర్ నేతలు వాసాల రమేశ్, సాయిని మల్లేశం, గుజ్జ శ్రీను తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ "కరీంనగర్ లో బీజేపీకి మెజారిటీ స్థానాలు రాబోతుండటంతో అధికార కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైంది. ప్రలోభాలకు గురిచేసి బీజేపీ కార్పొరేటర్లను గుంజాలని చూస్తోంది. అప్పుడే కాంగ్రెస్ నేతలు ఫోన్లు చేస్తూ ప్రలోభాల స్కెచ్ కు తెర దీశారు. జాగ్రత్తగా ఉండండి."అని సూచించారు. పార్టీని మోసం చేస్తే కన్నతల్లిని మోసం చేసినట్లేనని చెప్పిన బండి సంజయ్ "అధికార పార్టీ ఆశలకు లోబడి ఎవరైనా కాంగ్రెస్ లోకి వెళితే తీవ్రమైన పరిణామాలుంటాయి. కార్యకర్తల ఆవేశాన్ని తట్టుకోవడం అసాధ్యం"అని హెచ్చరించారు. ఫలితాల సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అభ్యర్థుల తరపున ఏజెంట్లు ఏం చేయాలనే అంశంపై మాజీ మేయర్ సునీల్ రావు వివరించారు. కౌంటింగ్ ఏజెంట్ల దృష్టి అంతా బ్యాలెట్ పేపర్ మీదే ఉండాలని చెప్పారు. చర్చల పేరుతో, గొడవల పేరుతో దృష్టి మళ్లించేందుకు ప్రత్యర్థులు ప్లాన్ చేసే అవకాశముందని, వాటికి తావివ్వకుండా బ్యాలెట్ పైనే దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ కేంద్రంలో ఎవ్వరితోనూ గొడవ పడొద్దని, ఏదైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా రాసి ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్క సీటు పార్టీకి అత్యంత ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి క్షణం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ అభ్యర్థులంతా బండి సంజయ్ కు ధన్యవాదాలు తెలిపారు "ఈ ఎన్నికల్లో తమకు టిక్కెట్లు ఇవ్వడమే కాకుండా గెలుపు కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ పడ్డ కష్టాన్ని మరువలేమన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు ధన్యవాదాలు చెప్పారు. ఎన్నికల్లో గెలిస్తే కరీంనగర్ నుండి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లి హనుమాన్ ను దర్శించుకుంటే బాగుంటుందని సూచన రాగా సమావేశానికి హాజరైన కార్పొరేటర్ అభ్యర్థులంతా అందరం కలిసే పాదయాత్రగా వెళ్లి హనుమాన్ ను దర్శించుకుందామని చేతులెత్తి సమ్మతిని తెలియజేశారు.



## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

- **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ జిల్లా 12 ఫిబ్రవరి 2026 (వుదయం ప్రతినిధి):**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. సమయపాలన అత్యంత ముఖ్యమని, సిబ్బంది నిర్ణీత సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు హాజరుకావాలని ఆదేశించారు. అన్ని నియమాలను తూచా తప్పకుండా పాటిస్తూ, పారదర్శకంగా వేగంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు వీరారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో పోలింగ్ విజయవంతంగా నిర్వహించినందుకు సిబ్బందికి అభినందించారు. అదే క్రమశిక్షణతో ఓట్ల లెక్కింపును కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. అనంతరం కౌంటింగ్ హాలులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపుకు 350 మంది పోలీసులతో బందోబస్తు

- **లెక్కింపు కేంద్రం వద్ద 163 BNSS (144 సెక్షన్) అమలు**
- **విజయోత్సవ ర్యాలీలకు నిషేధం**

**సూర్యాపేట,ఫిబ్రవరి 12(వుదయం ):**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు 350 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల లెక్కింపు కేంద్రం వద్ద 163 BNSS కింద 144 సెక్షన్ రేపు ఉదయం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. అనుమతిపత్రాలు ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లకే ప్రవేశం ఉంటుందని, నిషేధిత వస్తువులు తీసుకురావద్దని సూచించారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఆదిలాబాద్ పీఠాన్ని హస్తగతం చేసుకుంటాం



- **నరేష్ జాదవ్-కంది శ్రీనివాస రెడ్డి**

**ఫిబ్రవరి 12, 2026 – ఆదిలాబాద్**

ఆదిలాబాద్ మున్సిపల్ పీఠాన్ని తప్పకుండా కైవసం చేసుకుంటామని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ ,అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గుర్తుపై పోటీచేసిన పార్టీ అభ్యర్దులతో గురువారం పట్టణం లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా ఓటింగ్ జరిగిన తీరు గురించి చర్చించారు. .తప్పకుండా గెలుస్తామన్న ధీమాను వ్యక్తం చేసారు.అనంతరం కౌంటింగ్ టెన్షన్ నుండి రిలీఫ్ గా ఉండేందుకు అభ్యర్దులను ప్రత్యేక వాహనాల్లో శిబిరాలకు తరలించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు పోటీ చేసిన అభ్యర్దులు పాల్గొన్నారు.



## బీరంగూడ లో మహాశివరాత్రికి సర్వం సిద్ధం

- **పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **అధికారులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన**

**సంగారెడ్డి జిల్లా,అమీన్పూర్ :**

రాష్ట్రంలోనే ప్రసిద్ధ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు సిద్ధం చేశామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.
బీరంగూడ డివిజన్ పరిధిలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ మరోమారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా స్థానిక భక్తులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు నాలుగు లక్షల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఐదు రోజులపాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసేందుకు ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ సైతం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా క్యూలైన్లు సైతం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులందరూ. అధికారి యంత్రాంగానికి సంపూర్ణ సహకార అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండు రంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, తహసిల్దార్ వెంకటేష్, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, సిఐ నరేష్, ఆలయ ఈవో శశిధర్, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ బి.ఎమ్.సంతోష్**

**గద్వాల ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి):**

బ్యాలెట్ పేపర్స్ కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గద్వాల మున్సిపాలిటీకి సంబంధించిన కౌంటింగ్ కేంద్రంగా గోనుపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఎంపిక చేయడంతో అక్కడ గురువారం కౌంటింగ్ సూపర్వైజర్స్, అసిస్టెంట్లకు లెక్కింపు ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 13న లెక్కింపు సందర్భంగా సిబ్బంది ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని రిపోర్ట్ చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూము తెరిచాక బ్యాలెట్ బాక్స్ లను కౌంటింగ్ హాల్స్ లోకి తీసుకెళ్లి ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కౌంటింగ్ చేసిన అనుభవం ఉన్న సిబ్బందిని ప్రస్తుతం తీసుకున్నందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కించి అనంతరం సాధారణ బ్యాలెట్ పేపర్స్ లెక్కింపు చేపట్టాలన్నారు. వార్డుల వారీగా ఆయా పోలింగ్ స్టేషన్ల బ్యాలెట్ బాక్స్ లను నిర్దేశించిన టేబుల్ వద్ద ఓపెన్ చేసి ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్లను 25 బ్యాలెట్ పేపర్ల చొప్పున కట్టలు కట్టి ఉంచాలన్నారు. తిరస్కరించ బడిన బ్యాలెట్ పేపర్ల విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి సంబంధిత రిటర్నింగ్ అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా అభ్యర్థులు రీకౌంటింగ్ కోరితే నిబంధనలను అనుసరించి రిటర్నింగ్ అధికారులు తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సీసీ కెమెరాల నిఘాలో జరుగుతుందని ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా జాగ్రత్తగా లెక్కింపు చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా వార్డు స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లను నిబంధనలను అనుసరించి కౌంటింగ్ హాల్స్ లోకి అనుమతించాలని, వారికి గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా శాంతిభద్రతలు కాపాడేందుకు అవసరమైన పోలీసు బందోబస్తు నియమిస్తామని, అధికారులు కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ కౌంటింగ్ హాల్స్ లో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, శిక్షకులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- **కలెక్టర్ హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి / ఫిబ్రవరి 12 వుదయం జిల్లా ప్రతినిధి :**



మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియను సంబంధిత అధికారులు పారదర్శకంగా బాధ్యతాయుతంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో a్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు సంబంధించిన అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో కౌంటింగ్ అనేది చాలా కీలకమైనదన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ననుసరించి ప్రాథమిక మరియు వివరనాత్మ కౌంటింగ్ నిర్వహించాలని, రూల్ 56 ప్రకారం మొదటగా పోస్టల్ బ్యాలెట్ ను లెక్కించాలని తెలిపారు. యాక్ట్ 212 ప్రకారం సిక్రేసి మెయింటెనెన్స్ యాక్టు చదివి, కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రతి బ్యాలెట్ పేపర్ కౌంటింగ్ ఏజెంట్స్ కు చూపించి సక్రమంగా దానికి సంబంధించిన పీజియాన్ సీల్ ట్రే లో వేయాలని ముఖ్యంగా చాలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. కౌంటింగ్ సిబ్బందికి తగు ముఖ్యమైన సూచనలు, సలహాలు జారీ చేశారు. కౌంటింగ్ లో ప్రతి టేబుల్ కు ఒక సూపర్వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ప్రకారం సక్రమంగా కౌంటింగ్ చేసి ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డిపిఓ విష్ణువర్ధన్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథ్ రెడ్డి, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్: పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశం

**ఫిబ్రవరి 12, 2026 – హైదరాబాద్:**

ఏలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ అన్నారు.గురువారం సాయంత్రం అయన ఆర్జాలబావి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాంలో ఏర్పాటు చేసిన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు జి. రమేష్ తో కలిసి కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆర్ ఓ,ఏ ఆర్ ఓ, కౌంటింగ్ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ రోజున సిబ్బంది అందరూ ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రంలో రిపోర్ట్ చేయాలని, కౌంటింగ్ కేంద్రంలోకి ఆర్వో ,హాల్ ఇంచార్జ్ తప్ప ఎవరి మొబైల్ ఫోన్ అనుమతి ఉండదని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్స్ సీరియల్ నెంబర్ సరిగా ఉన్నది లేనిది పరిశీలించాలని, అలాగే స్టాచుటరి మెటీరియల్, పీజియన్ బాక్స్ ,ఓట్ల లెక్కింపు తర్వాత బండిల్స్ వేసేందుకు డ్రమ్ములు వంటి అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని తెలిపారు. 13న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపట్టడం జరుగుతుందని ,అనంతరం రెగ్యులర్ ఓట్లలెక్కింపు ఉంటుందని ,కౌంటింగ్ టేబుల్ వద్ద సిబ్బంది అందరూ అలాగే ఆర్ ఓ. లతో సహా నిశ్శబ్దాన్ని పాటించాల్సిన అవసరం ఉందని, 25 బండిళ్ల చొప్పున కట్టలు కట్టిన తర్వాత ఓట్ల లెక్కింపు చేపడతారన్నారు. ఓట్ల లెక్కింపును పూర్తిగా ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని, ముఖ్యంగా చెల్లిన, చెల్లని ఓట్ల విషయంలో ఒకటికి రెండుసార్లు చూసుకొని బాక్స్ లో వేయాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీచేసిన సర్క్యులర్లు అన్నింటిని మరొకసారి చదువుకోవాలని, మొత్తం ఓట్ల లెక్కింపు చేసేటప్పుడు ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని, రీకౌంటింగ్ కు ఆస్కారం లేకుండా ఓట్ల లెక్కింపు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.సాధారణ పరిశీలకులు జీ. రమేష్ ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, డిసిఓ పత్యా నాయక్,జెడ్ పి సి ఈ ఓ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుల ఆధ్వర్యంలో సిబ్బంది రాండమైజేషన్ ను నిర్వహించారు.

## ఓట్ల లెక్కింపుకు అంతా సిద్ధం

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి, ఫిబ్రవరి 12 (వుదయం):-**



2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం లోని ఏఎంసీ గోడాన్ లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఏఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ లతో కలసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని కామారెడ్డి , ఎల్లారెడ్డి, బాన్సువాడ , బిచ్కుంద లలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించారు. నాలుగు మున్సిపాలిటీలలో కౌంటింగ్ సిబ్బంది 89 మంది సూపర్వైజర్లు, 178 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించడం జరిగిందని, కామారెడ్డి ఎన్నికల కౌంటింగ్ కొరకు సిబ్బంది 38 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 114 మంది కౌంటింగ్ సహాయకులు, వార్డులు 49 రెండు రౌండ్లు మొదటి రౌండ్ లో 32, రెండవ రౌండ్ లో 17 లెక్కింపు ఉంటుందని, ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు.అంతకుముందు కౌంటింగ్ సిబ్బంది కి శిక్షణ తరగతులు నిర్వహించి మాస్టర్ ట్రైనర్ల తో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీణ, తహసీల్దార్లు, సీపీవో తదితరులు పాల్గొన్నారు.

## 4 లేబర్ కోడ్స్ లను రద్దు చేయాలి




- **29 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలి.**
- **ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటు కరణ ఆపాలి**
- **విద్యుత్ ప్రైవేట్ కరణను ఆపాలి.**
- **విబిజి రామ్-జి పథకాన్ని రద్దు చేయాలి**
- **CITU డిమాండ్:**
- **CITU ఉమ్మడి జిల్లా మాజీ దర్శనాల మల్లేష్**

**ఫిబ్రవరి 12, 2026 – హైదరాబాద్:**

ఈరోజు ఉట్నూర్ మండల కేంద్రం ఉట్నూర్ దేశవ్యాప్త సమ్మె జయప్రదం చెయ్యాలని IB చౌరస్తా నుండి PO కార్యాలయంలో ముదర సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈరోజు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడం జరిగింది కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ నాలుగు లేబర్ కోడ్స్ ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు రైతులకు ఉపాధి చట్టం, వ్యవసాయ చట్టాలను, కార్మిక చట్టాలను మీరు నిర్వీర్యం చేసే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం చేస్తుంది వీటిని వెనక్కి డిమాండ్ చేశారు.2025 శీతకాల పార్లమెంట్ సమావేశాలు ముగిసే సమయంలో హడావుడిగా మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ నోటిపై చేసింది. గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దు చేసి వీబి జీరామ్ జీ స్కీమ్ ను తెచ్చి రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపింది. విద్యుత్ సవరణ బిల్లు 2025,విత్తన సవరణ చట్టం, ఇన్సూరెన్స్ రంగంలో 100% ఆదేశి పెట్టుబడులకు అనుమతి లాంటి మరిన్ని వినాశకమైన చట్టాలను బిల్లులను తీసుకొచ్చి శ్రామికులపై దాడి చేసింది. పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఇస్తారంగా ఉన్న శ్రామిక వర్గాలను సావు దెబ్బ కొట్టింది. కేంద్ర ప్రభుత్వం నాలుగు 4 లేబర్ కోడ్ల అమలుతో 40 కోట్ల సంఘటిత, అసంఘటిత కార్మికులు వారి కుటుంబాలు చితికిపోయ్యేలా, కార్పొరేట్లు లాభాలు ప్రోగుకోడానికి మార్గం సుగామమ్ చేసింది. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం ఆలోచించి 4లేబర్ కోడ్స్ ని రద్దు చేయాలి. 29 కేంద్ర కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలిడిమాండ్ చేశారు. చేయని యెడల రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తాం డిమాండ్ చేశారు.

## విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచాపై ఎస్పీ నిషేధం

- **గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి కి లోబడి ఉండాలి.**
- **నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ హెచ్చరిక**
- **విజయోత్సవ ర్యాలీలు ఊరేగింపులు కొరకు సంబంధిత అధికారులు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే జరుపుకోవాలి**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి):**




మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ నితికాపంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూలెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు మరియు ఎలాంటి అసాంఘిక చర్యలు చోటుచేసుకోకుండా చూసేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు, కౌంటింగ్ కేంద్రాల వెలుపల 163 బి.ఎన్.ఎస్.ఎస్ అమలులో ఉంటుందని తెలిపారు. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో భద్రత కోసం ప్రత్యేక బందోబస్తు, క్యూ.ఆర్.టి టీంలు, డాగ్ స్క్వాడ్ టీమ్స్, బాంబు డిస్పోసల్ టీమ్స్,స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉంచనునట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎస్పీ ప్రజలకు, అభ్యర్థులకు, గెలిచిన వారిని ఉద్దేశించి ముఖ్య సూచనలు జారీ చేశారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పనిసరిగా పాటించాలి. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చటం, ఊరేగింపులకు ఎలాంటి అనుమతి లేదు.శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు పూర్తిగా నిషేధం. జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, గొడవలు అల్లర్లు సృష్టించే వారిని, నిబంధనలకు విరుద్ధంగా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించే వారిపై రిమాండ్ లోకి తీసుకోవలసి ఉంటుందని తెలిపారు.ర్యాలీలు లేదా ఊరేగింపులు నిర్వహించుట కొరకు సంబంధిత అధికారుల ఉత్తర్వుల మేరకు వారు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే జరుపుకోవాలి. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే, లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడాలని, ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



## ఓట్లు లెక్కింపు ప్రక్రియపై అధికారులకు ప్రత్యేక శిక్షణ

- **జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 12(వుదయం జిల్లా ప్రతినిధి):**

13వ తేదీన నిర్వహించనున్న పురపాలక సంస్థల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు.గురువారం జిల్లా కేంద్రంలో ని డా బిఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలోని మిని ఫంక్షన్ హాలులో ఓట్లు లెక్కింపు ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్ వైజర్లకు ప్రత్యేక శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓట్లు లెక్కింపు కేంద్రంలో అనుసరించాల్సిన నియమావళి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, టేబుల్‌వైజ్ కౌంటింగ్ విధానం, బాలెట్ పేపర్లు వేరు చేయుట, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విధానం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రతి రౌండ్ లెక్కింపు పూర్తయ్యే సరికి ఫలితాలను సమగ్రంగా నమోదు చేసి, సంబంధిత అభ్యర్థుల ఏజెంట్లు సంతకాలు తీసుకోవాలని, తదుపరి పరిశీలకుల అనుమతితో విజేతలను ప్రకటించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. లెక్కింపు కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు. గుర్తింపు కార్డు కలిగిన వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. సిబ్బంది ఉదయం 7 గంటల వరకు లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, అనుమతి పొందిన వ్యక్తులకే ప్రవేశం కల్పించబడుతుందని స్పష్టం చేశారు.లెక్కింపు సిబ్బంది సమయానికి కేంద్రాలకు హాజరై తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఎలాంటి.పొరపాటుకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ శిక్షణ సమావేశంలో ఎస్పి సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోనా, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలు

రంగారెడ్డి జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్-2025-26 పోటీలు తేదీ 12 022026 న గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా నిర్వహించబడినవి. ఈ పోటీలలో ఫుట్ బాల్, జూడో, స్విమ్మింగ్, రెజ్లింగ్, టేక్వాండో, అట్యాపాట్యా, పవర్‌లిఫ్టింగ్ మరియు హాకీ విభాగాలలో పోటీలు నిర్వహించబడినవి.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల నుండి 1500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు.పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు మరియు పతకాలు ప్రదానం చేయబడినవి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ మల్లారెడ్డి గారు - అధ్యక్షులు, ఒలింపిక్ అసోసియేషన్,శ్రీ ఈ. వెంకటేశ్వర్ రావు గారు - డీవైఎస్ఓ,శ్రీ మధు గారు - స్టేడియం అడ్మినిస్ట్రేటర్,ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీ మనోహర్ గారు,జిల్లా కోచ్‌లు మరియు ఫిజికల్ డైరెక్టర్లుహాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అందరి సమన్వయం మరియు కృషితో ఈ పోటీలు అత్యంత విజయవంతంగా పూర్తయ్యాయి.ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లు మరియు క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలలో రంగారెడ్డి జిల్లాను ప్రాతినిధ్యం వహించనున్నారు.పోటీల ఫలితాలు

ఫుట్ బాల్ (బాలురు):
విజేతలు - శేరిలింగంపల్లి నియోజకవర్గ జట్టు
రన్నర్స్ - ఇబ్రహీంపట్నం నియోజకవర్గ జట్టు

ఫుట్ బాల్ (బాలికలు):
విజేతలు - రాజేంద్రనగర్ నియోజకవర్గ జట్టురన్నర్స్ - ఇబ్రహీంపట్నం నియోజకవర్గ జట్టుఈ జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలు యువతలో క్రీడా ప్రతిభను పెంపొందిస్తూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్-2025-26 పోటీలు గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా ముగిసినట్లు తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులను 20022026 నుండి జరిగే రాష్ట్ర స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలకు పంపించడం జరుగుతుంది. రాష్ట్ర స్థాయిలో మొత్తం 44 గేమ్స్ నిర్వహించబడనున్నట్లు అధికారులు తెలిపారు.




## మార్చి 1న
# వెంకయ్యనాయుడు రాక

ఖమ్మంలో భారతరత్న అటల్ బిహారి వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలు

**ఖమ్మం, ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి)**

మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారి వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలు మార్చి 1న ఖమ్మంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు అటల్ బిహారి వాజ్ పేయి ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుద్దుకూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దుద్దుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలకు ముఖ్య అతిధులుగా మాజి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఖమ్మం వస్తున్నారని, వారితోపాటు ప్రముఖ కవి, రచయిత, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, అఖిలభారత సామాజిక సమరసత కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్, రాష్ట్ర మంత్రులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఖమ్మం ఎస్సార్ గార్డెన్ లో జరిగే అటల్ బిహారి వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలలో 'అటల్ జీకి అక్షర నీరాజనం కవితా సంకలనం' పుస్తక ఆవిష్కరణ ఉంటుందన్నారు. భారతదేశాన్ని ప్రగతి బాటలో నడిపిన మహా నాయకుడు వాజ్ పేయి అని, వారు చూపిన మార్గాన్ని భావితరాలకు చేరేవిధంగా శతజయంతి వేడుకలను ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మందడపు ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వడ్లమూడి సురేష్,

కోశాధికారి మల్లెంపాటి రమేష్, కార్యదర్శులు యలమందల మధు, బోళ్ల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
# 450 మంది పోలీసులతో భారీ బందోబస్తు!

- ఓట్ల లెక్కింపు సందర్భంగా శుక్రవారం 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్ అమలు)... విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధం...
- ఎలక్షన్ కమిషన్ ద్వారా జారీ చేయబడిన గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే లెక్కింపు కేంద్రంలోకి అనుమతి...

జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్

**జగిత్యాల, ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి)**



మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా 450 మంది పోలీస్ లతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ తెలిపారు ఓట్ల లెక్కింపు కేంద్రమైన ఎస్ కే ఎన్ ఆర్ డిగ్రీ కాలేజీ వద్ద ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ తో కలిసి జిల్లా ఎస్పి అశోక్ కుమార్ పరిశీలించారు ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రత నిర్వహిస్తున్నామని తెలిపారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్ అమలు) చేస్తున్నామని తెలిపారు ఈ యొక్క 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ శుక్రవారం ఉదయం 6 గంటల నుండి శనివారం ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటుందని తెలిపారు ఈ సెక్షన్ అమలులో ఉన్నప్పుడు ధర్నాలు రాస్తారోకోలు ఊరేగింపులు టపాకాయలు కాల్చడం సభలు సమావేశాలు విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధమని వాటిని నిర్వహించకూడదని తెలిపారు నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు ఓట్ల లెక్కింపు కేంద్రమైన ఎస్ కే ఎన్ ఆర్ డిగ్రీ కాలేజీ పరిసర ప్రాంతాలను డాగ్స్ స్క్వాడ్ బాంబు డిస్పోజల్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు ఓట్ల లెక్కింపునకు హాజరు అయే అభ్యర్థులు ఏజెంట్లు నిషేధిత వస్తువుల అయిన అగ్గిపెట్టెలు లైటర్ ఇంక్ బాటల్స్ పేలుడు కారణం అయే ఎలాంటి వస్తువులను లెక్కింపు కేంద్రాల్లోకి తీసుకురాకూడదని తెలిపారు తనిఖీలు చేసే సిబ్బందికి సహకరించాలని కోరారు ఎలక్షన్ కమిషన్ ద్వారా జారీ చేయబడిన గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే లెక్కింపు కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో డిఎస్పి లు రఘు చందర్ రాములు ఇన్స్పెక్టర్ లు ఎస్ఐ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ..

ఎమ్మెల్యే పాయం..

**పినపాక , ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి)**

మణుగూరు మండల పరిధిలోని రేగులగండి గ్రామానికి సంబంధించిన పలు సమస్యలపై గ్రామస్థులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పాయం ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందచేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాట్లాడుతూగ్రామంలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, అభివృద్ధి పనులు మరియు ఇతర అవసరాలపై వివరించి, తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులుకోరారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ పినపాక నియోజకవర్గం లో పలు కార్యక్రమంలో సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పినపాక నియోజకవర్గం లో ప్రతి గ్రామంలో ప్రతి అభివృద్ధిలో ముందుకు సాగడమే మా లక్ష్యం అని అన్నారు కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ , ఎనిక బాలకృష్ణ, 16వ వార్డు సభ్యులు గుండి దేవా, గుండి భీమయ్య, గుండి రవి , కారం భీమయ్య , కారం జోగయ్య , గుండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునుకు సహకరించిన
# ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు

**ఖమ్మం ,ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి**

)జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ జిల్లా లోని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు,కార్యకర్తలకు, అభిమానులకు,కాంగ్రెస్ గెలుపు కొరకు శ్రమించిన అన్ని వర్గాల ప్రజలకు, మీడియా పాత్రికేయులకు,ఫోటోగ్రఫి మిత్రులకు అదేవిధంగా కాంగ్రెస్ గెలుపు కొరకు సహకరించిన అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.అదే విధంగా



మున్సిపాల్టీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయడంకా మ్రోగించేందుకు జిల్లాలో తిష్టవేసి ప్రత్యేక కార్యాచరణ చేసి,నాయకులకు,కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచార & పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార చేనేత & జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి లకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి

సత్యనారాయణ గౌడ్

# దేశవ్యాప్త సమ్మెలో భాగంగా టీఎన్‌జీవో నిరసన
## భోజన విరామ సమయంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన

**సిద్దిపేట ,ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి)**




ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్‌జీవో) యూనియన్ రాష్ట్ర శాఖ నిర్ణయం ప్రకారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సిద్దిపేట జిల్లా టీఎన్‌జీవో ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా, కలెక్టరేట్ యూనిట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిద్దిపేట యూనిట్ అధ్యక్షుడు మఠం శశిధర్, కార్యదర్శి పోతుల సత్యనారాయణ, కలెక్టరేట్ యూనిట్ కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన ఐదు డీఏలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే వేతన స్థిరీకరణ (పీఆర్‌సీ) నివేదికను త్వరగా వెలువరించి, ఉద్యోగులందరికీ వేతన స్థిరీకరణ చేపట్టాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ దిశగా తక్షణ చర్యలు తీసుకొని అవసరమైతే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి పాత పెన్షన్ అమలుకు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

అలాగే ఉద్యోగులు మరియు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ ఉద్యోగులపై అధిక పనిభారం ఉందని, వారికి అప్పగించిన విధులకంటే ఇతర పనులు ఎక్కువగా చేయించ బ దుతున్నాయ ని పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి, తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత తీవ్ర ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# కుక్కను ఢీకొని ఒకరికి గాయాలు





**అందోల్ ,ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి)**

మెదక్ జిల్లా అల్లాదుర్గం వద్ద 161వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది.

నిజాంసాగర్ గోల్ బంగ్లా పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా.. అకస్మాత్తుగా ఒక కుక్క అడ్డురావడంతో ఇంజినీర్ నాగరాజు ఢీకొట్టారు. ఈప్రమాదంలో ఆయన బైక్ పైనుంచి కింద పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆయనకు 108 అంబులెన్స్ సహాయంతో సంగారెడ్డి జిల్లా జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఆంక్షలు..
# మద్యం దుకాణాలు బంద్ : పోలీస్ కమిషనర్

**ఖమ్మం ,ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి**



ఫిబ్రవరి 12 న (శుక్రవారం) మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా లెక్కింపు కేంద్రాల వద్ద ఆంక్షలు విధిస్తూ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు 13వ తేదీ ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 163 BNSS విధించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నిషేధిత కర్రలు, లాఠీలు, పేలుడు పదార్థాలు, ఆయుధాలతో తిరగడాన్ని నిషేధించారు. మైక్‌లు, మ్యూజిక్ సిస్టమ్, ప్రసంగాలు చేయడం, నిషేధిత ఫోటోలు, సింబల్స్, ప్లకార్డులు ప్రదర్శించకూడదని ఆదేశించారు. ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, బహిరంగ సభలు, సమావేశాలు నిషేధమని, ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడరాదని పేర్కొన్నారు. రోడ్లు మరియు బహిరంగ ప్రదేశాలలో గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు, డీజేలు పెట్టుకోవడం,టపాసులు కాల్చడంపై నిషేధం విధించామని తెలిపారు. ఎవరైనా నిబంధనలు పాటించకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.విధి నిర్వహణలో ఉన్న పోలీసు, మిలటరీ, ఎలక్షన్ అధికారులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. అదేవిదంగా ఓట్ల లెక్కింపు సందర్భంగా శుక్రవారం ఉదయం 8:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు ఖమ్మం జిల్లా పరిధిలోని ఏదులాపురం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు మునిసిపాలిటీ కౌంటింగ్ సెంటర్ పరిధిలో వైన్ షాపులు, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు, మూసివేయాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలలో భాగంగా మూసివేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటిస్తూ కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు.

శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో

## మహాశివరాత్రి పర్వదినోత్సవాలకు ఆహ్వానం



**నల్లగొండ ,ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి)**

నార్కెట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి పర్వదినోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం కి ఆలయ ఈవో మోహన్ బాబు గారు, స్థానిక సర్పంచ్ నేతగాని కృష్ణ గారు, అర్చకులు మర్యాదపూర్వకంగా అందజేశారు.ఈ సందర్భంగా మహాశివరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ

అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే వేముల వీరేశం స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# సిద్దిపేట విద్యాలయాలకు నిలయం – హరీష్‌రావు
## 10వ తరగతి విద్యార్థులకు 'డిజిటల్ స్టడీ' కంటెంట్ పంపిణీ
## వెటర్నరీ కళాశాల తరలింపుపై త్వరలో ఆందోళన

**సిద్దిపేట ,ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి**



సిద్దిపేటను విద్యాలయాల నిలయంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుదేనని జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, నియోజకవర్గ అధ్యక్షుడు శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెలలో 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాలను హరీష్‌రావు అందజేస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లుగా పదవ తరగతి విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నారని చెప్పారు.సిద్దిపేట నియోజకవర్గంలోని 2,800 మంది 10వ తరగతి విద్యార్థులకు సుమారు రూ.5 లక్షల విలువైన డిజిటల్ కంటెంట్ పుస్తకాలను హరీష్‌రావు స్వంత ఖర్చుతో పంపిణీ చేస్తున్నారని వెల్లడించారు. పాఠశాలలో ప్రత్యేక తరగతులు, ఇంట్లో డిజిటల్ స్టడీ ద్వారా పునశ్చరణ చేసుకునేలా ఈ పుస్తకాలు ఉపయోగపడతాయని తెలిపారు. "స్కూల్‌లో స్పెషల్ స్టడీ – ఇంట్లో డిజిటల్ స్టడీ" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిద్దిపేట అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తోందని, ముఖ్యంగా విద్యారంగంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నదని అన్నారు. రెండు మెడికల్ కళాశాలలు, డిగ్రీ, పీజీ, మహిళా డిగ్రీ కళాశాలలు, నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, కస్తూర్బా పాఠశాలలు వంటి అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేయడంలో హరీష్‌రావు కృషి చేశారని తెలిపారు.

అలాగే సుమారు రూ.300 కోట్లతో మంజూరైన వెటర్నరీ కళాశాల పనులు సగం పూర్తయిన తర్వాత దానిని కొడంగల్‌కు తరలించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రజలపై కక్ష సాధింపుగా ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపిస్తూ, దీనిపై త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.విద్యార్థులు ఈ డిజిటల్ కంటెంట్‌ను సద్వినియోగం చేసుకొని ఉత్తమ మార్కులు సాధించాలని నాయకులు సూచించారు.కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నరేందర్, చిన్నకోడూర్ మండలం ఉపాధ్యక్షులు గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, సందీప్, చందు గౌడ్, భానుచందర్, ఆనంద్, రామరాజు, సంపంగి శ్రీకాంత్, గొట్టం అమర్, గణపురం సాయి తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ బాక్స్ లను తరలింపు

బ్యాలెట్ బాక్స్ లను తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ నుండి కౌంటింగ్ సెంటర్ కు తరలింపు

**నల్లగొండ ,ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి)**



నల్గొండ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన 2వ సాధారణ ఎన్నికల సందర్భంలో, పోలింగ్ ముగిసిన అనంతరం బుధవారం అర్ధరాత్రి మొత్తం 199 పోలింగ్ కేంద్రాల (పీఎస్ నెం. 1 నుండి 199 వరకు) బ్యాలెట్ బాక్సులు , పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ను డీఆర్‌సీ సెంటర్‌లోని తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ నుండి కౌంటింగ్ సెంటర్ (తెలంగాణ స్టేట్ వేర్‌హౌస్ గోదాములు, అర్జాలబావి) లోని ప్రధాన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించినట్లు జిల్లా అదనపు ఎన్నికల అధికారి నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి శరత్ చంద్ర వెల్లడించారు.ఈ బ్యాలెట్ బాక్సులు పోటీ అభ్యర్థుల

# కౌంటింగ్ సెంటర్ పరిధిలో నిషేధాజ్ఞలు




**వరంగల్ క్రైం, ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి) :**

నిన్నటి రోజున జరిగిన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రేపటి రోజున జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట ప్రాంతాల్లో కౌంటింగ్ నిర్వహిస్తుండడంతో శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్. ఎస్ సి. ఆర్. పిసి 163 ప్రకారం ప్రజలు ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధించడం జరిగింది. ఈ నిషేధం రేపు ఉదయం 6గంటల నుండి మరుసటి రోజు అనగా 14తారీఖు ఉదయం 6 గంటల వరకు అమలులో వుంటుందని. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ హెచ్చరించారు.

# లేబర్ కోడ్లను రద్దుచేయాల్సిందే
## ★ కార్మిక మహా ప్రదర్శనలో బొట్ల చక్రపాణి డిమాండ్

**పరకాల టౌన్, ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి) :**




కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే విధంగా రూపొందించిన 4 లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, విబిజి రామ్ జీ బిల్లును రద్దు చేయాలనీ సిఐటియు జిల్లా కోశాధికారి బోట్ల చక్రపాణి కేంద్రం ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా హుజురాబాద్ రోడ్డులోని పెట్రోల్ పంపు నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా అమర ధామం వరకు డప్పు చప్పులతో కార్మిక మహాప్రదర్శన నిర్వహించారు. సభకు ఏఐసిసిటియు జిల్లా అధ్యక్షులు బొట్ల ప్రభాకర్ అధ్యక్షత వహించగా చక్రపాణి పాల్గొని మాట్లాడుతూ కార్మికులు దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ శక్తులకు మేలు చేకూరేలా కేంద్రం ప్రభుత్వం నాలుగు లేబర్ కోట్లు తెచ్చారని వీటి ఫలితంగా కార్మికులు యజమానులకు పనిచేయాల్సి వస్తుందని ఆయన మండిపడ్డారు. వీటి ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తూ, 'హైర్ అండ్ ఫైర్' (నియమించు–తొలగించు) పద్ధతిని చట్టబద్ధం చేయడం, 12 గంటల పని పెంపుదల, సమ్మె చేసే హక్కు కనీస వేతనం ఉద్యోగ భద్రత లాంటి చట్టబద్ధ హక్కులు లేకుండా పనిచేయాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని 50 సంవత్సరాల పైబడిన వారికి తొమ్మిది వేల పెన్షన్ ఇవ్వాలని తదితర డిమాండ్లుతో ఈ సమ్మెలో విద్యుత్ సవరణ చట్టం–2025, విత్తన సవరణ బిల్లు, మరియు ఎల్ఐసిలో 100 శాతం విదేశీ పెట్టుబడుల అనుమతి వంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని అయన డిమాండ్ చేస్తున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాల అధికారాలను కేంద్రం హస్తగతం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఈ సమ్మెలో సుమారు 40 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న ఈ మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యు సి నాయకులు లంకదాసరి అశోక్ వివిధ సంఘాల నాయకులు లంకదాసర అశోక్ నరసింహులు బచ్చు ఆదాం సాంబయ్య రమేష్ మోహన్ పసుల సారయ్య పైడి ఉపేందర్ రాజేందర్ సారంగపాణి సుధాకర్ కుమారు కుమార్ ప్రమోద్ కోటయ్య పసుల సారయ్య వసంత కమల రాధా కుమారస్వామి తోపాటు 300 భవనం, హమాలి, మున్సిపాల్ మంది కార్మికులు పాల్గొన్నారు

# చిన్నారులను గుర్తిస్తే
# పోలీసులకు సమాచారం ఇవ్వండి







**వరంగల్ క్రైం, ఫిబ్రవరి 12**
**(వుదయం ప్రతినిధి) :**

గత నెల జనవరి మాసంలో కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే స్టేషన్ పరిసరాల్లో చిన్నారులను అపహరించి విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను టాస్క్‌ఫోర్స్, కాజీపేట పోలీసులు సంయుక్తం అరెస్టు చేసి నిందితుల నుండి అపహరణకు గురైన చిన్నారులను రక్షించడం జరిగింది. రక్షించబడిన కొందరు చిన్నారులను వారి తల్లిదండ్రులను గుర్తించి అప్పగించడమైనది. అపరహణకు గురై రక్షించబడిన పై ఫోటోలోని మరో ముగ్గురు చిన్నారులు ప్రస్తుతం శిశు సంక్షేమ శాఖ సంరక్షణలో వున్నారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో ఫోటోలోని చిన్నారులలో ఒకరైన 6 సంవత్సరాల వయస్సు బాబు 2023, అక్టోబర్ నెలలో కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నుండి నిందితులు అపహరించినట్లుగా వెల్లడించారు. మరో ఏడు మాసాల పాపను 2025, అక్టోబర్ లో మంచిర్యాల రైల్వే స్టేషన్ పరిసరాల నుండి,

అలాగే మరో 5మాసాల పాపను నిందితులు రామగుండం రైల్వే స్టేషన్ పరిసరాల నుండి అపరిహరించినట్లుగా పోలీసుల విచారణలో తెలియజేసారు. ఈ ముగ్గురు చిన్నారులను ఎవరైన గుర్తించిట్లుయితే కాజీపేట్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, సెల్ నంబర్ 871268122 సంప్రదించి, తగిన రుజువులు చూపించిన రక్తసంబంధీకులకు చిన్నారులను అప్పగించబడుతుందని కాజీపేట ఇన్స్‌స్పెక్టర్ తెలియజేసారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి!

రిజిస్ట్రార్ వి. రామచంద్రం

**కాజీపేట, ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి) :**




పింగిళి ప్రభుత్వ డిగ్రీ పీజీ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)హన్మకొండలో "సెక్యూరింగ్ ది డిజిటల్ ఫ్యూచర్: సైబర్ సెక్యూరిటీ అండ్ డేటా ప్రైవసీ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్"అనే అంశంపై పి ఎం ఉష (ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్) హైదరాబాద్ వారి సహకారంతో ,కళాశాల కంప్యూటర్ సైన్స్ & అప్లికేషన్స్ విభాగం నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి అధ్యక్షత వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఈ అధునాతన డిజిటల్ యుగంలో ఉన్నత విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సైబర్ ముప్పులు , సమాచార భద్రత, నైతిక బాధ్యతలను గురించి విశ్లేషణాత్మకంగా ఈ సదస్సు తెలియజేస్తున్నందుకు నిర్వాహకులను అభినందిస్తున్నానని అన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన కాకతీయ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి , కాకతీయ యూనివర్సిటీ ఈ సి మెంబర్ ప్రొఫెసర్ బి. రమ కీలకోపన్యాసం చేస్తూ సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్,సైబర్ క్రైమ్ మొదలైన అంశాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ సైబర్ భద్రత , నైతిక విలువల గురించిన అనేక అంశాలను

ఈ సదస్సు ప్రత్యేకంగా పేర్కొంటున్నదని,ఈ సదస్సు అధ్యాపకులకు, కంప్యూటర్ రంగ నిపుణులకు, పరిశోధకులకు, విద్యార్థులకు, ఔత్సాహికులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఈ జాతీయ సదస్సుకు రెండువందలకు పైగా పరిశోధనా పత్రాలు రావడం నిజంగా గర్వించదగినదనిఅన్నారు. సదస్సులో డెబ్బై పూర్తి స్థాయి పరిశోధక పత్రాలతో కూడిన సావనీర్ ను ముఖ్య అతిథి, అతిథులు, ప్రిన్సిపాల్, కన్వీనర్, నిర్వాహకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అతిథులను శాలువా,పుష్పగుచ్చం,జ్ఞాపిక లతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి.సుహాసిని, అకడమిక్ కో ఆర్డినేటర్ డా. ఎం.అరుణ, వివిధ విభాగాల అధిపతులు, కళాశాల అధ్యాపకులు బి. స్వర్ణలత,డా. పి. ప్రతిభ, టి. అరుణ, పి. భారతి, ఎం. శ్రీదేవి, కె. సరిత,

డి. దివ్య, బోధన బోధనేతర సిబ్బంది ఇతర కళాశాలల అధ్యాపకులు,పరిశోధకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన

# ఉపాధ్యాయులు అందించాలి

- ఎంపీపీ ఎస్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ.
- డిస్ట్రిక్ లెవెల్ పానెల్ ఇన్స్పెక్షన్ టీమ్.
- టీమ్ సభ్యులు రఘు, కుమారస్వామి.

**ఖానాపురం, ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి):**



విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యా బోధన చేయాలని డిస్టిక్ లెవెల్ పానెల్ ఇన్స్పెక్షన్ టిమ్ సభ్యులు రఘు, కుమారస్వామి ఉపాధ్యాయులకు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్యనాయుడు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు పట్టికను తరగతి గదులను బోధనా అభ్యసన సామర్థ్యాలను మధ్యాహ్న భోజనంను టాయిలెట్స్ క్షుణంగా పరిశీలించి ఉపాధ్యాయుల విద్యార్థులకు బోధించే బోధనపై సంతృప్తి వ్యక్తం చేసి ఉపాధ్యాయులకు తగు సలహా సూచనలు చేశారు. ఇన్స్పెక్షన్ టీమ్ సభ్యులు పాఠశాలలో గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, వార్డు సభ్యులు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించడానికి ప్యానెల్ బోర్డు ద్వారా కంప్యూటర్ విద్యను అందించాలని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మన పాఠశాలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సర్పంచ్ కి వార్డు సభ్యులకు తెలిపారు. అలాగే ఈనెల 21న జరగబోయే ఎఫ్ ఎల్ ఎస్ ఎగ్జామ్ కి మూడవ తరగతి విద్యార్థులను సన్నద్ధం చేసి జిల్లాలోని మొదటి స్థానం సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దిరాజు, వార్డు సభ్యులు వేములపల్లి వెంకటప్రసాద రావు, గుల్లపల్లి విజయ్, చలిగంటి మల్లికార్జున్, గుల్లపల్లి మంజుల, తోటకూరి సంధ్య, ఉపాధ్యాయులు దివ్య, శ్రీనివాస్, మల్లయ్య, సిఆర్ పి తండా రమేష్, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల నిబంధనలకు లోబడే ఓట్ల లెక్కింపు,
- 3 రౌండ్లలో పూర్తిస్థాయి ఫలితాలు ఒక్కో రౌండ్‌లో 8 వార్డుల లెక్కింపు,
- అత్యంత పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి) :**



జిల్లాలో నిర్వహించనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.గురువారం జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ నైస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, టింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను పరిశీలించారు. ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని, వార్డు వారీగా ఓట్ల లెక్కింపు క్రమబద్ధంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఓట్ల లెక్కింపు రోజున ఉదయం 6 గంటలకల్లా సిబ్బంది తమ తమ కౌంటింగ్ కేంద్రాలకు హాజరు కావాలని ఆదేశించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభించి, అనంతరం పోలింగ్ కేంద్రాలు, వార్డుల వారీగా బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరవాలని తెలిపారు.ప్రతి 25 ఓట్లను ఒక కట్టగా తయారు చేసి, లెక్కించాలన్నారు.చెల్లిన ఓట్లను మాత్రమే సంబంధిత అభ్యర్థి గుర్తు ఉన్న బాక్సుల్లో వేయాలని సూచించారు. చెల్లని ఓట్లను గుర్తించి ప్రకటించే పూర్తి బాధ్యత రిటర్నింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. మొత్తం కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికల నిబంధనలకు లోబడి, పారదర్శకంగా సాగాలని ఆదేశించారు.నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో 8 టేబుళ్లు ఏర్పాటు చేసి, ప్రతి టేబుల్‌కు ముగ్గురు చొప్పున మొత్తం 24 మంది కౌంటింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. ఒక్కో రౌండ్‌లో 8 వార్డుల చొప్పున లెక్కింపు జరిపి, మొత్తం 3 రౌండ్లలో పూర్తిస్థాయి ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు.కల్వకుర్తిలో 8 టేబుళ్లు ఏర్పాటు చేసి 24 మంది అధికారులు, కొల్లాపూర్‌లో 7 టేబుళ్లు ఏర్పాటు చేసి 21 మంది అధికారులు కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు మొత్తం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరుగుతుందని పేర్కొన్నారు.కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, మూడంచెల భద్రత కల్పించడం, స్ట్రాంగ్ రూముల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. స్ట్రాంగ్ రూములను కూడా తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లను సమీక్షించినట్లు చెప్పారు.అభ్యర్థులు మరియు వారి ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు తలెత్తిన పక్షంలో వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఓట్ల లెక్కింపును ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దేవ సహాయం, డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్,

నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి తదితరులు పాల్గొన్నారు

## డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్యకు వినతి

### అందజేసిన రామ రాజేష్ ఖన్నా



**హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి) :**

ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈరోజు ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉమ్మడి జిల్లా ఉద్యోగులందరూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నాలో పాల్గొనడం జరిగింది.. ఉద్యోగుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డి ఎం అండ్ హెచ్ ఓ కు డాక్టర్ అల్లం అప్పయ్య కు అందజేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ... ఉద్యోగులకు రావలసిన పెండింగ్ మూడు నెలల వేతనాలు నవంబర్ , డిసెంబర్ మరియు జనవరి వేతనాలు వెంటనే విడుదల చేయాలని ,కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ,ఈ.ఎస్.ఐ., పీ.ఎఫ్. ప్రతినెల ఉద్యోగుల ఖాతాలు జమ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఉద్యోగులందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఎన్ హెచ్ ఎం ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగులందరూ ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటియుసి అనుబంధం ఆచంట అభిషేక్, ఏఐటియుసి హనుమకొండ జిల్లా లంక దాసరి అశోక్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగులు దాడి మాధవరావు, అజ్మీర విజయ నాయక్ మరియు సుమారు 50 మంది ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు...

## మహిళా భక్తులకు ప్రత్యేక వసతులు

**రాయపట్నంలో మహిళా భక్తులకు ప్రత్యేక దుస్తుల మార్పిడి గదులు**



**ధర్మపురి ఫిబ్రవరి12 (వుదయం ప్రతినిధి):**

గోదావరి పుణ్య స్నానాలకు ప్రతి సంవత్సరం భారీగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాయపట్నం గ్రామపంచాయతీ కీలక నిర్ణయం తీసుకుంది. గోదావరిలో పుణ్య స్నానం ఆచరించిన అనంతరం మహిళా భక్తులు దుస్తులు మార్చు కోవడానికి ఇబ్బందులు ఎదుర్కొం

టున్న నేపథ్యం లో గ్రామపంచా యతీ సర్పంచ్ రాందేనిమొగిలి, ఉపసర్పంచ్, గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రత్యేక మార్పిడి గదులను ఏర్పాటు చేశా రు.సుమారు రూ.45 వేల వ్యయంతో నిర్మించిన ఈ గదులు మహిళా భక్తులకు ఉపశమనం కలిగించను న్నాయి.ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న సమస్యకు పరి ష్కారం దొరికిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలిపారు.

### జైన గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా

# సుంకు మధుసూదన్

**ధర్మపురి,ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి):**



మండలంలోని జైన గ్రామ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జైన గ్రామ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు మచ్చ సత్యం పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో సభ్యుల ఓటింగ్ ద్వారా బాధ్య లను ఎంపిక చేశారు.నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా సుంకు మధుసూదన్,ప్రధాన కార్యదర్శిగా అయ్యోరు సత్యం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పేరగాని తిరుపతి, కుడిక్యాల వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా గాజుల సత్యం, కోశాధికారిగా అంకం ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా అధ్యక్షుడు మధుసూదన్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.కుల బాంధవుల ఐక్యతే లక్ష్యంగా సంఘ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ

కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కార్మిక శక్తిని తాకట్టు పెట్టేందుకే లేబర్ కోడ్స్



- మోడీ పాలనలో హక్కుల హననం
- కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతల హెచ్చరిక
- ఖమ్మంలో ప్రదర్శన

**ఖమ్మం ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి) :**

దేశంలోని కార్మిక శక్తిని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ను అమల్లోకి తీసుకు వచ్చిందని అఖిల పక్ష, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్స్తో పాటు విద్యుత్, -విత్తన సవరణ బిల్లులు, విబిజీరాంజీ చట్టం కూడా దేశ ప్రజల పాలిట శాపంగా మారాయని వాటిని తక్షణం రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం ఖమ్మంలోని పెవిలియన్ మైదానం నుంచి జెడ్పి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు, బ్యాంకు ఉద్యోగ సంఘాలు, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతు సంఘాలు సంపూర్ణ మద్దతునిచ్చాయి. పెవిలియన్ మైదానంలో వివిధ కార్మిక సంఘాల అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, నరాల -నరేష్నాయుడు, కళ్యాణం వెంకటేశ్వరరావు, కె. శ్రీనివాస్, వెంకన్న, ఎండివై పాషా అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ -సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్రావు, కాంగ్రెస్ నాయకులు నాగండ్ల దీపక్ చౌదరి, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శి -గోకినేపల్లి వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు ఎస్ కె ఖాసీం, గుండాల కృష్ణ తదితరులు ప్రసంగించారు. బ్రిటిష్ పాలన కాలంలో సైతం కార్మికులు పోరాడి కార్మిక చట్టాలను, హక్కులను సాధించుకున్నారని దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం రద్దు చేస్తుందని ఆరోపించారు. 50 కోట్ల కార్మిక హక్కులను ఒక శాతం జనాభా కలిగిన కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు లేబర్ కోడ్స్ను తీసుకు వచ్చారని ఆయన తెలిపారు. ఏ ప్రభుత్వం ఇంత వరకు కార్మికులకు అనుకూల చట్టాలు చేయలేదని కార్మికుల పోరాట -ఫలితంగానే పాలకులు చట్టాలు తీసుకు వచ్చారని వారు తెలిపారు. ఇప్పటికే ప్రైవేటీకరణ వేగం పెంచిన మోడీ ప్రభుత్వం యావత్ దేశ -సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే క్రమంలోనే 29 కార్మిక చట్టాలను మార్చారన్నారు. మోడీ తీసుకు వచ్చిన చట్టాలలో సంక్షేమం, హక్కులు లేకపోగా ఆ చట్టాలకు సంక్షేమ చట్టాలని పేరుపెట్టడం నేతి బీరకాయలో నేతి చందమే నన్నారు. తక్షణమే లేబర్ కోడ్లను రద్దు చేసి పాత చట్టాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెకు వచ్చిన స్పందన చూసిన తర్వాతనైనా తమ నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం మార్చుకోవాలన్నారు. లేని పక్షంలో తగిన ఫలితాన్ని అనుభవించక తప్పదని వారు హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో వివిధ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

### పోలీసు కమిషనర్ గౌష్ ఆలం.

**కరీంనగర్, ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి):**




మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు.గురువారం కరీంనగర్ లోని అస్త్ర కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన పోలీస్ బ్రీఫింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం వెలుపల 100 మీటర్ల దూరం నుండే తనిఖీలు ప్రారంభమవుతాయి. అనుమతి పత్రాలు ఉన్న వారిని మాత్రమే క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత లోపలికి అనుమతిస్తారు. ఏజెంట్లు, అభ్యర్థులు, సిబ్బంది తమ వెంట అగ్గిపెట్టెలు, సిగరెట్లు, వాటర్ బాటిళ్లు, ద్రవ పదార్థాలు, ఇతర ఫ్లెమబుల్ (మంటలు చెలరేగే) వస్తువులను తీసుకురావడంపై పూర్తిగా నిషేధం విధించారు.ఎన్నికల కమిషన్ జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు ఉన్న వారికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.కౌంటింగ్ కేంద్రాల వద్ద మరియు నగర వ్యాప్తంగా నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తూ నిఘా ఉంచుతామని సీపీ తెలిపారు.కౌంటింగ్ అనంతరం గెలుపొందిన అభ్యర్థులు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదని సీపీ స్పష్టం చేశారు. డీజే వినియోగంపై పూర్తి నిషేధం ఉందని, నిబంధనలు అతిక్రమిస్తే డీజే పరికరాలను సీజ్ చేయడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఎన్నికల ఫలితాల వేళ ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు సహకరించి శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని సీపీ గౌష్ ఆలం కోరారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 ( వుదయం ప్రతినిధి )**

ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలోని గ్రామపంచాయతీలలో అభివృద్ధి పనులను గురువారం మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. మండలంలోని పాపణపేట్, తలయి మరియు సోమిని గ్రామ పంచాయతీలలో నర్సరీలని పరిశీలించి ఎర్రమట్టి, నల్లమట్టి ఇసుక మరియు సూపర్ ఫాస్పేట్ తగిన పాళ్ళలో కలిపి బ్యాగ్ ఫిల్లింగ్ చేయాలని, ఎర్రమట్టి జల్లెడ పట్టి అన్ని కలిపి బ్యాగ్స్ నింపాలి. బెడ్స్ మైంటైన్ సరిగా ఉండాలని సూచించారు. పాపణపేట్, తాళాయి, సోమిని గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలను పరిశీలించారు. తాళాయి గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ ప్రగతి, గేర్రెగూడెం ప్రాథమిక పాఠశాల లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ పాపణపేట లో పొలం బాట మట్టి రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తామని. రైతులతో మాట్లాడి సమస్య లేకుండా చూడాలని గ్రామ సర్పంచ్ సమక్షంలో గ్రామ పెద్దలకు తెలియ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం రాజన్న, ఎంపీ ఓ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు ఎం.డి సనా, పంచాయతీ కార్యదర్శులు శివాని , పోషాలు , రాజేశ్వర్ ,

రాజేష్ , టీక లు ముక్తాశ్వర్ ,

వినేష్ లు తదితరులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం




**సిద్దిపేట, ఫిబ్రవరి 12 (వుదయం ప్రతినిధి) :**

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ రక్త బ్యాంకులో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. గజ్వేల్ ప్రాంతం బయ్యారం గ్రామానికి చెందిన పంగ లక్ష్మి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో అత్యవసరంగా రక్తం అవసరమైందని తెలిసి, మాదుగుల యాదగిరి రెడ్డి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.ఈ సందర్భంగా మాజీ వాసవి క్లబ్ అధ్యక్షులు పుల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ఎప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని తెలిపారు. పిలుపునిచ్చిన వెంటనే స్పందించి రక్తదానం చేసిన దాత మాదుగుల యాదగిరి రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు వాసవి క్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని, భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ రక్త బ్యాంకు ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రావణి రక్తదాతను అభినందించారు. వాసవి క్లబ్ అధ్యక్షులు కూర శ్రీనివాస్, కార్యదర్శి నాగమళ్ల కిషన్, మురంశెట్టి సంతోష్, గందే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

### మధిర నుండి దాములూరు కూడలి జాతరకు ప్రత్యేక బస్సులు.

**మధిర ఫిబ్రవరి 12, వుదయం ప్రతినిధి.**



మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 15వ తేదీన మధిర నుండి దాములూరు కూడలి జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ మధిర డిపో మేనేజర్ ఆర్. రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు 15వ తేదీ(ఆదివారం )తెల్లవారుజామున ఉదయం 3గంటల నుండి మధిర బస్టాండ్ నుంచి అందుబాటులో ఉన్నాయని అదేవిధంగా ఆరోజు రాత్రి స్వామి వారి కళ్యాణం అయిపోయేంత వరకు కూడా దాములూరు కూడలి నుంచి మదిరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సదవకాశాన్ని మధిర మరియు పరిసర ప్రాంతాల భక్తులు,ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.భక్తులు రద్దీని అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు.

# చక్కని ఆరోగ్యం

## గ్లాసుడు పాలు తాగితే సరిపడా కాల్షియం అందుతుందా?



చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ రోజూ ఏదో ఒక సమయంలో గ్లాసుడు పాలు తాగుతుంటారు. శరీర పెరుగుదల, బలానికి పాలు ఎంతో దోహదపడతాయి. జీవన శైలి, ఆహార అలవాట్లు మారుతున్నప్పటికీ పాలు ఇప్పటికీ పోషకాహార జాబితాలో టాప్ స్థానంలో ఉంది. పాలు ఆరోగ్యానికి మేలు చేయస్తాయన్న సంగతి తెలిసిందే. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ రోజూ ఏదో ఒక సమయంలో గ్లాసుడు పాలు తాగుతుంటారు. శరీర పెరుగుదల, బలానికి పాలు ఎంతో దోహదపడతాయి. జీవనశైలి, ఆహార అలవాట్లు మారుతున్నప్పటికీ పాలు ఇప్పటికీ పోషకాహార జాబితాలో టాప్ స్థానంలో ఉంది. ముఖ్యంగా ఎముకలు, దంతాల ఆరోగ్యం విషయానికి వస్తే మొదట గుర్తుకు వచ్చేది పాలు. కానీ ఇటీవలి కాలంలో కాల్షియం లోపానికి సంబంధించిన సమస్యలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. దీని కారణంగా జనాలు తమ ఆహార అలవాట్లు గురించి మునుపటి కంటే ఎక్కువ అప్రమత్తంగా ఉంటున్నారు. లేడీ హార్డింగ్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఎల్.హెచ్. ఘోటేకర్ మాట్లాడుతూ.. ఒక గ్లాసు పాలు తాగడం వల్ల శరీరానికి మంచి మొత్తంలో కాల్షియం లభిస్తుందని, ఇది శరీరం సులభంగా గ్రహించడానికి తోడ్పడుతుందని చెప్పారు. పాలలోని విటమిన్ డి శరీరంలోని కాల్షియం మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది. అందుకే ఎముకలు, దంతాల బలానికి పాలు ప్రయోజనకరంగా ఉంటాయని చెబుతారు. కానీ ప్రతి ఒక్కరి శరీరంలో కాల్షియం అవసరం ఒకేలా ఉండదు. ఇది వయస్సు, లింగం, జీవనశైలి, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. శరీరంలో కాల్షియం తీవ్రంగా ఉంటే పాలు మాత్రమే తాగితే సరిపోదు. ఇలాంటి సందర్భాలలో పెరుగు, జున్ను, ఆకుపచ్చ కూరగాయలు, నువ్వులు, బాదం వంటి ఆహారాలను పాలతో పాటు తీసుకోవడం చాలా ముఖ్యం. ఇది శరీరానికి వివిధ వనరుల నుంచి కాల్షియం అందించడానికి సహాయపడుతుంది. మొత్తం ద పాలు కాల్షియం లోపాన్ని అధిగమించడంలో సహాయపడతాయి. కానీ సమతుల్య ఆహారం లేకుండా కాల్షియం లోపాన్ని పూర్తిగా అధిగమించడం కష్టం. ఆరోగ్యవంతులైన పెద్దలు సాధారణంగా రోజుకు 2 గ్లాసులు లేదా 400 నుంచి 500 ఎత్రీ పాలు తాగవచ్చు. ఇది రోజువారీ కాల్షియం అవసరాన్ని తీరుస్తుంది. పిల్లలు, గర్భిణీలు వారి అవసరాలకు అనుగుణంగా పాలతోపాటు ఇతర కాల్షియం అందించే ఆహారాలను తీసుకోవల్సి ఉంటుంది. లాక్టోస్ ఎలర్జీ ఉన్నవారు పాలు తాగే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. అవసరమైన దానికంటే ఎక్కువ పాలు తాగడం ప్రయోజనకరం కాదని మర్చిపోకూడదు. వీటన్నింటితో పాటు ప్రాసెస్ చేసిన ఆహారాలు, సోడా వినియోగాన్ని తగ్గించాలి.

## ఈ పండ్లు తింటే కడుపులో అసిడిటీ పెరుగుతుందట!

కొన్ని పండ్లు అతిగా తినడం వల్ల కలిగే సమస్యల్లో ఆమ్లత్వం ఒకటి. నిజానికి ఇదొక సాధారణ సమస్య. చాలా మంది ఈ సమస్యతో బాధపడుతుంటారు. అయితే కొంతమంది ఆరోగ్యకరమైనవిగా భావించే పండ్లను తిలిసో తెలియక తినడం వల్ల చిక్కుల్లోపడతారు. వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరగడానికి. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేస్తాయి. ఇందులో అతిగా తినడం వల్ల కలిగే సమస్యల్లో ఆమ్లత్వం ఒకటి. నిజానికి ఇదొక సాధారణ సమస్య. చాలా మంది ఈ సమస్యతో బాధపడుతుంటారు. అయితే కొంతమంది ఆరోగ్యకరమైనవిగా భావించే పండ్లను తిలిసో తెలియక తినడం వల్ల చిక్కుల్లో పడతారు. వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరగడానికి బదులుగా హాని పెరుగుతుంది. నారింజ: ఆమ్లత్వం ఉన్నవారు నారింజ పండ్లను నివారించాలి. ఇవి విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు అయినప్పటికీ వాటిలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. నారింజ తినడం వల్ల గుండెల్లో మంట, యాసిడ్ రిఫ్లక్స్ పెరుగుతాయి.నిమ్మ: కు అసిడిటీ ఉంటే నిమ్మ కాయను కూడా తీసుకోకూడదు. ఇందులో బలమైన గ్యాస్ట్రిక్ ఆమ్లం ఉంటుంది, ఇది ఆమ్లతను మరింత తీవ్రతరం చేస్తుంది, ముఖ్యంగా ఖాళీ కడుపుతో తీసుకుంటే. పైనాపిల్: అసిడిటీ సమస్య ఉన్నవారు పైనాపిల్ కూడా తినకూడదు. హెల్త్‌లైన్ ప్రకారం ఇందులో సిట్రిక్ యాసిడ్, బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటాయి. ఇది కడుపు ఆమ్లాన్ని పెంచుతుంది. గుండెల్లో మంటను కలిగిస్తుంది.మామిడి: ఆయుర్వేదం ప్రకారం పచ్చి మామిడి తినడం కూడా తీవ్ర అమ్లత్వాన్ని కలిగిస్తుంది. ఇందులో సిట్రిక్, మాలిక్, ఆక్సాలిక్ ఆమ్లాలు ఉంటాయి. ఇవి పిత్తాన్ని తీవ్రతరం చేస్తాయి. ఇది గుండెల్లో మంట, ఆమ్లత్వానికి దారితీస్తుంది. జామ: జామపండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వాటిలో గట్టి విత్తనాలు కూడా ఉంటాయి. ఇవి జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. అందువల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి అవి హానికరం. వీటి అజీర్ణం కారణంగా ఆమ్లతను మరింత తీవ్రతరం చేస్తాయి.ద్రాక్ష: ద్రాక్ష యాంటీఆక్సిడెంట్లకు గొప్ప మూలం. వీటిని తీసుకోవడం వల్ల పిత్తం పెరుగుతుంది. వీటిలో అధిక మొత్తంలో సిట్రిక్, టార్టారిక్ ఆమ్లాలు ఉంటాయి. ఈ ఆమ్లాలు కడుపు ఆమ్లాన్ని మరింత పెంచుతాయి. ముఖ్యంగా ఖాళీ కడుపుతో వీటిపి తీసుకుంటే గుండెల్లో మంట వస్తుంది.



## వీటి ముందు మందులు కూడా పనికిరావు

ప్రతిరోజూ రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వెల్లుల్లిని సహజ యాంటీబయాటిక్‌గా పోలుస్తారు. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.. రక్తపోటును నియంత్రిస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది.. శ్వాసకోశ సమస్యలకు ఉపశమనం అందిస్తుంది. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వెల్లుల్లిలో పోషకాలతోపాటు ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. అందుకే, ఆరోగ్యానికి అత్యంత మేలు చేసే సహజ సిద్ధమైన ఔషధమని ఆయుర్వేద నిపుణులు చెబుతారు.. వెల్లులిలో ఉండే అల్లిసిన్, సల్ఫర్, జింక్, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు, ఖనిజాలు దాగున్నాయి. అందుకే.. వెల్లుల్లిని తరచుగా సహజ యాంటీబయాటిక్‌గా పోలుస్తారు. అందుకే.. ఉదయాన్నే రెండు వెల్లుల్లి రెబ్బలను తినాలని సూచిస్తారు. దీనివల్ల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుంది. వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి గణనీయంగా మెరుగుపడుతుంది. వెల్లుల్లిలో అలిసిన్ అనే అమినో యాసిడ్, విటమిన్ సి, సెలీనియం వంటి ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయి.. ఇవి రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సాధారణ జలుబు, ఇతర శ్వాసకోశ సమస్యలకు వెల్లుల్లి ఒక ఔషధంలా పనిచేస్తుంది. ఆస్తమా, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది వంటి ఊపిరితిత్తుల రుగ్మతలను తగ్గించడంలో ఇది చక్కగా ఉపయోగపడుతుంది. వెల్లుల్లి రక్తనాళాల పనితీరును మెరుగుపరిచి, అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. అంతేకాకుండా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వెల్లుల్లి మధుమేహాన్ని నియంత్రించడంలో, రక్తాన్ని శుద్ధి చేయడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. మధుమేహగ్రస్తుల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఇది సహాయకారిగా ఉంటుంది. నోటి వ్యాధులకు కూడా వెల్లుల్లి సమర్థవంతంగా పనిచేస్తుంది. దీనిలోని రసాయనాలు నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ప్రతిరోజూ రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల ఒత్తిడి దూరమవుతుందని పరిశీలనలు సూచిస్తున్నాయి. అందుకే.. వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు. వెల్లుల్లిని తేనెతో లేదా.. నీటిలో మరిగించి తీసుకోవచ్చు. టీలా తాగవచ్చు. ఇంకా నేరుగా కూడా వెల్లుల్లి రెబ్బలను తీసుకోవచ్చు. అయితే.. దీని వాసన రుచి ఘాటుగా ఉంటుంది.



## మిల్లెట్స్‌తో ఎలాంటి సమస్యలైనా పరారు?

మిల్లెట్స్ లో కొవ్వు నిల్వ చేయనివ్వదు. వీటిని తినడం వలన అధిక కొలెస్ట్రాల్, స్ట్రోక్స్ వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. ఇంకా గుండె సమస్యలకు కూడా ఇది చెక్ పెడుతుంది. దీనిలో ఉండే పొటాషియం రక్తపోటును పెరగనివ్వకుండాతోడ్పడుతుంది. మిల్లెట్స్ ను చాలా మంది చిన్న చూపు చూస్తుంటారు. అయితే, ఇది ఇచ్చే శక్తి ఏది కూడా ఇవ్వదు. వీటిలో ప్రోటీన్, ఫైబర్, మెగ్నీషియం వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వీటితో ఎంతో మంది టిఫిన్స్ చేసుకుని తింటారు. ఇంకొందరు నార్మల్ గా తింటారు. అయితే, వీటిని ఎలా తిన్నా కూడా మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రాగులు, జొన్నలు, సజ్జలలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల బ్లడ్ లో షుగర్ లెవెల్స్ పెరగకుండా ఉంటాయి. మిల్లెట్స్ లో ఉండే కొన్ని పదార్థాలు ఇన్సులిన్ ను మెరుగుపరస్తుంది. ఇంకా బ్లడ్ లో షుగర్ లెవెల్స్ ను పెరగకుండా చూసుకుంటుంది. అలాగే, ఇది డయాబెటిస్‌కు సమస్యకు పూర్తిగా చెక్ పెడుతుంది. కాకపోతే రు దీనిని తినే ముందు వైద్యున్ని సంప్రదించి తాగడం మంచిదని అంటున్నారు. మిల్లెట్స్ లో ప్రోటీన్, ఫైబర్, మెగ్నీషియం వంటివి ఎక్కువగా ఉంటాయి. మీరు వీటిని రెండు రోజులకొకసారి తింటే కడుపు నొప్పి, జీర్ణ సంబధిత సమస్యలు రాకుండా చేస్తాయి. కాబట్టి వీటిని అలవాటు చేసుకుని తినండి. మిల్లెట్స్ లో ఫైబర్ ఎక్కువగా ఉండటం వలన ఇవి కడుపు నిండిన అనుభూతిని ఇస్తాయి. అధిక బరువుతో బాధ పడేవారు వీటిని ఫుడ్ డైట్ లో చేర్చుకోండి. ఇవి బరువును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి, అధిక బరువు ఉన్న వారు ఉదయం, రాత్రి పూట తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. మిల్లెట్స్ లో మెగ్నీషియం, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే గుండె సమస్యలతో ఇబ్బంది పడే వారు వీటిని తీసుకోవడం చాలా మంచిది. ఇంకా గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. అంతేకాదు, బ్లడ్ ప్రెజర్ ను నియంత్రించడంలో మిల్లెట్స్ సహాయ పడతాయి.



## నిద్రెలా పడుతుంది?

రాత్రుళ్లు నిద్రపట్టడం లేదని చెప్పే మహిళల సంఖ్య ఎక్కువే. పడుకునే ముందు.. టీవీలు, ఫోన్‌లూ చూడటం మాత్రమే ఇందుకు కారణం కాకపోవచ్చు. మరెన్నో ఇందుకు దారితీయొచ్చు. వాటిల్లో మీరేం పొరబాటు చేస్తున్నారో సరిదిద్దుకోండి. మీ సమస్య తీరిపోవచ్చు. నిద్రపోవాలనుకునేటప్పుడు టీ, కాఫీలకు దూరంగా ఉండండి. లేదంటే మీ నిద్ర మొత్తం ఎగిరిపోవచ్చు. కనీసం రెండు మూడు గంటల ముందు నుంచే ఈ జాగ్రత్త పాటించాలి. అలానే మితిమీరి తినడమూ, ఖాళీ కడుపుతో ఉండటమూ సరికాదు. కనీసం 40 నిమిషాల ముందైనా భోజనం పూర్తి అయ్యి ఉండాలి. అప్పుడే గ్యాస్ చేరదు. జీర్ణ సంబంధిత సమస్యలేవీ నిద్రకు భంగం కలిగించవు. బదులుగా కాసిని గోరువెచ్చని పాలను తీసుకోండి. నిద్ర ముంచుకొస్తుంది. మీ పడకగది నిద్ర సరిగా పట్టకపోవడానికి ఓ కారణం కావొచ్చని తెలుసా? అవును.. ఘాటైన వాసనలు, దుమ్మూధూళి, గాలి ప్రసరణ లేకపోవడం... వంటివన్నీ ప్రభావం చూపిస్తాయి. ముఖ్యంగా ఆ గదిలో వాతావరణం వేడిగా ఉన్నా, అతి చల్లగా అనిపించినా కూడా నిద్రపట్టదు. అందుకే, ఉష్ణోగ్రతల్ని సరిచూసుకోండి. అతిగా ఏసీల మీదా ఆధారపడొద్దు. అలానే పరుపులు, దిండ్లు మరీ మెత్తగా ఉన్నా.. ఇది నిద్రలేమికీ దారితీయచ్చు. పడుకుంటే మరీ కిందకి ఒత్తుకుపోకుండా చూసుకోండి. వాటిపై బెడ్‌షీట్‌లూ, కవర్లను ఎప్పటికప్పుడు మార్చడం మరిచిపోవద్దు. నిద్రపోయేటప్పుడు బిగుతైనవీ, ఎంబ్రాయిడరీ ఉన్నవీ, గుచ్చుకున్నట్లు అనిపించేవీ, దుర్వాసన వచ్చే దుస్తుల్ని వేసుకోవద్దు. అలానే నిద్రపోయే సమయంలోనూ బ్రా ధరిస్తే అసౌకర్యంగా అనిపించడమే కాదు... అనారోగ్యాలనూ తెచ్చిపెట్టొచ్చు. కాస్త వదులుగా, గాలి తగిలేలా కాటన్ వంటి దుస్తుల్ని ఎంచుకోవడం వల్ల హాయిగా నిద్రపడుతుంది.



## రాజ పోషకాలు రాగులు..

రాగి జావ ప్రోటీన్, ఫైబర్, కార్బోహైడ్రేట్స్, కాల్షియం వంటి పోషకాలతో నిండి ఉంటుంది. ఇది శరీరానికి మంచి శక్తిని అందించి, ఎముకలను బలోపేతం చేస్తుంది. రాగుల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రోటీన్లతో కూడిన అత్యంత పోషకమైన తృణ ధాన్యం. అందుకే.. రాగి జావ తాగమని ఆయుర్వేద నిపుణులు చెబుతుంటారు. ఇది సాధారణం అయిన నేపథ్యంలో, ఈ రాగి జావను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వలన శరీరానికి అవసరమైన పోషకాలు లభిస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. రాగిలో పుష్కలంగా ఉండే ఫైబర్, కార్బోహైడ్రేట్స్, కాల్షియం సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఇది శరీరానికి తక్షణ శక్తినిచ్చి, ఎముకలను ఉక్కులా దృఢంగా మారుస్తుంది. రాగి జావ, మజ్జిగ రాగి జావలను తయారుచేసుకుని తాగవచ్చు.. ఈ రెండు రకాల జావలు పిల్లల నుండి పెద్దల వరకు ఎవరైనా తీసుకోవచ్చు. ముఖ్యంగా ఎక్కువ శారీరక శ్రమ చేసేవారికి లేదా నీరసంగా, బలహీనంగా అనిపించేవారికి ఈ రాగి జావ ఒక అద్భుతమైన ఎనర్జీ డ్రింక్‌గా పనిచేస్తుంది. ఉదయం టిఫిన్ చేయలేని లేదా ఏమి చేయా లని తోచని సమయాల్లో ఈ రాగి జావను సులభంగా తయారుచేసుకుని తీసుకోవచ్చు. ఇది భోజనం సమయం వరకు ఆకలిని కూడా నియంత్రిస్తుంది.మొదటగా ఒక పెద్ద గిన్నెలో మూడు టేబుల్ స్పూన్ల రాగి పిండిని తీసుకుని, కొద్దికొద్దిగా నీళ్లు కలుపుతూ పిండి ముద్దలు లేకుం డా బాగా కలపాలి. ఆ తరువాత, మరో రెండు గ్లాసుల నీళ్లు కలిపి (మొత్తం మూడు గ్లాసుల నీళ్లు), పిండి పలుచగా ఉండేలా చూసుకోవాలి. ఈ మిశ్రమాన్ని స్టవ్ ద పెట్టి, జావ అడుగంటకుండా మధ్యమధ్యలో కలుపుతూ ఉడికించాలి. మూడు నుండి నాలుగు నిమిషాల్లో జావ మరగడం ప్రారంభమవుతుంది. పైన వచ్చే నురుగును తీసివేయాలి. జావ కాస్త చిక్కబడే వరకు మూడు నుండి నాలుగు నిమిషాలు మరిగించి, ఐదారు సార్లు రోలింగ్ బాయిల్ అయిన తరువాత స్టవ్ ఆఫ్ చేయాలి. చల్లారిన తరువాత ఇది మరింత చిక్కబడుతుంది. రాగి జావను పలు రకాలుగా తయారు చేసుకోవచ్చు.. స్వీట్ లేదా స్వీట్ లేకుండా తయారు చేసుకోవచ్చు.. కొంచెం బెల్లం లేదా ఉప్పు ఇంకా పాలు లేదా మజ్జిగ కలుపుకుని తాగవచ్చు.. ఈ మజ్జిగ జావను ఉల్లిపాయ కాంబినేషన్ తో తీసుకుంటే చాలా రుచికరంగా ఉంటుంది. ఈ రెండు రకాల రాగి జావలు కేవలం టేస్టీగా ఉండడమే కాకుండా, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నీరసం, బలహీనత వంటి సమస్యలతో బాధపడేవారు తప్ప కుండా వీటిని తమ డైట్‌లో చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు..



అత్యంత ఆరోగ్యకరమైన పౌష్టికాహారం.. రాగిజావ.. అద్భుతమైన శక్తిని ఇస్తుంది. అంతేకాకుండా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. ఎముకలను బలోపేతం చేస్తుంది.. బరువు తగ్గడానికి, డయాబెటిస్ నియంత్రణకు సహాయపడుతుంది. ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవడం వల్ల రోజంతా ఉల్లాసంగా ఉండవచ్చు.. ముఖ్యంగా బలహీనంగా ఉన్నవారికి లేదా ఎక్కువ కష్టపడి పనిచేసేవారికి ఇది ఒక అద్భుతమైన ఎనర్జీ డ్రింక్.. రాగి జావ వంటకాలు కేవలం రుచికరమైనవి మాత్రమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడినవి. నేటి తరం ఆహారపు అలవాట్లలో ప్రోటీన్ కొరత

## లివర్ ఇన్ఫెక్షన్ ఎంత ప్రమాదమో!

కాలేయం (లివర్) ఇన్ఫెక్షన్ అనేది ఒక తీవ్రమైన సమస్య.. దీనిని తేలికగా తీసుకోకూడదు. సకాలంలో చికిత్స అందించాలంటే దాని లక్షణాల గురించి ఖచ్చితమైన అవగాహనం కలిగి ఉండటం ముఖ్యం.. లివర్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే.. పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. మన శరీరంలో అతి ముఖ్యమైన అవయవాల్లో కాలేయం ఒకటి.. లివర్ రక్తాన్ని శుద్ధి చేయడం, ఆహారాన్ని శక్తిగా మార్చడం, పిత్తాన్ని ఉత్పత్తి చేయడం.. శరీరం నుండి విషాన్ని తొలగించడం వంటి అనేక విధులను నిర్వహిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థ ? జీవక్రియను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. వైరస్‌లు, బ్యాక్టీరియా లేదా పరాన్నజీవులు కాలేయంపై దాడి చేసినప్పుడు, ఇన్ఫెక్షన్ అభివృద్ధి చెందుతుంది. ఇవి హెపటిస్ వైరస్‌లు, కలుషితమైన ఆహారం లేదా నీరు, అధిక మద్యం సేవించడం, కొన్ని మందుల ప్రభావాలు, బలహీనమైన రోగనిరోధక శక్తి వల్ల సంభవించవచ్చు. రోగనిరోధక శక్తి బలహీనమైన వ్యక్తులు, ఇప్పటికే ఉన్న కాలేయ వ్యాధి ఉన్నవారు లేదా అసురక్షిత రక్తం లేదా ఏదైనా ఇంజెక్షన్ (జనిబజీ*వ ఎనితీవఞబితినీనిబ ? అంటే సిరంజిలు, సూదులను ఒకరి కంటే ఎక్కువ మందికి తిరిగి ఉపయోగించడం) కు గురైన వారు కాలేయ ఇన్ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. సరైన ఆహారం తీసుకోకపోవడం ? అనారోగ్యకరమైన జీవనశైలి కూడా ప్రమాదాన్ని పెంచుతాయి. అందువల్ల, కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. లేడీ హార్డింజ్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్, ఊఆ డాక్టర్ ఎల్.హెచ్. ఘోటేకర్ వివరిస్తూ.. కాలేయ ఇన్ఫెక్షన్ వివిధ రకాల లక్షణాలను కలిగిస్తుందని వివరించారు. సాధారణ లక్షణాలలో అధిక లేదా తేలికపాటి జ్వరం, నిరంతర అలసట, బలహీనత, ఆకలి లేకపోవడం ఉంటాయి. కొంతమందికి కుడి ఎగువ ఉదరంలో నొప్పి లేదా భారంగా అనిపించవచ్చు. కామెర్లు కూడా వస్తాయి.. చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారడం జాండీస్ వ్యాధి ప్రధాన లక్షణం.. అని తెలిపారు. ముదురు రంగు మూత్రం ? తేలికపాటి మలం కూడా కాలేయ సమస్యను సూచిస్తాయి. వికారం, వాంతులు, శరీర నొప్పులు కూడా గమనించవచ్చు. లక్షణాలు ఎక్కువ కాలం కొనసాగితే లేదా అకస్మాత్తుగా తీవ్రమైతే, అవి తీవ్రమైన అనారోగ్యానికి సంకేతం కావచ్చు. ఈ సంకేతాలను విస్మరించకపోవడమే మంచిది. కాలేయ ఇన్ఫెక్షన్లను నివారించడానికి, మంచి పరిశుభ్రతను పాటించండి. కలుషితమైన నీరు, ఆహారాన్ని నివారించండి. ఎల్లప్పుడూ తాజా, శుభ్రమైన ఆహారాన్ని తినండి. మద్యం వినియోగాన్ని పరిమితం చేయండి లేదా మానేయండి.



# అమెరికా - వెనెజువెలా నుంచి మరింత చమురు!



అమెరికా, వెనెజువెలా నుంచి ముడిచమురు కొనుగోళ్లు పెంచడాన్ని పరిశీలించాల్సిందిగా ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వరంగ రిఫైనరీ సంస్థలను ప్రభుత్వం కోరింది. తమతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా చమురు కొనుగోలు చేయడాన్ని భారత్ నిలిపి వేయనుందని అమెరికా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, టెండర్ల ద్వారా స్పాట్ మార్కెట్ నుంచి చమురు కొనుగోలు చేసే సమయంలో అమెరికా గ్రేడ్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం కోరినట్లు రిఫైనరీ వర్గాలు తెలిపాయి. వెనెజువెలా ముడిచమురు విషయంలోనూ ప్రభుత్వం ఇటువంటి సూచనే చేసినట్లు వెల్లడించాయి. రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇంధన భద్రతకు ప్రాధాన్యమిస్తామని, దేశ అవసరాలకు అనుగుణంగా అవకాశం ఉన్న చోట కొనుగోలు చేస్తామని మనదేశం వెల్లడించింది. అమెరికా, వెనెజువెలా చమురు కొనుగోళ్ల విషయంలో భారత రిఫైనరీలకు పరిమితులు ఉన్నాయి. అమెరికా చమురు గ్రేడ్‌లలో తక్కువ గంధకం (సల్ఫర్) ఉంటుంది. అయితే భారత రిఫైనరీలు తమ యూనిట్లను మధ్య రకం చమురును శుద్ధి చేసేందుకు వీలుగా ఏర్పాటు చేశాయి. అందువల్ల అమెరికా చమురు ఎంతవరకు సరిపోతుందో చూడాల్సిందే. దీంతోపాటు చమురు రవాణా ఖర్చులూ అధికమవుతాయి. పశ్చిమ ఆఫ్రికా, కజకిస్థాన్ నుంచి అయితే ఖర్చు తగ్గుతుంది. వెనెజువెలా ముడిచమురు నిల్వలను విక్రయించడంపై అమెరికా దృష్టి పెట్టింది. మనదేశం నుంచి ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం రిఫైనరీలు ఇటీవల 4 మిలియన్ బ్యారెళ్ల వెనెజువెలా ముడిచమురును దిగుమతి చేసుకున్నాయని సమాచారం.




# తగ్గిన బంగారం ధరలు



ధర గురువారం భారీగా తగ్గింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో ఇవాళ 24 క్యారెట్ల 10గ్రాముల పసిడి ధర రూ. 1,200 తగ్గి రూ.1,58,400కు చేరింది. 22 క్యారెట్ల 10గ్రాముల గోల్డ్ రేటు రూ.1,100 తగ్గి రూ.1,45,200వద్ద కొనసాగుతోంది. అటు వెండి ధరల్లో ఎలాంటి మార్పులేదు. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.3లక్షలుగా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు ప్రాంతాల్లో ధరల్లో స్వల్ప తేడాలున్నాయి.గత నెలలో రికార్డ్ గరిష్ఠాలను తాకిన బంగారం, వెండి రేట్లు వెనక్కి దిగివచ్చిన సంగతి తెలిసిందే. అయితే, మళ్లీ ఇప్పుడు వరుసగా పెరుగుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. అయినప్పటికీ కూడా ఆల్ టైమ్ హై స్థాయి కన్నా దాదాపు రూ.20 వేల తక్కువగానే ఉన్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. కొనుగోలు చేసేందుకు ఇది సరైన సమయమని చెబుతున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులతో బంగారంలో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య పెరుగుతోందని, పసిడి రేట్లు మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఓవైపు బంగారం ధరలు పెరుగుతూ ఆందోళన కలిగిస్తున్న తరుణంలో వెండి స్వల్ప ఊరట కల్పించింది. వరుసగా రెండో రోజూ ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు రూ.3,00,000 మార్క్ వద్ద స్థిరంగా ట్రేడవుతోంది.

# ఉద్యోగులకు గూగుల్ ఊహించని షాక్

టెక్నాలజీ రంగంలో ప్రస్తుతం అధికంగా వినిపిస్తున్న మాట ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. అన్ని రంగాల్లోనూ శర



వేగంగా విస్తరిస్తోంది. ఏఐని అందిపుచ్చుకునేందుకు చాలా కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. వ్యయ నియంత్రణ, టెక్నాలజీ అప్‌గ్రేడ్ పేరుతో ఉద్యోగుల్లో కోత పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ షాకింగ్ ప్రకటన చేసింది. గూగుల్ తన ఉద్యోగులకు ఒక ఆఫర్ ఇచ్చింది. కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేని వారు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి వెళ్లిపోవాలని సూచించింది. వారికి వాలంటరీ రిర్మెంట్ ప్యాకేజీని ఆఫర్ చేసింది. ఈ మేరకు గూగుల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఫిలిప్ షిండ్లర్ పేర్కొన్నట్లు చెబుతూ బిజినెస్ ఇన్‌సైడర్ ఓ కథనం ప్రచురించింది. గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్ లోని కొందరు ఉద్యోగులకు ఈ స్వచ్ఛంద నిష్క్రమణ ప్యాకేజీ వర్తిస్తుందని కథనం పేర్కొంది. గూగుల్ కంపెనీలోని జీబీఓ యూనిట్ సంస్థ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన ప్రకటనలు, గ్లోబల్ రెవెన్యూ గ్రోత్ ను పర్యవేక్షిస్తుంది. 2025 సంవత్సరానికి గూగుల్ పేరెంట్ కంపెనీ ఆల్ఫాబెట్ రెవెన్యూ 400 బిలియన్ డాలర్లుగా ఉంది. 2026ను మెరుగ్గా ఆరంభించింది. అయినప్పటికీ ఏఐ పరిధిని విస్తరించాలనే వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఏఐని అందిపుచ్చుకునే వారినే కంపెనీ కోరుకుంటున్నట్లు షిండ్లర్ పేర్కొన్నట్లు కథనం వెల్లడించింది. అమెరికాలోని కస్టమర్ సేల్స్ టీమ్స్, కస్టమర్ ఫేసింగ్ పొజిషన్స్ ఉద్యోగులకు ఈ ప్యాకేజీ వర్తించదని ఆయన తెలిపారు.

# నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు

## రూ. 19.43 లక్షల కోట్లు



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఫిబ్రవరి 10 నాటికి రూ. 19.43 లక్షల కోట్లకు పైగా వసూలైనట్లు ఆదాయ పన్ను విభాగం బుధవారం తెలిపింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇవి 9.4 శాతం వృద్ధి చెందాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ మంది పన్నులు సరిగ్గా చెల్లించడంతో పాటు వ్యాపార కార్యకలాపాలు పెరగడం వల్లనే ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని ఆదాయ పన్ను విభాగం పేర్కొంది. ఆదాయపు పన్ను శాఖ బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు 14.51 శాతం పెరిగి రూ. 8.90 లక్షల కోట్లకు చేరుకోగా, వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు) సహా కార్పొరేటేయేతర సంస్థల నుంచి వచ్చే పన్నులు 5.91 శాతం పెరిగి రూ. 10.03 లక్షల కోట్లకు చేరుకున్నాయి. సెక్యూరిటీ లావాదేవీల పన్ను వసూళ్లు రూ. 50,279 కోట్లుగా ఉన్నాయి. ఇదే సమయంలో పన్ను రీఫండ్లు 18.82 శాతం తగ్గి రూ. 3.34 లక్షల కోట్లకు చేరుకున్నాయి. రిఫండ్‌ల సర్దుబాటు చేయడానికి ముందు స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఫిబ్రవరి 10 నాటికి 4.09 శాతం పెరిగి రూ. 22.78 లక్షల కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సవరించిన అంచనాలలో ప్రభుత్వం ప్రత్యక్ష పన్ను వసూళ్లను రూ.24.84 లక్షల కోట్లుగా అంచనా వేసింది.

# మరో హెల్త్ బ్రాండ్ కొనుగోలు చేసిన రిలయన్స్



రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ వ్యాపార విస్తరణలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాకు చెందిన గుడ్ నెస్ గ్రూపులో మెజారిటీ వాటాను దక్కించుకున్న రిలయన్స్, తాజాగా తమిళనాడుకు చెందిన సదరన్ హెల్త్ ఫుడ్స్ ను రూ.156.42 కోట్లకు కొనుగోలు చేసింది.దీంతో మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తుల రంగంలోకి రిలయన్స్ ప్రవేశించింది. మన్నా బ్రాండ్ పేరుతో ఈ సంస్థ రెండు దశాబ్దాలుగా ఆరోగ్య ఆహార ఉత్పత్తులను అందిస్తోంది. ఈ కొనుగోలుతో రిలయన్స్ తన వ్యాపార పోర్ట్ ఫోలియోను మరింత విస్తరిస్తోంది.ఈ సంస్థకు చెందిన మన్నా బ్రాండ్ పేరుతో మొత్తం పాతిక కంటే ఎక్కువ ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందిస్తోంది. చిన్నారుల నుంచి అన్ని వయసుల వారికి అందుబాటులో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆరోగ్యం ద ఎక్కువ శ్రద్ధ చూపుతున్న ప్రజల తీరుకు అనుగుణంగా ఈ సంస్థ కొనుగోలు ఉన్నట్లుగా చెబుతున్నారు. ప్రస్తుతం తమిళ నాడు.. దక్షిణాది రాష్ట్రాల్లో బలంగా ఉన్న మన్నా బ్రాండ్ రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా పాపులర్ చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లుగా చెబుతారు. ఇక్కడో ఆసక్తికర అంశాన్ని చెప్పి ముగించాలి. గడిచిన ఐదేళ్ల కాలంలో పాతిక కంటే ఎక్కువ సంస్థల్ని రిలయన్స్ ను కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.లక్ష కోట్లను వినియోగించింది.

# తగ్గిన క్రెడిట్ కార్డ్ చెల్లింపులు



పండగ సీజన్ ముగియడంతో క్రెడిట్ కార్డు ద్వారా చేస్తున్న ఖర్చులు తగ్గుముఖం పట్టాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) తాజా గణాంకాల ప్రకారం, గతేడాది డిసెంబర్‌లో క్రెడిట్ కార్డు ఖర్చులు అంతకుముందు ఏడాదితో పోలిస్తే 8.9 శాతం తగ్గింది. విలువ పరంగా క్రెడిట్ కార్డు ఖర్చులు రూ. 2.05 లక్షల కోట్లుగా ఉన్నాయి. అయితే, నెలవారీ ప్రాతిపదికన నవంబర్‌లో కంటే వీటి ఖర్చులు 8.4 శాతం పెరిగాయి. ఖర్చులు ఎక్కువగానే ఉన్నప్పటికీ, క్రెడిట్ కార్డుల వాడకం తక్కువగా ఉందని ఆర్‌బీఐ డేటా సూచిస్తోంది. నెలవారీగా పెరిగేందుకు ఈ-కామర్స్ కార్యకలాపాలు, అధిక ప్రయాణ గిరాకీ దోహదపడ్డాయి. డిసెంబర్ నెలలో ఒక్కో క్రెడిట్ కార్డు నెలవారీ సగటు ఖర్చు 8 శాతం పెరిగి రూ. 17,712కి పెరిగింది. ఇక, క్రెడిట్ కార్డుల విస్తరణ స్థిరంగా కొనసాగుతోంది. డిసెంబర్ నాటికి క్రెడిట్ కార్డుల సంఖ్య 11.6 కోట్లకు పెరిగింది. అంతకుముందు ఏడాది ఇదే నెలలో 10.8 కోట్లు ఉన్నాయి. మొత్తం క్రెడిట్‌కార్డ్ ఖర్చుల్లో ప్రైవేట్ రంగ బ్యాంకులు 72.5 శాతం వాటాను కలిగి ఉన్నాయి. అయితే, అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఈ వాటా 3.75 శాతం తగ్గింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రం ఖర్చుల వాటాను 17.7 శాతం నుంచి 22.2 శాతానికి పెంచుకున్నాయి.

# ఆకాసా ఎయిర్ కోఫౌండర్ ప్రవీణ్ అయ్యర్ రాజీనామా



ప్రముఖ విమానయాన సంస్థ ఆకాసా ఎయిర్ కో-ఫౌండర్, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ రాజీనా చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ ఆఖరులో ఆయన సంస్థను వీడుతున్నట్టు కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడిచింది.దీంతో ఆకాసా ఎయిర్ నుంచి నిష్క్రమించిన రెండో కో-ఫౌండర్ ప్రవీణ్ అయ్యర్ నిలిచారు. గతేడాది అక్టోబర్‌లో సంస్థ మరో కో-ఫౌండర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్(ఇంటర్నేషన్ ఆపరేషన్స్) నీలు ఖత్రి సంస్థను వీడిన సంగతి తెలిసిందే. ఎయిర్‌లైన్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన ఖత్రి, ఆకార్ ఎయిర్ అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్మించడం, విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు. 2025లో సంస్థలోని సీనియర్ మేనేజ్‌మెంట్ మధ్య గందరగోళం తర్వాత కో-ఫౌండర్లు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. 2025, జూన్‌లో వైస్ ప్రెసిడెంట్ (ఇన్-ఫ్లైట్ సర్వీసెస్) అజిత్ భగ్‌చందాని వ్యక్తిగత కారణాలను చూపుతూ రాజీనామా చేశారు. మే నాటికి, లాంగ్-టర్మ్ ఆపరేషన్స్, స్ట్రాటజీ, ఎక్సలెన్స్ అండ్ ప్లానింగ్ హెడ్ రిషబ్ దేవ్, వైస్ ప్రెసిడెంట్ (ఎయిర్‌క్రాఫ్ట్ అక్విజిషన్ అండ్ లీజింగ్) అమోల్ మానే సహా పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు రాజీనామా చేశారు.




## ఐసీసీ టీ 20 వరల్డ్‌కప్‌లోకి స్టీవ్ స్మిత్ సడెన్ ఎంట్రీ



ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026 ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా జట్టుకు అనూహ్య ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ గాయపడటంతో, అతడి స్థానంలో సీనియర్ ప్లేయర్ అయిన స్టీవ్ స్మిత్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా జట్టులోకి చేర్చింది. ఫిబ్రవరి 11న ఐర్లాండ్‌తో జరిగే మ్యాచ్‌కు ముందు ఈ మార్పు చోటు చేసుకుంది. ఇటీవల జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో మార్ష్ గాయపడినట్లు సమాచారం. సైడార్మ్ త్రో డౌన్స్ సమయంలో గ్రోయిన్ ప్రాంతంలో తీవ్ర గాయమవడంతో వెంటనే నెట్స్ నుంచి బయటకు వెళ్లి చికిత్స పొందాడు. క్రికెట్ ఆస్ట్రేలియా విడుదల చేసిన ప్రకటన ప్రకారం, మార్ష్‌కు అంతర్గత రక్తస్రావం జరిగినట్లు స్కాన్లలో తేలింది. ఈ గాయం కారణంగా అతడికి కొంతకాలం విశ్రాంతి, రిహ్యాబిలిటేషన్ అవసరమని వైద్యులు సూచించారు. దాంతో ఐర్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌కు మిచెల్ మార్ష్ దూరమయ్యాడు. స్టీవ్ స్మిత్ ప్లేయింగ్ 11లో లేకపోయినా అతని పేరు మాత్రం స్క్వాడ్ లిస్ట్‌లో చేర్చారు.

# మలుపు తిప్పిన మోతీ! వెస్టిండీస్ ఘన విజయం



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఇంగ్లండ్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. గ్రూప్-సీలో భాగంగా బుధవారం వాంఖడే మైదానంలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 30 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ ఓటమితో ఇంగ్లండ్ సూపర్-8లో అడుగుపెట్టడం కష్టమైపోయింది, అయితే వెస్టిండీస్ తమ స్థితిని మరింత బలపర్చింది. వెస్టిండీస్ స్పిన్నర్ గుడాకేష్ మోతీ (3/33) మూడు కీలక వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్, 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగుల భారీ స్కోరు చేసింది. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 42 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సలతో 76× రన్ చేసి అజేయ హాఫ్ సెంచరీని సాధించాడు. జాసన్ హోల్డర్ 17 బంతుల్లో 33 పరుగులు చేసి మెరుపులు మెరిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జే ఓవర్టన్, ఆదిల్ రషీద్ రెండేసి వికెట్లు తీసగా, జోఫ్రా ఆర్చర్, సామ్ కరణ్ ఒక్కొక్క వికెట్ పొందారు.తదుపరి ఇంగ్లండ్ 19 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌ ఘోర పరాజయాన్ని రుజువుచేసింది. జాకోబ్ బెతెల్ 23 బంతుల్లో 33, ఫిల్ సాల్ట్ 14 బంతుల్లో 30, సామ్ కరణ్ 30 బంతుల్లో 43× పరుగులతో టాప్ స్కోర్లు నమోదు చేశారు. వెస్టిండీస్ బౌలర్లలో గుడాకేష్ మోతీ (3/33) మూడు, రోస్టన్ ఛేజ్ (2/29) రెండు వికెట్లు తీయగా, అకీల్ హ్యాస్సేన్, రొమారియో షెఫెర్డ్, షమర్ జోసెఫ్ ఒక్కొక్క వికెట్ దక్కించుకున్నారు. 197 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ ప్రారంభం ఆశించినట్టుగా కాదనిపించింది. పవర్ ప్లేలో ఫిల్ సాల్ట్ త్వరగా వెనుదిరిగాడు. జాకోబ్ బెతెల్ కొద్ది రన్‌లతో మెరుపులు మెరిపించాడు, కానీ జోస్ బట్లర్, టామ్ బాంటన్, జాకోబ్ బెతెల్ వరుసగా పెవిలియన్ చేరారు.

# ఆఖరి బంతికి దక్షిణాఫ్రికా విజయం



ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 గ్రూప్ స్టేజ్‌లో సౌతాఫ్రికా – అఫ్ఘనిస్తాన్ మ్యాచ్ నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగింది. పోటాపోటీగా నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ మ్యాచ్‌లో ఆఖరి ఓవర్‌లో హై డ్రామా కొనసాగింది.రబాడా రెండు నో బాల్స్ వేయడం, ఆ వెంటనే గెలవాల్సిన మ్యాచ్ లో అఫ్ఘన్ బ్యాటర్ రనౌట్ కావడంతో మ్యాచ్ గా ముగిసింది. ఇక సూపర్ ఓవర్ కూడా గా ముగియడంతో భారీ హైప్ ఏర్పడింది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 187/6 చేయగా.. అఫ్ఘనిస్తాన్ 187కి ఆలౌట్ అయింది.సూపర్ ఓవర్ లో తొలుత బ్యాటింగ్‌కి వచ్చిన అఫ్ఘనిస్తాన్ జట్టు లుంగీ ఎంగిడీ బౌలింగ్‌ని చీల్చి చెండాడింది. బౌండరీతో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన అజ్మతుల్లా ఒమర్జాయి, రెండో బంతిని సిక్సర్‌గా మలిచాడు. మూడో బంతికి సింగిల్ రాగా.. నాలుగో బంతికి గుర్బాజ్ మరో సింగిల్ తీసి అజ్మతుల్లాకి స్ట్రయికింగ్ ఇచ్చాడు. ఐదో బంతికి అజ్మతుల్లా బౌండరీ బాదగా, ఆఖరి బంతికి ఒక్క పరుగు వచ్చింది. దాంతో మొత్తం 17 పరుగులు రాగా.. అజ్మతుల్లా 16 పరుగులు బాదాడు.18 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా అదే రేంజ్‌లో ఆడింది. తొలి బంతికి మిల్లర్ సింగిల్ తీయగా.. డివాల్డ్ బ్రెవిస్ రెండో బంతికి సిక్సర్ బాది, మూడో బంతికి అవుటయ్యాడు. క్రీజులోకి వచ్చిన ట్రిస్టన్ స్టబ్స్ నాలుగో బంతిని ఫోర్‌గా మలచగా, ఐదో బంతి డాట్ అయింది.. ఆఖరి బంతికి సిక్సర్ బాదడంతో 17 పరుగులు రాగా.. మళ్లీ మ్యాచ్ గా ముగిసింది. సూపర్ ఓవర్ కూడా గా ముగియడంతో అంపైర్లు మళ్లీ సూపర్ ఓవర్ పెట్టాల్సి వచ్చింది. ఈ సారి తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా జట్టు విధ్వంసం సృష్టించింది.

# కొలంబోలో పిచ్‌ను ఎప్పుడైనా మార్చొచ్చు



టీ20 వరల్డ్‌కప్ 2026లో భాగంగా ఆదివారం కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్, పాక్ మ్యాచ్ జరగనుంది. దీనిపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ సక్లయిన్ ముస్తాక్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఐసీసీని, బీసీసీఐ ప్రభావితం చేస్తుందన్నాడు. ప్రస్తుతమున్న సాంకేతిక పరిజ్ఞానంతో కొలంబోలోని పిచ్‌ను ఎప్పుడైనా మార్చొచ్చని నిరాధార ఆరోపణలు చేస్తూ.. తన అక్కసు వెల్లగక్కాడు. 'ఐసీసీ ఎవరి ఒత్తిడికి తలొగ్గి పనిచేస్తుందో మనందరికీ తెలుసు. ప్రస్తుత ఆధునిక కాలంలో ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఉందంటే.. దాని సాయంతో మనకు తెలియకుండానే గ్రౌండ్స్‌మెన్ ఎప్పుడైనా పిచ్‌ను మార్చొచ్చు' అని సక్లయిన్ ముస్తాక్ అన్నాడు. అలాగే అతడు బౌలింగ్ ఆర్డర్ గురించి మాట్లాడాడు. 'భారత్‌తో మ్యాచ్‌కు ముందు ఉస్మాన్ తారిక్ ఆత్మవిశ్వాసాన్ని పొందాడు. కానీ కు ఇద్దరు పేసర్లు, ఒక ఆల్‌రౌండర్ అవసరమైతే మొత్తం సకరణం మారిపోతుంది. జిమ్మీ నీషమ్‌ను చూడండి. అతడు ఫహీమ్ అష్రఫ్ లాంటివాడు. పాకిస్థాన్ తరపున 20వ ఓవర్ ఎవరు వేస్తారు? తారిక్? నవాజ్? షాదాబ్? అబ్రార్? వారు చివరిగా ఎప్పుడు 20వ ఓవర్ వేశారు. ఫహీమ్ 20వ ఓవర్ వేయగలడో.. లేదో..' అని సక్లయిన్ విశ్లేషించాడు.

# నబియాతో పోరుకు అభిషేక్ శర్మ దూరం?

## సంజూ శాంసన్‌కు లైన్ క్లియర్

టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా రేపు నబియాతో జరగబోయే కీలక పోరుకు ముందు టీమ్ ఇండియాలో స్వల్ప కలకలం రేగింది. స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ గత కొన్ని రోజులుగా కడుపు సంబంధిత సమస్యతో బాధపడుతుండటంతో, అతను ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగుతాడా లేదా అన్నది ప్రస్తుతం సస్పెన్స్‌గా మారింది.ఈ టోర్నీలో మంచి ఫామ్‌లో ఉన్న అభిషేక్ దూరం కావడం జట్టు కాంబినేషన్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.అభిషేక్ శర్మ ఆరోగ్య పరిస్థితిపై తాజాగా టీమ్ సభ్యుడు తిలక్ వర్మ కీలక అప్‌డేట్ ఇచ్చారు. అభిషేక్ ప్రస్తుతం కోలుకుంటున్నారని, ఈరోజు అతను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తిలక్ డియాకు వెల్లడించారు. అయితే, రేపు మ్యాచ్ సమయానికి అతను పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ సాధిస్తేనే తుది జట్టులోకి తీసుకుంటామని, ఒకవేళ నీరసంగా ఉంటే మాత్రం విశ్రాంతినివ్వడం ఖాయమని మేనేజ్‌మెంట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.ఒకవేళ అభిషేక్ శర్మ ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకపోతే, అతని స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సంజూను ఓపెనర్‌గా పంపిస్తారా లేక మిడిల్ ఆర్డర్‌లో పంపి వేరే ఆటగాడితో ఇన్నింగ్స్ ప్రారంభిస్తారా అనేది చూడాలి. సంజూకు ఉన్న క్రేజ్ దృష్ట్యా అతను ప్లేయింగ్ 11లోకి వస్తే జట్టు బ్యాటింగ్ మరింత పటిష్టంగా మారుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి అభిషేక్ శర్మ కోలుకోవాలని కోరుకుంటూనే, మరోవైపు ప్రత్యామ్నాయ వ్యూహాలపై కెప్టెన్, కోచ్ కసరత్తులు చేస్తున్నారు. నబియా చిన్న జట్టు అయినప్పటికీ, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇబ్బందులు తప్పవు కాబట్టి పూర్తి ఫిట్‌నెస్ ఉన్న ఆటగాళ్లనే బరిలోకి దించాలని టీమ్ ఇండియా భావిస్తోంది. రేపు టాస్ వేసే సమయానికి అభిషేక్ ఆరోగ్యంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# టీ20 వరల్డ్ కప్ నుంచి ఆఫ్ఘనిస్తాన్ ఎలిమినేట్?

## పాకిస్తాన్‌లో సంబరాలు

టీ20 వరల్డ్ కప్ లో ఆఫ్ఘనిస్తాన్ కథ దాదాపు ముగిసినట్లేనని తెలుస్తోంది. ఈ వరల్డ్ కప్ టోర్నమెంట్ నుంచి ఆఫ్ఘనిస్తాన్ ఎలిమినేట్ అయినట్లేనని సోషల్ డియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ టోర్నమెంట్ లో ఇప్పటి వరకు ఆఫ్ఘనిస్తాన్ రెండు మ్యాచ్ లు ఆడితే, రెండింటిలో కూడా ఓడిపోయింది. దీంతో ఒక్క పాయింట్ కూడా సాధించని ఆఫ్ఘనిస్తాన్, మైనస్ రన్ రేట్ తో డీలా పడిపోయింది. అయితే టీ20 వరల్డ్ కప్ నుంచి ఆఫ్ఘనిస్తాన్ ఎలిమినేట్ అయిందన్న వార్తలు బయటకు రావడంతో పాకిస్తాన్ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారట. అటు లాహోర్ వీధుల్లో టపాకాయలు పేల్చి మరి ఎగిరి గంతేస్తున్నారట పాక్ ఫ్యాన్స్. ఆఫ్ఘనిస్తాన్ పట్ల పాకిస్తాన్ అభిమానులు రెచ్చిపోయి ప్రవర్తి



స్తున్న నేపథ్యంలో రషీద్ ఖాన్ రియాక్ట్ అయ్యాడు. కొంత మంది తమ ఓటమిని చూసి సంబరాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు రషీద్ ఖాన్. దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ మధ్య నిన్న మ్యాచ్ జరిగిన తర్వాత రషీద్ ఖాన్ ప్రెస్ ట్ పెట్టారు. దక్షిణాఫ్రికా పైన పోరాడి ఓడినట్లు గుర్తు చేశారు రషీద్ ఖాన్. కాస్త కష్టపడి ఉంటే మ్యాచ్ గెలిచే వాళ్ళమని తెలిపారు. అదే సమయంలో పాకిస్తాన్ అభిమానులకు కౌంటర్ ఇచ్చారు. కొంత మంది పాకిస్తాన్ అభిమానులు తమను తక్కువ అంచనా వేస్తూ సోషల్ డియాలో పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. అలాగే తమ జట్టు ఎలిమినేట్ అయిందన్న వార్తను వైరల్ చేసి, శునకానందం పొందుతున్నారని నిప్పులు చెరిగారు. నబియా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా లాంటి జట్లు ఉన్న గ్రూప్ లో ఆఫ్ఘనిస్తాన్ ఉంటే సూపర్ 8కు సులభంగా దూసుకు వెళ్లేదని తెలిపారు. కానీ తమ జట్టు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా లాంటి బలమైన టీమ్స్ తో పోరాడుతున్నట్లు పాకిస్తాన్ కు కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు రషీద్ ఖాన్. పాకిస్తాన్ ప్రస్తుతం ఉన్న గ్రూపులో ఇండియా ఒక్కటే బలమైన జట్టు అంటూ పరోక్షంగా చురకలు అంటించారు. మాలాగా బడా జట్లతో ఆడి గెలిచి చూపించాలని పాకిస్తాక్ కౌంటర్ ఇచ్చారు. రెండు సంవత్సరాల కిందట జరిగిన టీ20 ప్రపంచ కప్ లో ఇండియా లాంటి బలమైన జట్లతో సె ఫైనల్ ఆడేదాకా వెళ్ళామని గుర్తు చేశారు. ఇది ఇలా ఉండగా, గ్రూప్ ఆ లో ఉన్న ఆఫ్ఘనిస్తాన్, తాజాగా దక్షిణాఫ్రికా తో తలపడింది. ఈ మ్యాచ్ చాలా ఉత్కంఠ భరితంగా సాగిన సంగతి తెలిసిందే. రెండు సార్లు సూపర్ ఓవర్లు ఆడాయి ఇరు జట్లు. కానీ చివరికి దక్షిణాఫ్రికా అద్భుతంగా రాణించి విజయం సాధించింది.

# వుదయం సినిమా





## తారల అసలు పేర్లు !

### రజనీకాంత్

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ అసలు పేరు శివాజీ రావు గయిక్వాడ్. 12121950లో మరాఠి కుటుంబంలో పుట్టి బెంగుళూరులో బస్ కండక్టర్ గా చేసి మద్రాసు వచ్చారు. నటుడుగా ప్రయత్నాలు చేస్తున్నపుడు దర్శకుడు కె. బాలచందర్ 'అపూర్వ రాగంగల్ 'సినిమాలో 1975లో తొలిసారి అవకాశం ఇస్తూ నిర్మాత సూచనతో శివాజీ గణేశన్ కారణంగా కన్ఫ్యూషన్ రాకుండా వుండాలని తను అంతకు ముందు 1966లో దర్శకత్వం వహించిన 'మేజర్ చంద్రకాంత్ 'సినిమాలో ఎ.వి.ఎమ్. రాజన్ పోషించిన పాత్ర దృష్టిలో పెట్టుకుని రజనీకాంత్ అని పెట్టారు. విలన్ పాత్రలతో ప్రత్యేక మేనరిజాలతో హీరోగా ఎదిగి కొనసాగుతు 1976లో అంతులేని కథలో జయప్రద అన్నగా తెలుగు వారికి , బాలు జేను తో వాసుగా కన్నడ సీమకు పరిచయం అయ్యారు. 1977లో అన్న దమ్ముల సవాల్ షూటింగ్ హైదరా బాద్ సారథి స్టూడియోలో జరుగుతుండగా ఆయన తెలుగులో మాతో మాట్లాడటం విశేషం . తెలుగులో 18 సిని మాలే చేసినా డబ్బింగ్ సినిమాల ద్వారా తెలుగు వారికి బాగా దగ్గరయ్యారు. నిర్మాతగా,స్క్రీన్ ప్లే రైటర్ గా,గాయకుడుగా తమిళ చిత్రసీమకు దానశీలిగా అభిమానులకు సన్నిహితుడు. 1978లో దక్షిణాదిలో 3భాషల్లో 18సినిమా లు విడుదల కావడం ఒక విశేషమైతే నటనకు వీడ్కోలు చెప్పాలని నిర్ణయం తీసు కుని 1980లో బిల్లాతో రి ఎంట్రీ ఇవ్వడం మరో విశేషం. బాల చందర్ పరిచయం చేసిన ఒక విశిష్టనటుడు.భాషా,చంద్రముఖి, శివాజీ, కథానాయకుడు,అరుణాచలం,ఎంతి రాన్(తెలుగులో రోబోగా) ఇలా ఎన్నో సిని మాలతో ఎంతో పేరు తెచ్చుకుంటున్నారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ భాషల్లో 170 సినిమాలు చేసి నటన కొనసాగిస్తున్నారు. 2000సం.లో పద్మ భూషణ్,2016లో పద్మవిభూషణ్, 2019లో దాదా సాహెబ్ ఫాల్కె పురస్కా రాలు పొందారు.



### జయచిత్ర

నటి జయశ్రీ , వెటర్నరీ డాక్టర్ మహి కి మద్రాసులో 591957 న శ్రీ కృష్ణ జయంతి నాడు రోహిణి నక్షత్రం లో శుక్రవారం పుట్టినందున లక్ష్మి రోహిణీ పార్వతీ దేవి అని పేరు పెట్టారు. 'పాదుకా పట్టాభిషేకం' సినిమాలో తన ఆరవ ఏట నటించింది. ఎనిమిది మలయాళ సినిమాల్లో బాల నటి. కూచి పూడి భరత నాట్యంలో మంచి శిక్షణ పొందిన తెలుగు అమ్మాయి. టీనేజ్ లోకి వచ్చాక అంటే 8వ తరగతి చదువుతుంటే అనుకుంట బీదల పాట్లు సినిమాకు విఠలాచార్య టెస్ట్ చేసి చిన్నదానిలా వుందని దర్శకుడు కె.ఎస్. గోపాల కృష్ణకు చెబితే ఆయన జాతకం చూసి జయచిత్ర పేరు పెట్టి 1972లో 'కొరతి మగన్' సినిమా నాయికను చేస్తూ తమ తదుపరి మూడు సినిమాలకు కూడా ఎంపిక చేసారు. అలా అప్పటి ప్రముఖ దర్శకుల హీరోల సినిమా లతో బిజీ అయింది.1978 నుంచి సోగ్గాడు, మా దైవం, యవ్వనం కాటేసింది, కల్పన, కట కటకాల రుద్రయ్య, సావాస గాళ్ళు, చిల్లర కొట్టు చిట్టెమ్మ, అన్నదమ్ముల సవాల్, కక్ష, ఆత్మీయుడు, బొబ్బిలి పులి, వయసు పిలిచింది మున్నగు సినిమాల్లో నిండుదనం గల గ్లామర్ పాత్రల్లో అందాల నాయికగా చక్కని నటిగ ప్రేక్షకుల మన్ననలు పొందింది. అబ్బాయి గారు నుంచి కేరెక్టర్ నటిగా నటించసాగింది. రాజేశ్వరి కళ్యాణంకి ఉత్తమ సహాయ నటిగా నంది అవార్డు వచ్చింది.సుమంగళి నుంచి తమిళ టీవి సీరియల్ దర్శక నిర్మాత నటిగా కొనసాగు తోంది. కాంగ్రెస్ పార్టీలోను వుంది. కన్నడ మలయాళ చిత్రాల్లోను మొత్తం మీద 280 సినిమాల వరకు చేసింది. 2013లో విడుదలైన 'అట్టహాస' కన్నడ చిత్రంలో తమిళ నాడు సి. ఎమ్. జయలలితగా నటించింది. ఇది తెలుగులో వీరప్పన్ తమిళంలో వన యుద్ధంగా విడుదలైంది.

### శ్రీ ప్రియ



తెలుగు తమిళ కన్నడ మలయాళ హిందీ సినిమాల్లో నటించిన, దర్శకత్వం కూడా నిర్వహించిన శ్రీప్రియ అసలు పేరు అలమేలు.531956న మద్రాసులో పుట్టింది. క్లాసికల్ నృత్యంలో శిక్షణ పొందిన ఈమె కుటుంబం సంగీతంలో ప్రవీణులే. కమల్ హసన్ పెట్టిన మక్కల్ నీది మయం పార్టీలో కొనసాగుతోంది. రజనీ కాంత్, కమల్ హసన్ తో అధిక చిత్రాల్లో కథా నాయికగా నటించిన ఈమె పి. మాధవన్ దర్శకత్వం చేసిన 'మురుగన్ కాట్టియ వాలన్ 'సినిమా తో 1974లో పరిచయ మైంది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజు పాత్రకు 1977లో ఉత్తమ నటి బహుమతి పొందింది. జాతీయ సినిమా అవార్డుల, తమిళ నాడు రాష్ట్ర సినీ అవార్డుల కమిటీల్లో జ్యూరీ సభ్యురాలు గాను వ్యవహరించింది. చిలకమ్మ చెప్పింది, అంతులేని కథ, ఆమె కథ, పొట్టేలు పున్నమ్మ , బెజవాడ బెబ్బులి ఇలా 17 చిత్రాలు చేసింది. 2014లో వెంకటేష్ ,మీనా నటించిన 'దృశ్యం 'సిన్మా దర్శకత్వం వహించింది. దృశ్యం మంచి విజయమే మరో అవకాశం వచ్చి 2016లో ఆమె దర్శకత్వంలో 'ఘటన' తెలుగు సినిమా కూడా విడుదలైంది. తమిళంలో 4 కన్నడంలో 1 సినిమా దర్శకత్వం వహించింది. టెలి సీరియల్స్ 5 డైరెక్ట్ చేసింది. తమిళంలో 109, మలయాళం లో 9, హిందీలో 1, కన్నడంలో10 సినిమాల్లో నటించింది.

### మీనా కుమారి

ట్రాజెడీ క్వీన్ గా చక్కని రచయిత్రిగా గాయకురాలుగా, కాస్ట్యూమ్ డిజైనర్ గా బహు ముఖ ప్రశంసలు పొందిన మీనా కుమారి అసలు పేరు మహా జబీన్ బానో. బొంబాయిలో ఇక్బాల్ బేగం, అలీ బక్స్ దంపతులకు 181933న రెండో కూతురుగా పుట్టింది. చదువు మీద ఆసక్తి వున్నా నటులైన తల్లి తండ్రి స్టూడియోలకు తీసుకుని వెడుతూంటే 1938లో దర్శకుడు విజయ్ భట్ 'లెదర్ ఫేస్' సినిమాలో బేబీ జబీన్ గా నటింప జేసి మొదటి రోజున ₹2500లు ఇచ్చారు. అలా సంపాదన ప్రారంభించి కుటుంబాన్ని పోషించేది. షూటింగులతో చదువు సాగక ట్యూషన్లకు వెడుతూ హవేలీ వరకు బాలనటిగ చేసింది.
దర్శకుడు రాజా నీనే 'బచ్చోమ్ కె ఖేల్ ' సినిమాతో 1945లో హీరోయిన్ని చేసి మీనాకుమారి అనే పేరు పెట్టి మే 1946 లో విడుదల చేస్తే మంచి పేరు వచ్చింది. ఆరేడు సినిమాలు చేసాక 1948లో వీర్ ఘటోత్కచ్ సినిమా నుంచి పౌరాణిక చిత్రాలు కొన్ని చేసింది. బాల నటిని చేసిన విజయ్ భట్ దర్శకత్వంలో రూపొందిన సంగీత ప్రధాన చిత్రం 'బైజు బావ్రా' 1952లో విడుదలై మీనా కుమారికి అఖండ ఖ్యాతి తెచ్చింది. పరిణీతా, దో భీగా జమీన్(విమల్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్లో తొలిసారి పాల్గొని అంతర్జాతీయ బహుమతి గెలుచుకుంది) ఫుట్ పాత్, డాయిరా, దానా పానీ, చాందినీ చౌక్, ఇల్జామ్, ఆజాద్, బందీష్, రుక్సానా, మేమ్ సాహిబ్, ఏక్ హీ రస్తా, బంధన్, హాలకు సినిమాల ఘన విజయంతో ఎంతో పేరొచ్చింది.తెలుగు సినిమాల ఆధారంగా ఎల్. వి. ప్రసాద్ రూపొందించిన శారద, మిస్. మేరీ చిత్రాలు 1957లో తెచ్చిన పేరు అంతా ఇంతా కాదు. సహారా, యహుది, చిరాగ్ కహాన్ రోష్ని కహాన్, షరారత్, చాంద్, బాబీ కా చుడియాన్, దిల్ అప్నా ఔర్ ప్రీత్ పరాయి, జిందగీ ఔర్ ఖ్వాబ్ ఇలా అన్నీ ఆమెకు పేరు తెచ్చిన సూపర్ హిట్ చిత్రాలే.



ఇంకా వున్నారు



- వి.ఎస్.ఆర్. కేశవరావు
సెల్: 9989235320

## మిమ్మల్ని కూడా హగ్ చేయాలనే వచ్చా



ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల తర్వాత సినిమా వేడుకల్లో మహిళలందరూ చీరలోనే కనిపిస్తున్నారని సీనియర్ నటుడు నరేశ్ అన్నారు. అలా ఉండటం భారతీయ సంస్కృతి అని పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన 'హే భగవాన్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడారు. ఈ వేడుకలో.. వాలంటైన్ వీక్‌లో భాగమైన 'హగ్ డే' సందర్భంగా టీమ్‌లోని పురుషులను ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపిన నరేశ్.. శివానీ నాగారం, చొక్కారపు స్రవంతికి కేవలం విషెస్ చెబుతూ వారి వస్త్రధారణను ప్రస్తావించారు. ''మిమ్మల్ని కూడా హగ్ చేయాలనే వచ్చా. కానీ, మీరు లక్షణంగా చీరలు ధరించారు. కొన్ని పరిణామాల తర్వాత వేదికలపై చాలామంది చీరల్లోనే కనిపిస్తున్నారు'' అని అన్నారు.
సుహాస్ హీరోగా దర్శకుడు గోపి తెరకెక్కించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'హే భగవాన్'. శివానీ హీరోయిన్. యాంకర్ స్రవంతి కీలక పాత్ర పోషించారు. సినిమా ఈ నెల 20న విడుదల కానున్న సందర్భంగా ఏర్పాటైన ఈవెంట్‌కు హీరో సాయి దుర్గాతేజ్ ముఖ్య అతిథిగా హాజరై, సినిమా మంచి విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ''నా 'సుప్రీమ్' సినిమా ప్రమోషన్స్ సమయంలో సుహాస్‌ను చూశా. ఆయన అప్పుడెలా ఉన్నారో ఇప్పుడూ అలాగే ఉన్నారు. నరేశ్ అంకుల్ ఎప్పుడూ స్నేహపూర్వకంగా ఉంటారు. ఈ సినిమా మీ అందరికీ వినోదం పంచుతుందని అనుకుంటున్నా'' అని సాయి దుర్గాతేజ్ పేర్కొన్నారు.



## నాగబంధం టీజర్‌ను లాంచ్ చేయనున్న మహేష్ బాబు



విరాట్ కర్ణ హీగా అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'నాగబంధం' ఈ వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 15న మహా శివరాత్రి శుభ సందర్భంగా ఉదయం 11:11 గంటలకు టీజర్ విడుదల కానుండగా, మేకర్స్ ఇప్పుడు ఎక్సయిటింగ్ అప్‌డేట్ ఇచ్చారు. సూపర్ స్టార్ మహేష్ బాబు టీజర్‌ను లాంచ్ చేస్తారని టీం అనౌన్స్ చేసింది. సూపర్ స్టార్ అసోసియేషన్ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న బజ్‌ను మరింత పెంచుతుంది. ప్రధాన తారాగణం పోస్టర్‌లను రిలీజ్ చేసిన టీం, ఇటీవల రిషబ్ సాహ్నిని ఆఫ్ఘన్ పాలకుడు అబ్దాలి పాత్రలో పరిచయం చేసింది. 1750లో సెట్ చేయబడిన ఈ చిత్రం నాగబంధం సంప్రదాయంతో ముడిపడి ఉన్న పురాతన రహస్యాలను అద్భుతంగా చూపించబోతుంది.
నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తుండగా, జగపతి బాబు, జయప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, ఆర్‌సి ప్రణవ్ ఎడిటింగ్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్న ఈ విజువల్ వండర్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధంగా ఉంది.

## కాంతార బ్యూటీకి కలిసొచ్చేనా?

కన్నడ బ్యూటీలకు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. రష్మిక, శ్రీలీలకు ఇప్పటికే తెలుగులో స్టార్ హీరోయిన్లుగా తమ పేరును లిఖించుకున్నారు. పుష్ప మూవీతో రష్మిక మందన్నా రేంజ్ పూర్తిగా మారిపోయింది. అలా కన్నడ భామలు ఇలా వచ్చి తెలుగులో సూపర్ పవర్‌గా ఎదిగారు. టాలీవుడ్ ఇండస్ట్రీలో తెలుగమ్మాయిల కంటే శాండల్‌వుడ్ భామలకే ఫుల్ డిమాండ్ ఉంటోంది. ఇప్పుడదే అదే బాటలో మరో కన్నడ బ్యూటీ అడుగులేస్తోంది. గతేడాది కాంతార-2 మూవీతో అందరి చూపులు తనవైపు తిప్పుకున్న భామ రుక్మిణి వసంత్. ఇప్పుడు టాలీవుడ్‌పై దృష్టి సారించింది. సప్త సాగరాలు దాటి లాంటి కన్నడ మూవీతో సూపర్ హిట్ కొట్టిన ముద్దుగుమ్మ.. ప్రస్తుతం టాలీవుడ్‌లోనూ ఛాన్స్ కొట్టేసింది. ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ కాంబోలో వస్తోన్న చిత్రంలో అవకాశం దక్కించుకుని టాలీవుడ్ దృష్టిని ఆకర్షించింది.

## ది ప్యారడైజ్ ఆగస్టు 21న రిలీజ్



నేచురల్ స్టార్ నాని మ్యాసీవ్ పీరియడ్ యాక్షన్ డ్రామా ది ప్యారడైజ్. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ ఎల్ వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం హాటెస్ట్ పాన్‌ఇండియన్ రిలీజెస్ లో ఒకటిగా శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. హైదరాబాద్‌లో చిత్రీకరణ జోరుగా సాగుతుండగా, నిర్మాతలు ఇప్పుడు రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. 'ది ప్యారడైజ్' చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ రిలీజ్ డేట్ సినిమాకు వరుసగా మూడు వారాల పండుగలు కలిసిరానున్నాయి. మొదటి వారంలో ఓనం, మిలాద్‌ఉన్‌నబీ పండుగలు మధ్యలో రావడం, రెండో వీకెండ్‌లో రాఖీ బంధన్, మూడో వారంలో జన్మాష్టమి ఉండటం వల్ల భారీ బడ్జెట్ స్పెక్టకిల్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద బిగ్ అడ్వాంటేజ్ ఉండబోతుంది. ప్లానింగ్‌లో ప్రత్యేక గుర్తింపు ఉన్న నాని, ఈ నిర్ణయంతో మరోసారి తన మార్కెట్ సెన్స్‌ని చూపించారు.
ప్రస్తుతం టీమ్ చిత్రంలోని హైలైట్‌లలో ఒకటైన నాని ఇంట్రడక్షన్ సాంగ్ చిత్రీకరణలో బిజీగా ఉంది. వందలాది డ్యాన్సర్లతో భారీ సెట్లో తెరకెక్కుతున్న ఈ పాటకు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ హై వోల్టేజ్ మాస్ ట్యూన్ అందించగా, నాని రా ఎనర్జీకి సరిపోయేలా రూపొందిస్తున్నారు. కోరియోగ్రాఫర్ సుధన్ మాస్టర్ భారీ విజువల్స్‌తో ఈ సాంగ్‌ని పూర్తి స్థాయి క్రౌడ్ ప్లీజర్‌గా తీర్చిదిద్దుతున్నారు. ది ప్యారడైజ్‌లో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు వంటి స్టార్ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ చివరి దశకు చేరుకుంటుండగా, నాని ఫియర్స్ 'జడల్' లుక్‌తో విడుదలైన రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై ఉన్న ఎక్సైట్మెంట్‌ను మరింత పెంచింది. ఈ చిత్రానికి సిహెచ్ సాయి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, నవీన్ నూలి ఎడిటర్‌గా, అవినాష్‌కొల్లా ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రం ఎనిమిది భాషల్లో పాన్‌వరల్డ్ విడుదల కానుంది.



## మెన్షన్ హౌస్ మల్లేష్ టీజర్ లాంచ్

శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీష్ దర్శకత్వం లో తెరకెక్కిన చిత్రం 'మెన్షన్ హౌస్ మల్లేష్'. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల హీరోయిన్స్. కనకమేడల ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజేష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలలై ఈ సినిమా ఫస్ట్ లుక్, ఫస్ట్ సింగిల్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. మార్చి 6న ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ రోజు మేకర్స్ సినిమా టీజర్ ని లాంచ్ చేశారు. ఈ వేడుకకు మాస్ కా దాస్ విశ్వక్ సేన్, డైరెక్టర్ తరుణ్ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.టీజర్ లాంచ్ ఈవెంట్ లో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ...ఈ సినిమా టీజర్ ఈఎన్ ఈ సెట్లో శ్రీనాథ్ చూపించాడు. చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. ఈ టీంలో నాకు చాలామంది తెలిసిన వాళ్ళు ఉన్నారు. సురేష్ బొబ్బిలి గారి మ్యూజిక్ కి నేను. పెద్ద ఫ్యాన్ ని ఆయన విరాటపర్వం నాకు చాలా ఇష్టం. శ్రీనాథ్ చాలా సున్నితమైన మనిషి. ఈ నగరానికి ఏమైంది రిపీట్ లో కూడా అద్భుతంగా చేశాడు. తప్పకుండా తను అందరినీ అలరిస్తాడు. ఈ సినిమాలో అందరూ అద్భుతంగా చేశారు. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్.



## చూసి ఎంజాయ్ చేయండి

బిగ్ బాస్ షో ద్వారా ఎంతోమంది ఫేమస్ అయ్యారు. అలా పాపులారిటీ సంపాదించుకుంది వారిలో దివి వద్త్యా ఒకరు. అంతకముందు సినిమాల్లో చిన్న చిన్న రోల్ ప్లే చేసిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాల్లో నటించే స్థాయికి ఎదిగింది. మెయిన్‌గా సోషల్ మీడియాలో నెట్టింట బోల్డ్ డ్రెస్సులతో రచ్చ చేస్తూ ఉంటుంది ఈ అమ్మడికి ఫాలోవర్స్ కూడా చాలా ఎక్కువ మందే ఉన్నారు. అయితే రీసెంట్‌గా ఈ భామ నవీన్ చంద్ర నటించిన 'హనీ' సినిమాలో ఈ చిన్నది కూడా నటించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దివి వద్త్యా షాకింగ్ కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ.. 'మనం బయట వేరే కంట్రీకి వెళ్లినప్పుడు, లేకపోతే వేరే ప్లేస్‌లో ఉన్నప్పుడు, బీచ్‌లో ఉన్నప్పుడు ఎలాంటి అవుట్ ఫిట్ వేసుకుంటావో వేసుకో. గాయ్స్ మీరు చేంజ్ అవ్వండి అమ్మాయి బ్యూటీని చూసి ఎంజాయ్ చేయండి.. కానీ కామెంట్ చేయకండి' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.